VISALAANDHRA Phone No. 75301 ఉదయం ★★★ Regd No. H/VJ/47

విశాలాంధ్ర

704539

సంపుటి 24 సంచిక 171 | విజయవాడ 27—9—74 శుక్రవారం | 6 పేజీలు 25 పైసలు

విశాలాంధ్ర చందా వివరాలు

	ఏజెంటుద్వారా	పోస్టుద్వారా
నెలకు	రు. 7_50	రు. 8_10
3 నెలలకు	22_50	24_30
6 నెలలకు	44_00	47_60
సంవత్సరమునకు	88_00	95_20

ఆదివారంతో సహా దినపత్రిక 25 పైసలు

T. A. C. T. ఖాతాదారులకు ముఖ్య ప్రకటన

అయ్యా,

మావద్ద స్టాకు పరిమితంగా వుండుటవలన ది 5_10_74 తేదీ నాటికి మాకు చేరు ఆర్డరులను మాత్రమే కన్ఫరమ్ చేయగలము. కావున మా ఖాతాదారులు, హోల్‌సేల్ డీలర్లు యీ విషయమును గమనించి తమ ఆర్డరులను పై తేదీలోపల మాకు చేరునటుల పంపించ కోరుచున్నాము.

ఇట్లు,
T. A. C. T. I. M. CO.,
Palakol.

ఇదీ లోకం



"షుగరు కార్డుగానీ. మిల్కుకార్డుగానీ యిస్తామని ప్రోత్సహిస్తే మన కార్యక్రమం మరీ జోరుగా జరగొచ్చు."

బీడీ ఆకుల పేరుతో సిమెంట్ దొంగ రవాణా

విజయవాడ, సెప్టెంబరు 26

బీడీ ఆకులపైన కప్పి 105 సిమెంట్ బస్తాలను రవాణాచేస్తున్న ఒక లారీని విజయవాడ పోలీసులు గత రాత్రి స్వాధీనం చేసుకున్నారు.

ఎలాటి పర్మిట్ లేకుండా భద్రాచలం నుండి గుంటూరుజిల్లాలోని వేటపాలెంకు యీ లారీ వెళ్తున్నది. డ్రైవర్, క్లీనర్‌తో సహా నలుగురు వ్యక్తులను పోలీసులు యీ సందర్భంగా అరెస్టుచేశారు. (ఏ.పి.)

మందులు లేని ప్రభుత్వ హాస్పిటల్

(విశాలాంధ్ర విలేకరి)

విజయవాడ, సెప్టెంబరు 26

విజయవాడ ప్రభుత్వ హాస్పిటల్‌లో అవసరమైన పెక్కు మందులు లేవు.

మార్చిలో మందులు కొనటానికి ప్రభుత్వం నిధులను మంజూరు చేస్తుంది. నిర్దిష్ట ధరలకు నిర్దిష్ట పరిమాణంలోనే హాస్పిటల్స్ మందులను కొనవలసి వుంటుంది. అయితే కంట్రాక్టుపై సంతకాలు జరిగేలోగా మందుల ధరలను కేంద్ర ప్రభుత్వం పెంచింది. రాష్ట్ర ప్రభుత్వం నిధుల కేటాయింపును పెంచలేదు.

కొత్త ధరలకు స్థానిక అధికారులు కొనకూడదు. రాజధానివారు ఏ సంగతి తేల్చరు. పేషెంట్లకు మాత్రం అవసరమైన మందులు లేవు.

ఇది యిలా వుండగా ముడిసరుకులు లభ్యం గావడంలేదన్న నెపంతో కొన్ని కంపెనీలు మామూలు సరఫరాలను బంద్ చేశాయి.

73 వేల మందికి పైగా నిరుద్యోగ ఇంజనీర్లు

కేంద్ర విద్యామంత్రి శ్రీ హసన్ వెలడి

మద్రాసు, సెప్టెంబరు 26

దేశంలో ఎంప్లాయిమెంట్, ఎక్స్చేంజీల ద్వారా 73 వేల మందికిపైగా ఇంజనీర్లు ఉద్యోగాలకోసం ఎదురుచూస్తున్నారని కేంద్ర విద్యామంత్రి శ్రీ నూరుల్ హసన్ నేడిక్కడ విమానాశ్రయంలో చెప్పారు.

మధురై నుంచి శ్రీ హసన్ నేడిక్కడకు వచ్చారు. వృత్తిపరమైన కోర్సులు నిరుద్యోగులందరికి ఉపాధిని కల్పించవని ఆయన చెప్పారు.

దేశంలో 25 వేలమంది ఇంజనీరింగ్ కోర్సు నభ్యసించటానికి సౌకర్యాలు ఉన్నప్పటికి, 18 వేల మంది అభ్యర్థులుమాత్రమే ఈ కోర్సు నభ్యసించటంపట్ల ఆయన విచారం వెలిబుచ్చారు.

విద్యావ్యవహారాల కేంద్ర సలహాబోర్డు వచ్చే నవంబర్‌లో ఢిల్లీలో సమావేశమై విద్యావిధానాన్ని చర్చిస్తుందని ఆయన చెప్పారు.

ఎక్సైజు అధికారుల దాడిలో విదేశీ కరెన్సీ పట్టివేత

హైదరాబాదు, సెప్టెంబరు 26

నిన్న రాత్రి యిక్కడ ప్రైవేటు బాటిలర్స్ కంపెనీ డైరెక్టరు హర్‌భజన్ సింగ్ నివాసగృహంలో 10 గంటలపాటు కేంద్ర ఎక్సైజు అధికారులు గాలించి విదేశీ కరెన్సీ, కొన్ని చీరలు, నేరానికి సంబంధించిన కొన్ని పత్రాలను స్వాధీనం చేసుకున్నారు.

హర్‌భజన్‌సింగ్ తన కుటుంబంతో కలిసి కారులో ఢిల్లీ వెళుతుండగా ఆయనను ఆపి, ఆయన యిల్లు సోదా చేసినట్లు ఎక్సైజు అధికారులు తెలిపారు. కారులో సోదా చెయ్యగా 1200 అమెరికన్ డాలర్లు 10 విదేశీ చీరలు దొరికాయి. అయితే వాటిని అక్కౌంటులో చేర్చలేదు.

తర్వాత, ఆయన యింటిపైన ఇన్‌కమ్‌టాక్స్ అధికారులు దాడి జరిపి, నేర స్వభావం కలిగిన కొన్నిపత్రాలను స్వాధీనం చేసుకున్నారు. ఆ పత్రాలు, ఫైళ్ళు వున్న పెట్టెకు సీళ్ళు వేసినట్లు ఆ వర్గాలు తెలియజేశాయి.

హర్ భజన్‌సింగ్ బావమరది సింగపూర్‌లో నివసిస్తూ, ఒక అమెరికా బాటిలర్స్ కంపెనీలో గణనీయమైన సంఖ్యలో వాటాలు కొన్నట్లు, హర్‌భజన్‌సింగ్ తరచుగా అక్కడికి వెళ్ళి వస్తుంటాడని విశ్వసనీయ వర్గాలు తెలిపినట్లు వారు తెలియజేశారు.

జి. డి. ఆర్. తో చర్చలకు ధార్

బెర్లిన్, సెప్టెంబరు 25

జి. డి. ఆర్.తో యింకా ఆర్థిక, శాస్త్రీయ, సాంకేతిక సహకారాన్ని అభివృద్ధిచేసుకునేందుకై చర్చల నిమిత్తం ప్రణాళికాశాఖ మంత్రి డి. పి. ధార్ నేడు యిక్కడికి చేరుకున్నారు.

విమానాశ్రయంలో ఉపప్రధాని గెర్హార్డ్ ఆయనకు స్వాగతం చెప్పారు.

తీవ్ర విద్యుత్ కొరత ప్రమాదం

న్యూఢిల్లీ, సెప్టెంబరు 25

దేశంలోని పెద్ద పెద్ద రిజర్వాయర్లలో నీటిమట్టం చాలా తక్కువ వున్నందున రానున్న నెలల్లో విద్యుత్ కొరత తీవ్రంగా వుండే సూచనలు కానవస్తున్నాయి.

16 ప్రధాన రిజర్వాయర్లు దేశంలోని విద్యుత్ ఉత్పత్తిలో 40 శాతం విద్యుత్‌ను ఉత్పత్తి చేస్తున్నాయి. వీనిలో 13 రిజర్వాయర్లలో నీటి మట్టం యింతవరకు పూర్తిస్థాయికి చేరుకోలేదు. భాక్రాప్రాజెక్టుకు చెందిన గోవిందసాగర్ డామ్, ఉత్తర ప్రదేశ్‌లోని రిహండ్ డామ్‌లో నీరు చాలా తక్కువగా వుంది.

పూర్తిగా నీరు నిండివున్న మూడు ప్రాజెక్టులు దామోదర్‌లోయ కార్పొరేషన్, నాగార్జునసాగర్, తుంగభద్రలు మాత్రమే.

అధిక లాభార్జనకు పాల్పడిన వ్యాపారి అరెస్టు

కలకత్తా, సెప్టెంబరు 25

పప్పు ధాన్యాలను అక్రమంగా నిల్వచేసి అధిక లాభార్జనకు పాల్పడుతున్నారన్న ఆరోపణపై ప్రహ్లాద అగర్వాల్ అనే ప్రముఖ వ్యాపారిని నేడు దేశ రక్షణ నిబంధనల క్రింద పోలీసులు అరెస్టు చేశారు.

ఈ వ్యాపారికి చెందిన నాలుగు గోడౌన్ల నుండి 2 వేల టన్నులకు పైగా పప్పు ధాన్యాలు ఇటీవల పట్టివేయబడ్డాయి.

ఢిల్లీలో తన కుమారుని పేరుతోగల ఒక వ్యాపార కేంద్రం ద్వారా ఢిల్లీ, హర్యానా, పంజాబ్, ఉత్తర ప్రదేశ్‌లనుండి ఈయన పప్పుధాన్యాలను కొనుగోలు చేస్తుంటాడని తెలుస్తున్నది.

కప్పు - ఎలుక స్నేహం

అత్యున్నత ప్రమాణంలో అంతర్జాతీయ సహకారం అవసరమని కామన్వెల్తు ఆర్థిక మంత్రుల సమావేశంలో శ్రీ చావన్ అన్నారు—
అంటే కామన్వెల్తుతో యింకా దగ్గరగా ముడివడి ఉండటమా?

"నిబంధనల మేరకు పని" ఆందోళనకు సిద్ధం

ఆర్.టి.సి. నాయకులు శ్రీ కపర్ది హెచ్చరిక; సిబ్బంది రిలే నిరశనలు ఆఖరు రోజుకు చేరిక

హైదరాబాద్, సెప్టెంబరు 26

ఆర్. టి. సి. కార్మికుల న్యాయమైన కోర్కెలను వెంటనే పరిష్కరించకపోతే మూడవదశ పోరాట కార్యక్రమంగా "నిబంధనల మేరకు పని" ఆందోళనను సిబ్బంది చేపడుతుందని ఆర్. టి. సి. ఎంప్లాయిస్ యూనియన్ ప్రధాన ఉపాధ్యక్షులు శ్రీ ఎం. బి. ఎస్. కపర్ది నేడిక్కడ యాజమాన్యాన్ని హెచ్చరించారు.

ఆర్. టి. సి. కార్మికులు రెండవదశ పోరాటం సందర్భంగా ఈనెల 24 నుంచి రాష్ట్ర వ్యాపితంగా నిరాహారదీక్షలు ప్రారంభించారు. నేడు నిరాహారదీక్షల ముగింపు రోజు సందర్భంగా ఆయన పై విధంగా హెచ్చరించారు.

ముషీరాబాద్‌లోని ఆర్. టి. సి. కేంద్ర కార్యాలయం ముందు జరుగుతున్న నిరాహార దీక్ష శిబిరానికి విరామ సమయంలో కార్మికులు సంఘీభావంతో ఊరేగింపుగా వచ్చిన సందర్భంగా వారిని ఉద్దేశించి శ్రీ కపర్ది ప్రసంగించారు.

ఉద్యోగుల న్యాయమైన కోర్కెలను పరిష్కరించకుండా యాజమాన్యం కార్మికులను సమ్మెకు పురికొల్పుతున్నదని ఆయన విమర్శించారు.

ఇప్పటివరకు 26 డిమాండ్లు అపరిష్కృతంగా వున్నాయని వీటి పరిష్కారానికి అనేకసార్లు కార్మికయూనియన్ ప్రయత్నించినప్పటికీ యాజమాన్యం నిర్లక్ష్యంవహించిందన్నారు.

నిబంధనల మేరకు పని ఆందోళన సాగించినప్పటికీ యాజమాన్యం సమస్యల పరిష్కృతికి ముందుకు రాని పక్షంలో కార్మికులు సమ్మెకు కూడా సిద్ధంగా వున్నారని, ఇందువల్ల ఉత్పన్నమయ్యే పరిస్థితికి అధికార్లే పూర్తిబాధ్యత వహించవలసి వుంటుందని ఆయన హెచ్చరించారు.

ప్రజా సంఘాల సంఘీభావం

తమ న్యాయమైన డిమాండ్ల సాధనలో ప్రజా సహకారాన్ని కోరిన ఆర్. టి. సి. ఉద్యోగులకు ప్రదేశ్ రైతు సంఘం అధ్యక్షులు శ్రీ వై. ఏ. కృష్ణారావు, ప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం అధ్యక్షులు శ్రీ జి. ఎల్లమందారెడ్డి, రాష్ట్ర అభ్యుదయ రచయితల సంఘ ప్రధాన కార్యదర్శి శ్రీ రాంభట్ల కృష్ణమూర్తి, ప్రదేశ్ వైద్య ఉద్యోగుల యూనియన్ ప్రధాన కార్యదర్శి శ్రీ జి. రామచందర్ తమ సంఘీభావం ప్రకటించారు. వీరందరూ నిరాహార దీక్ష శిబిరాన్ని సందర్శించి నిరాహార వ్రతులను పరామర్శించారు.

నేడు మూడవ రోజు నిరాహారదీక్ష ప్రారంభంలో హైద్రాబాదు బస్సు డిపో ముందు 200 మంది కార్మికులు ధర్నా జరిపారు.

"అక్కా ధర్నా కల్కా స్ట్రయిక్ (నేడు ధర్నా రేపుసమ్మె) ఎక్స్‌గ్రేషియానహీఁదేతో బస్‌కాపయా; నహీచలేగా (ఎక్స్‌గ్రేషియా పెంచకపోతే బస్సు చక్రాలు కదలవ్")" అంటూ కార్మికులు నినాదాలిచ్చారు.

నిరశనదీక్ష విరమణ

ముషీరాబాద్‌లో ఆర్. టి. సి. కేంద్ర కార్యాలయం ముందు మూడురోజులనుండి తమ కోర్కెలసాధనకై కార్మికులు నిర్వహిస్తున్న నిరహారదీక్ష రాష్ట్రశాసనసభ ప్రతిపక్ష నాయకులు శ్రీ వేములపల్లి శ్రీకృష్ణ నేటి సాయంత్రం పాలను త్రాగించడంతో విరమించబడింది.

అంతకుముందు హైద్రాబాదు యువజన విద్యార్థి సమాఖ్యల ఆధ్వర్యాన ఆర్.టి.సి. కార్మికుల కోర్కెల సాధనకు సంఘీభావముగా హిమాయత్ నగర్ నుండి నిరాహార శిబిరం వద్దకు సైకిలు ర్యాలీని నిర్వహించారు.

యూసఫ్ పటేల్ లొంగుబాటు

బొంబాయి, సెప్టెంబరు 26

దేశంలో ముగ్గురు ప్రముఖ స్మగ్లర్లలో ఒకరైన యూసఫ్ పటేల్ నేడుదయం 11.30 గంటలకు బొంబాయి పోలీసులకు లొంగిపోయాడు.

స్మగ్లర్ల నిర్బంధానికి సంబంధించిన ఆర్డినెన్స్ జారీ చేయబడిన నాటి నుండి యూసఫ్ తప్పించుకతిరుగుతున్నాడు.

శ్రీశైలం ప్రాజెక్టు నిర్మాణంలో జాప్యం

ముఖ్యమంత్రి వద్దకు రాజకీయ నాయకుల రాయబారం

హైదరాబాదు, సెప్టెంబరు 25

శ్రీశైలం ప్రాజెక్టు నిర్మాణంలో జాప్యం జరుగుతోందనీ, అందువల్ల ఆంధ్రరాష్ట్రానికి ప్రత్యేకించి, రాయలసీమకు చుట్టుపట్ల గల వెనుకబడిన జిల్లాలకు ఎంతోనష్టం కలుగుతుందనీ శ్రీయుతులు పూల సుబ్బయ్య (ప్రదేశ్ రైతు సంఘ కార్యదర్శి), జి. సోమశేఖర్ (ప్రదేశ్ కాంగ్రెసు కమిటీ), డి.వి.యస్.యన్.రాజు (ఎంప్లాయీస్ అండ్ మజ్దూర్ యూనియన్ కార్యదర్శి)మరో ఐదుగురుముఖ్యమంత్రి వద్దకుఈనెల 24వ తేదీన రాయబారం వెళ్ళి తెలియజేశారు. యన్. యం. ఆర్. కార్మికులను వర్క్‌ఛార్జిడు కార్మికులుగామార్చవలసిందిగాను, ప్రభుత్వం జారీచేసిన జి వో. లను అమలు జరపవలసిందిగాను, 1974 మేలో ముఖ్యమంత్రి శ్రీశైలం ప్రాజెక్టు పర్యటన సందర్భంగా వాగ్దానంచేసిన మేరకు కరువుభత్యం పెంచవలసిందిగాను కోరారు. ప్రాజెక్టునిర్మాణాన్ని త్వరగా పూర్తిచెయ్యడానికివీలుగా కార్మికుల సమస్యను పరిష్కరించ వలసిందిగాను, ప్రతి సంవత్సరం రు. 15 కోట్లు శ్రీశైలం ప్రాజెక్టు నిర్మాణానికి కేంద్రం కేటాయించేటట్లు చూడవలసిందిగాను వారు కోరారు.

పి. డబ్ల్యు. డి. శాఖ కార్యదర్శికి ప్రాజెక్టుకు సంబంధించిన వివరాలను తయారు చెయ్యవలసిందిగా ఆదేశించినట్లు, వివరాలు రాగానే తుదిరూపం యివ్వ వచ్చునని ముఖ్యమంత్రి తెలియజేశారు. ఆ సమస్యలో తల మునకలై వున్నట్లు ఆయన చెప్పారు.

గత ఐదు సంవత్సరాలుగాను, ఈ సంవత్సరం వర్షాభావంవల్ల కంభంచెరువులో నీళ్ళు లేక, గిద్దలూరుతాలూకాలో అనావృష్టి ఏర్పడిందనీ, అందుకు శాశ్వత పరిష్కారంగా కృష్ణానది జలాలను చెరువుకు మళ్ళించవలసిందిగాను కోరారు.

పై అంశాన్ని సానుభూతితో పరిశీలించి, కంభం చెరువు క్రింద ప్రస్తుతం వున్న ఆయకట్టుకు నీరు సరఫరా చెయ్యడానికి వీలుగా కృష్ణాజలాలను మళ్ళించే అంశంపై పరిశీలిస్తామని ముఖ్యమంత్రిహామీయిచ్చారు. అక్టోబరు నెలలో కంభం చెరువుప్రాంతాన్ని సందర్శిస్తానని కూడా ఆయన తెలిపారు.

మార్కాపురంలోని ప్రభుత్వ పరిశ్రమలో పనిచేస్తున్న సుమారు 10 వేలమంది కార్మికులు విద్యుచ్ఛక్తి కొరత కారణంగా నిరుద్యోగులయ్యే ప్రమాదం ఏర్పడిందనీ, అందుచేత ఆ ఫ్యాక్టరీకి విద్యుచ్ఛక్తి సరఫరా చేయవలసిందిగా కోరారు

విద్యుచ్ఛక్తి కోత వెంటనే రద్దుచేయిస్తానని ముఖ్యమంత్రి హామీ యిచ్చారు.

పోలీసుకాల్పుల్లో ఇరువురు మృతి

విజయవాడ రైల్వే స్టేషను యార్డులో

విజయవాడ, సెప్టెంబరు 26

నేటి తెల్లవారుఝామున విజయవాడ రైల్వేయార్డులోని రెండు వ్యాగన్లను కొంతమంది వ్యక్తులు బద్దలుకొట్టి అందులోని చింతపండును లూటీ చేస్తుండగా రైల్వే పోలీసులు జరిపిన కాల్పుల్లో యిద్దరు వ్యక్తులు అక్కడికక్కడే మరణించారు.

తెల్లవారుజామున 4 గంటలకు రైల్వే పోలీసులు డ్యూటీ చేస్తుండగా కొంతమంది వ్యాగన్లను లూటీ చేస్తున్నట్లు కనుగొన్నారని, వారిని పోలీసులు నివారించబోగా వారిపై రాళ్ళు విసిరారని, కొంతమంది పోలీసులకు గాయాలుకూడా తగిలాయని, తరువాత రైల్వే పోలీసులు కాల్పులు జరిపారని, దక్షిణ మధ్య రైల్వే విజయవాడ డివిజనల్ సూపరింటెండెంటు శ్రీ టి.వి.శ్రీనివాసన్ పి. టి. ఐ. వార్తాసంస్థకు తెలియజేశారు.

నగరంలో భూపేష్ బహిరంగ సభ

ఈనెల 28 న

హైదరాబాద్, సెప్టెంబర్ 26

స్థానిక రాంకోటిలోని సరోజనీ దేవి హాలులో ఈనెల 28 న జరిగే బహిరంగ సభలో కమ్యూనిస్టు నాయకులు శ్రీ భూపేష్ గుప్తా ప్రసంగిస్తారు.

28 వ తేదీన సనత్‌నగర్, పారిశ్రామిక ప్రాంతం, అజమాబాద్, అఫ్జల్‌గంజ్ నుండి సరోజనీదేవి హాలువద్దకు ప్రదర్శనలు జరుపుతూ రావాలని సిటీ ట్రేడ్ యూనియన్ కౌన్సిల్ నిర్ణయించింది.

ప్రదర్శనలో అధిక సంఖ్యలో పాల్గొని శ్రీ భూపేష్‌గుప్తాకు ఘనస్వాగత మివ్వవలసిందిగా సిటీ ట్రేడ్ యూనియన్ కౌన్సిల్ కార్యదర్శి ఒక ప్రకటనలో కార్మికులకు విజ్ఞప్తి చేశారు.

కమ్యూనిస్టు కార్యకర్తల బైఠాయింపు

విజయవాడ, సెప్టెంబరు 26

నిత్య జీవితావసర వస్తువుల ధరలను తగ్గించాలని డిమాండ్‌చేస్తూ పట్టణ కమ్యూనిస్టు సమితి నాయకత్వాన 150 మంది పార్టీ కార్యకర్తలు పాత బస్తీలో నేడు బైఠాయింపు జరిపారు.

కార్యకర్తలు మొదట రామ్‌గోపాల్ వీధిలో బైఠాయింపు జరిపారు. బియ్యం వర్తకులు నిన్న, మొన్నటి మాదిరిగా షాపులను మూసివేశారు.

కార్యకర్తలు తర్వాత కాశేశ్వరరావు మార్కెట్ సెంటర్‌లో బైఠాయించగాదాదాపు 20 నిమిషాలపాటు ట్రాఫిక్ స్తంభించిపోయింది. నేటి కార్యక్రమానికి పట్టణ యువజన సమాఖ్య ఉపాధ్యక్షులు శ్రీ కె. శేఖరబాబు నాయకత్వం వహించారు.

దాదాపు 150 మంది కార్యకర్తలు పట్టణ కమ్యూనిస్టు సమితి సభ్యులు శ్రీ మస్తాన్ నాయకత్వాన నిన్న రామ్‌గోపాల్ వీధిలో బైఠాయించారు.

సోవియట్ అమెరికా టూరిజం పెంపు

మాస్కో, సెప్టెంబరు 2[illegible]

సోవియట్ అమెరికాల మధ్య టూరిజం మరింతగా విస్తరించనున్నది.

ఈ విషయమై నిన్న యిక్కడ జరిగిన ఒప్పందం మేరకు రెండు దేశాల మధ్య రాకపోకలు టూరిస్టులకు వసతి సౌకర్యాలు పెంచనున్నామని సోవియట్ విదేశీ యానశాఖ అధ్యక్షుడు సెర్జీ నికిటిన్ తెలిపారు. ఈ ఒప్పందం "రెండు దేశాల మధ్య సంబంధాలలో నిజంగా ఒక మలుపు" అని అమెరికా వాణిజ్య టూరిజం మంత్రి లాంగ్ హార్న్ హాష్ బర్న్ అన్నారు.

వచ్చే ఏడాది టూరిజంపై రెండు దేశాల ప్రతినిధులు మరింత వివరంగా చర్చిస్తారు.

జంటనగరాల ఉద్యోగులకు సి. సి. అలవెన్సు పెంపు

రాష్ట్ర మంత్రివర్గ నిర్ణయం

హైద్రాబాద్, సెప్టెంబరు 26

జంటనగరాలలోని గవర్నమెంటు, క్వాజీ గవర్నమెంటు ఉద్యోగులకు కేంద్రోద్యోగులతో సమానంగా సిటీ కాంపెన్సేటరీ అలవెన్సు మంజూరు చేయడానికి రాష్ట్ర మంత్రివర్గం నేడిక్కడ నిర్ణయించింది

నిర్ణయం తీసుకున్న సమావేశానికి ముఖ్యమంత్రి శ్రీ వెంగళరావు అధ్యక్షత వహించారు,

ప్రస్తుతం సిటీ కాంపెన్సేటరీ అలవెన్సు పొందుతున్న ఉద్యోగులకు మాత్రమే ఈ నిర్ణయం వర్తిస్తుంది. నిర్ణయం అక్టోబరు 1 నుంచి అమలులోకి వస్తుంది.

32 వేల మంది ఉద్యోగులకు వర్తించే ఈ నిర్ణయంవల్ల ప్రభుత్వానికి ఏటా కోటి రూపాయలు అదనంగా ఖర్చవుతుందని ముఖ్యమంత్రి వెల్లడించారు.

జంటనగరాల్లోని స్థానిక సంస్థల, ఉద్యోగులకు ఎయిడెడ్ స్కూళ్ళ టీచర్లకు కూడా ఈ నిర్ణయం వర్తిస్తుంది.

ప్రస్తుతం ఉద్యోగులు పొందుతున్న సి. సి. అలవెన్సు రేట్లు ఈ క్రిందివిధంగా వున్నాయి:

1. రు. 89 వరకు మూలవేతనం ఉన్న వారికి—రు. 6.
2. రు. 92 నుంచి 149 వరకు రు. 7½
3. రు. 150 నుంచి 399 వరకు రు. 9
4. రు. 400 నుంచి 600 వరకు రు. 12

ప్రస్తుత నిర్ణయం మేరకు సి. సి. అలవెన్సులు ఈ క్రింది విధంగా పెరుగుతాయి.

1. రు 150 వరకు మూలవేతనం ఉన్న వారికి మూలవేతనంలో 10 శాతం సి. సి. అలవెన్సు.
2. రు. 600 వరకు మూలవేతనం ఉన్న వారికి మూల వేతనంలో 8 శాతం.

కేరళలో ఆఫీసర్లకు కరువుభత్యం

తిరువనంతపురం, సెప్టెంబరు 26

కేరళ ప్రభుత్వం రు. 1200_2250 వేతనాలు వచ్చే ఆఫీసర్లకు నెలకు 81 రూపాయల చొప్పున కరువుభత్యం ప్రకటించింది.

ఈ సంవత్సరము జనవరినుంచి వారికి కరువుభత్యం బకాయిలు చెల్లిస్తారు. ఇంత వేతనాలు వచ్చే ఆఫీసర్లకు కరువుభత్యం ఇవ్వడం యిదే మొదలని ముఖ్యమంత్రి శ్రీ అచ్యుతమీనన్ నేడిక్కడ విలేకరులతో అన్నారు.

పుదుచ్చేరిలో మున్సిపల్ సిబ్బంది ప్రదర్శన

పుదుచ్చేరి, సెప్టెంబరు 25

అత్యవసర వస్తువుల ధరలు విపరీతంగా పెరిగిన దృష్ట్యా తమ వేతనాలు పెంచాలని డిమాండు చేస్తూ నేడిక్కడ 200 మంది మున్సిపల్ కార్మికులు ప్రదర్శన జరిపారు.

ప్రదర్శన రాజ్ నివాస్ వద్ద ముగిసింది. ఈ సందర్భంగా ఎ. ఐ. టి.యు సి. నాయకులు శ్రీ అల్వార్ మరో నలుగురు లెఫ్టినెంట్ గవర్నర్ చెద్దీలాల్‌ను కలిసి మున్సిపల్ కార్మికులకు సవరించబడిన వేతనాలను వెంటనే అమలు జరపాలనిడిమాండ్ చేశారు.

ఈ నెల 29 తేదీ లోగా ప్రభుత్వం నుంచి సమాధానం రాకపోతే మునిసిపల్ కార్మికులు 30 వతేదీ నుంచి నిరవధిక సమ్మె ప్రారంభించకతప్పదని శ్రీ అల్వార్ తర్వాత విలేకరులతో అన్నారు.

పెట్టుబడిదారీ పంథా దుష్ఫలితాలు

బందరు సన్మాన సభలో శ్రీ చంద్ర రాజేశ్వరరావు హెచ్చరిక

బందరు, సెప్టెంబరు 26

నేడు ప్రపంచంలో సోషలిస్టు శక్తుల బలం చాలా పెరిగింది. పెట్టుబడిదారీ విధానం సంక్షోభంలో పడిపోయింది. అంతర్జాతీయ పరిస్థితి ప్రజా శక్తులకు చాల అనుకూలంగా వుంది. 10 సంవత్సరాల క్రితం యుద్ధాన్ని రాకుండా చెయ్యడానికి అవకాశాలున్నాయని అనుకున్నాం, కాని యిప్పుడు యుద్ధం ఆపివేయబడింది. కొత్తగా స్వాతంత్ర్యం పొందిన దేశాలు పెట్టుబడిదారీ దేశాలపై ఆధారపడితే సంక్షోభంలో అవి మునిగిపోవడం ఖాయమని భారత కమ్యూనిస్టుపార్టీ ప్రధాన కార్యదర్శి శ్రీ చండ్ర రాజేశ్వరరావు నిన్న యిక్కడ జరిగిన బహిరంగసభలో హెచ్చరించారు.

రాజేశ్వరరావుకు ఆర్డరు ఆఫ్ లెనిన్ బహూకరింపబడిన సందర్భంగా, ఆయనను సన్మానించేందుకు ఏర్పాటుచెయ్యబడిన బహిరంగసభలో శ్రీ రాజేశ్వరరావు ప్రసంగిస్తూ పై విధంగా చెప్పారు.

జిల్లా కమ్యూనిస్టు పార్టీ నాయకులు శ్రీ మోదుమూడి శ్రీ హరిరావు సభకు అధ్యక్షత వహించారు.

బందరుతాలూకా,పట్టణంలోని 52 సంస్థలవారు శ్రీ రాజేశ్వరరావుకు పూలమాలలు వేశారు.

వేదికపై జిల్లా కమ్యూనిస్టు సమితి కార్యదర్శి శ్రీ జె. యస్. ఆర్. ఆంజనేయ శాస్త్రి, దివి తాలూకా కమ్యూనిస్టు సమితి కార్యదర్శి శ్రీ దోనేపూడి దత్తు, బందరు తాలూకా కమ్యూనిస్టు సమితి కార్యదర్శి శ్రీ మెట్ల వీరయ్య ఆసీనులయ్యారు. బందరు పట్టణ కమ్యూనిస్టు సమితి కార్యదర్శి శ్రీ పాము సుబ్బారావు స్వాగతం చెప్పారు.

సభకు పట్టణంలోని పలువురు పెద్దలు హాజరయ్యారు.

శ్రీ రాజేశ్వరరావు యింకా క్రింది విధంగా ప్రసంగించారు:

సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా ప్రపంచశాంతికి ప్రభుత్వం తీసుకొనే చర్యలను కమ్యూనిస్టుపార్టీ బలపరుస్తుందనీ ప్రజావ్యతిరేక చర్యలను ప్రతిఘటిస్తామనీ చెప్పారు. ప్రభుత్వ డబ్బు రు. 10 వేల కోట్లువుంటే, దొంగడబ్బు రు. 11 వేలకోట్లు చలామణిలో వుందని అన్నారు. వామపక్ష పార్టీలు, కాంగ్రెసులోని అభివృద్ధికాముకులు మార్క్సిస్టుపార్టీ కమ్యూనిస్టుపార్టీ నిర్వహించే ప్రజాపోరాటాల్లో కలిసి రావాలని విజ్ఞప్తి చేశారు.

తర్వాత శ్రీ జె ఎస్. ఆర్. ఆంజనేయశాస్త్రి శ్రీ రాజేశ్వరరావుకు బహూకరింపబడిన 'ఆర్డర్ ఆఫ్ లెనిన్' ప్రాధాన్యతను వివరించారు. శ్రీ మోదుమూడి శ్రీహరిరావు అధికధరల వ్యతిరేక పోరాటాన్ని గురించి వివరించి, అక్టోబరు 25, 26, 27 తేదీలలో బందరులో జరుగనున్న కృష్ణాజిల్లా కమ్యూనిస్టుపార్టీ మహాసభను విజయవంతం చెయ్యవలసిందిగా విజ్ఞప్తి చేశారు. శ్రీ కుందేటి సుబ్బారావు వందన సమర్పణ చేశారు.

రాజకీయపార్టీల, కార్మిక సంఘాల సంయుక్తసమావేశం

బందరులో

బందరు, సెప్టెంబరు 26

ప్రభుత్వ విధానాలను ప్రజలకు అనుకూలంగా మళ్ళించే వరకు, చౌక డిపోలలో కార్డుపై నెలకు కుటుంబానికి 50 కిలోల బియ్యంయిచ్చేవరకు, దొంగనిలవల వెలికితీత ఉద్యమాన్ని నిర్వహించ వలసిన దేనని కృష్ణాజిల్లా కమ్యూనిస్టుపార్టీ నాయకులు శ్రీ శ్రీహరిరావు ప్రసంగిస్తూ ఉద్బోధించారు.

బందరులో యీ నెల 22వ తేదీన జరిగిన పట్టణంలోని వివిధ రాజకీయ పార్టీల, కార్మిక సంఘాల కార్యకర్తల సంయుక్త సమావేశంలో శ్రీహరిరావు ప్రసంగిస్తూ పై విధంగా ఉద్బోధించారు.

ఆంధ్రా సైంటిఫిక్ కంపెనీ ఎంప్లాయీస్ యూనియన్ కార్యదర్శి శ్రీబి. ఏడుకొండలు సమావేశానికి అధ్యక్షత వహించారు.

తరువాత శ్రీ పుప్పాల నాగేంద్రం (యువజన కాంగ్రెసు) తదితరులు ప్రసంగించారు.

కమ్యూనిస్టులపై చైనా కంటగింపు

కమ్యూనిస్టు వ్యతిరేకులకు బ్రహ్మరథం

న్యూఢిల్లీ, సెప్టెంబరు 26

చైనా ప్రజా రిపబ్లిక్‌కు యిపుడు జపాన్ కమ్యూనిస్టు నాయకుడు అవాంఛనీయమైన వ్యక్తి అయ్యాడు.

జపానీస్ ఎయిర్ లైన్స్ యీ నెల 29న టోకియో నుండి పెకింగ్‌కు నడుపనున్న విమానయాన ప్రారంభోత్సవం సందర్భంగా యితర రాజకీయపార్టీల ప్రతినిధులతో పాటు జపాన్ కమ్యూనిస్టు నాయకులు యం. వుమెదాను పెకింగ్ ప్రయాణానికి ఆహ్వానించింది. అయితే టోక్యోలోని చైనా దౌత్యకార్యాలయం వుమెదాకు వీసాను నిరాకరించినట్టు యిక్కడికి అందిన సమాచారం తెలియజేస్తున్నది.

ఈ విధంగా నిరాకరించటం చైనాకు కొత్తేమీకాదు.' లోగడ జార్జి పాంపిదో చైనాను సందర్శించినపుడు, పత్రికా బృందంలో ప్రయాణించదలచిన ఫ్రెంచి కమ్యూనిస్టుపార్టీ పత్రిక లాహ్యూమనైట్ విలేకరికి వీసా యివ్వటానికి నిరాకరించింది. అంతేకాదు ఫ్రాన్స్ పార్లమెంటరీ ప్రతినిధివర్గం పెకింగ్‌ను సందర్శించదలచినపుడు అందులోగల కమ్యూనిస్టు ప్రతినిధులకు కూడా వీసాలు తిరస్కరించింది. అలాగే పెకింగ్‌కు బయలుదేరే బ్రిటిష్‌గని కార్మికుల ప్రతినిధివర్గానికి నాయకత్వం వహించిన బ్రిటిష్ గని కార్మికుల ప్రియతమనాయకుడు, ప్రముఖ కమ్యూనిస్టు అయిన మోగాహెకుకూడా వీసాలు తిరస్కరించింది. అందుకు నిరసనగా ఆ ప్రతినిధి వర్గం చైనా పర్యటనను రద్దు చేసుకున్నది.

పరిస్థితి యిలావుండగా పేరుమోసిన కమ్యూనిస్టు వ్యతిరేకులు సెనెటర్ జాక్సన్‌కూ (అమెరికా) పశ్చిమ జర్మనీలో క్రిస్టియన్ డెమొక్రాటిక్ యూనియన్ చైర్మన్ కోహల్‌కు మావో యిస్టులు బహ్మాండమైన స్వాగతంపలికి సాదరంగా గౌరవించారు. (సి. యన్. యస్.)

నేడే మీ ఆర్డర్లు పంపండి

కామ్రేడ్ డాంగే ఫోటోలు

9"×11" సైజు వర్ణచిత్రం వెల : 80 పైసలు

50 కాపీలకు మించిన ఆర్డర్లే అంగీకరించగలం

20% కమీషన్, పోస్టేజి ఖర్చులు ఉచితం పూర్తి సైకం అడ్వాన్సుగా ఆర్డరుతో పంపాలి

విశాలాంధ్ర పబ్లిషింగ్‌హౌస్, విజయవాడ_2.

విశాలాంధ్ర

1974 సెప్టెంబరు 27 శుక్రవారం

ఫోర్డు బెదిరింపులు

సామ్రాజ్యవాదులు కళ్ళెర్రచేస్తే బడుగు దేశాలు బెదిరే రోజులు గతించాయి. అమెరికా అధ్యక్షుడు గెరాల్డు ఫోర్డు, విదేశాంగ మంత్రి హెన్రీ కిసింగరు లు 'గన్‌బోట్ డిప్లొమసీ' ధోరణిలో నూనె ఉత్పత్తి దేశాలను లొంగదీసుకోవటం కల్ల.

పెట్టుబడిదారీ దేశాలను ఆవహించిన ద్రవ్యోల్బణానికీ ఆర్థిక దుస్థితికి కారణం నూనె ఉత్పత్తి దేశాలు నూనె ధర పెంచటమే కారణమని ఫోర్డు, కిసింగర్ ల నుండి బూర్జువా ఆర్థికవేత్తల వరకు ఒకే పల్లవి ఆలాపిస్తున్నారు. ఇది పూర్తిగా అవాస్తవం. నూనె ఉత్పత్తి తగ్గించుతూ, వాటి ధర పెంచుతూ ఆ దేశాలు నిర్ణయం తీసుకోనకముందే అభివృద్ధి చెందిన పెట్టుబడిదారీ దేశాలలో అనేక కీలకరంగాలలో-ముఖ్యంగా ఉక్కు, బొగ్గు ఉత్పత్తి రేటు తగ్గనారంభించింది. అదే సందర్భంలో వస్తువుల ధరలు పెరుగుతూ వచ్చాయి. నిరుద్యోగం మరింత తీవ్రరూపం ధరించింది. క్రమేణా ద్రవ్య సంక్షోభం ఉధృతం కాజొచ్చింది. చివరకు పెట్టుబడిదారీ ఆర్థిక వ్యవస్థ మొత్తంగానే సంక్షోభ ఊబిలో కూరుకుపోతూండటం చూస్తున్నాం. పెట్టుబడిదారీ ఆర్థికవేత్తలు దీనినే "స్టాగ్ ఫ్లేషన్" స్టాగ్నేషన్ + ఇన్‌ఫ్లేషన్ "స్లంప్ ఫ్లేషన్" స్లంప్ + ఇన్‌ఫ్లేషన్‌గా అభివర్ణిస్తున్నారు. ఈ సర్వవ్యాపిత సంక్షోభంలో నూనె సంక్షోభం ఒక అంశం మాత్రమే.

బడుగు దేశాల సంపదను సామ్రాజ్యవాద దేశాలు ఎంతో కాలంగా దోచుకున్నాయి. ఈ దేశాల ముడిసరుకు ధరను ప్రపంచ మార్కెట్‌లో తొక్కిపెట్టడం, ఆ దేశాల తయారీ సరుకు ధరను కృత్రిమంగా పెంచే 'అడకత్తెర' విధానాన్ని సామ్రాజ్యవాదులు అవలంబించుతూ వచ్చారు. నూనె ఉత్పత్తి దేశాలను, అమెరికా, బ్రిటన్, హాలెండు ఎంత నిర్దాక్షిణ్యంగా, దోచుకున్నాయో తెలుసుకునేందుకు ఒక్క ఉదాహరణ. ఈ మూడు దేశాల విదేశీ పెట్టుబడులకు చెందిన మొత్తం లాభాలలో 40శాతం లాభం నూనెనుండే ఆర్జించాయి. కారు చౌకగా నూనె కొని, విచ్చలవిడిగా దానిని దుర్వినియోగ పరచాయి సామ్రాజ్యవాద దేశాలు. కోట్లకొలది డాలర్లు ఆర్జించాయి ఆ దేశాల బహుళజాతి సంస్థలు.

అరబ్, ఇజ్రాయిల్ యుద్ధంలో అమెరికా విద్రోహ పాత్రను చెంపపెట్టుగా అరబ్ దేశాలు ఏకమత్యంతో వ్యవహరించి నూనెను ఒక సాధనంగా వినియోగించుకున్నాయి. తమ దేశాల సంపదపై హక్కు భుక్తాలు తమవని ప్రకటించి, ఆర్థిక ప్రగతిని సాధించాలనేది మూడవప్రపంచ దేశాల ప్రజలుఎంతో కాలంగా గాఢంగా వాంఛిస్తున్నారు. వారి వాంఛను అణచే ఎట్టి ప్రయత్నానైనా వారు ప్రతిఘటించి తీరుతారు. పరస్పర లాభసాటిగా అంతర్జాతీయ ఆర్థిక, వాణిజ్య సంబంధాలు నెలకొనేందుకు, బడుగుదేశాల ఆర్థిక ప్రగతికి పారిశ్రామిక దేశాలు ఇతోధికంగా తోడ్పడేందుకు కృషి చేయటంద్వారానే నూనె, తదితర సమస్యలు పరిష్కారం కాగలవు.

అమ్మాయిలను వేధించిన నేరానికి జరిమానా

బెంగళూరు, సెప్టెంబరు 25

గతవారంలో నగరంలో అమ్మాయిలను వెంటబడి వేధించిన నేరానికి ఇద్దరు డాక్టర్లకు, ఇద్దరు మెడికల్ కాలేజి విద్యార్థులకు ఒక్కొక్కరికి రు. 40 జరిమానా విధించినట్లు సిటీపోలీస్ కమిషనర్ నేడిక్కడ పత్రికలవారికి చెప్పారు.

ఒక కారులో ప్రయాణిస్తున్న ఇద్దరు దంపతులను ఇద్దరు డాక్టర్లు, ఇద్దరు విద్యార్థులు మరో కారులో వెంబడించారు. ఆ దంపతులు సమీపంలోవున్న పోలీస్ స్టేషన్‌కు వెళ్ళి ఈవిషయం ఫిర్యాదుచేశారు. డాక్టర్లను, విద్యార్థులను పోలీసులు నిర్బంధించి [illegible] కేసు నమోదు చేశారు. తరువాత నగర కోర్టు వారికి ఒక్కొక్కరికి రు. 40 జరిమానా విధించింది అని ఆయన చెప్పారు.

కోటి రూపాయల చేనేత వస్త్రాలనిల్వలు

మాస్టర్ వీవర్ల ఆందోళన

మంగళగిరి, సెప్టెంబరు 25

చేనేత వస్త్రాల తయారీకి ముఖ్య కేంద్రమైన మంగళగిరిలో దాదాపు కోటి రూపాయల విలువైన చేనేత వస్త్రాలు నిల్వ వుండటంవల్ల మంగళగిరి మాస్టర్ వీవర్ల అసోసియేషన్ అధ్యక్షులు శ్రీ మునగాల మంగయ్య ఆందోళన ప్రకటించారు.

సాధారణంగా ఆగస్టు, సెప్టెంబరు, అక్టోబరు నెలల్లో [illegible] ఈ సంవత్సరం అధిక [illegible] "[illegible]" అధిక [illegible].

ఈ విధంగా వస్త్రాల కొనుగోలు పడిపోవడంవల్ల ప్రభుత్వం నిల్వల విషయంలో సహాయం చేయకపోతే చేనేత కార్మికులకు మాస్టర్ వీవర్లు పనిచూపలేరని శ్రీమంగయ్య చెప్పారు. (వి. వి.)

బందరు తాలూకాఫీసు ముందు ప్రదర్శన

బందరు, సెప్టెంబరు 25

అధిక ధరలకు, దొంగ నిల్వలకు వ్యతిరేకంగా నేడు బందరు తాలూకాఫీసుముందు ప్రదర్శన జరిగింది.

పెడన, మాజేరు తదితర గ్రామాలనుండి కుండపోతగా వర్షం కురుస్తున్నప్పటికీ వ్యవసాయ కార్మికులు ప్రదర్శనలో పాల్గొనడానికై బందరు వచ్చారు.

కోనేరుసెంటరునుండి ప్రారంభమైన ప్రదర్శన పురవీధులగుండాసాగి తాలూకాఫీసుకు చేరుకుంది.

తాలూకా కమ్యూనిస్టు సమితి కార్యదర్శి శ్రీ మెట్ల వీరయ్య తాలూకాఫీసులో క్యాంపు చేసిన కలెక్టరుకు మెమొరాండం అందచేశారు.

ప్రదర్శనకు సిపి తాలూకా కమ్యూనిస్టు సమితి కార్యవర్గ సభ్యులు శ్రీ తలుపుల అదిశేషయ్య నాయకత్వం వహించారు.

5 వేల లీటర్ల కిరోసిన్ అమ్మకం

ఈనెల 23, 24 తేదీల్లో కమ్యూనిస్టు పార్టీ, యువజన సమాఖ్య కార్యకర్తలు 2500 మందికి ఒక్కొక్కరికి 2 లీటర్ల చొప్పున కిరోసిన్ అమ్మించారు.

స్థానిక రెవెన్యూ ఇన్‌స్పెక్టరు శ్రీ గఫూర్ అమ్మకం విషయంలో సహకరించారు.

పట్టణంలో బండ్లమీద అమ్మే కిరసనాయిలును కార్యకర్తలు దగ్గరవుండి 2 లీటర్ల చొప్పున అమ్మించారు.

లెబనాన్ ప్రధాని రాజీనామా

బీరుట్, సెప్టెంబరు 25

లెబనాన్ ప్రధాన మంత్రి తాకియుద్దీన్ సోల్ నేడు రాజీనామా చేశారు.

ఆయన తన రాజీనామాను లెబనాన్ అధ్యక్షునికిఅందజేశారు. సోల్ ప్రధాని పదవిని స్వీకరించి 14 నెలలు అయింది.

ఆర్.టి.సి ఉద్యోగుల రెండవరోజు నిరాహారదీక్షలు

హైదరాబాద్, సెప్టెంబరు 25

రాష్ట్ర వ్యాపితంగా ఆర్. టి. సి. ఉద్యోగులు జరుపుతున్న రిలే నిరాహార దీక్షలు నేడు రెండవ రోజులో ప్రవేశించాయి.

ఆర్.టి.సి. జనరల్ మేనేజరు, ఉపాధ్యక్షుని కార్యాలయాల ముందు నేడు నిరాహార దీక్ష జరుపుతున్నవారిని రాష్ట్ర కమ్యూనిస్టు సమితి కార్యదర్శి శ్రీ తమ్మారెడ్డి సత్యనారాయణ, ఎ.పి.టి.యు.సి ప్రధాన కార్యదర్శి శ్రీ యం.వి. యస్. శర్మ, ఉపాధ్యక్షులు శ్రీ వై. విజయకుమార్, కార్యదర్శి శ్రీ కె. శ్రీనివాసరావులు నేడు పరామర్శించారు.

నిరాహారదీక్ష శిబిరంవద్ద అధికసంఖ్యలో హాజరైన కార్మికుల నుద్దేశించి ప్రసంగిస్తూ శ్రీ తమ్మారెడ్డి ధరలను అదుపులో వుంచటంలో ప్రభుత్వం వైఫల్యం చెందిందని విమర్శించారు.

కరువుభత్యం పెంపుదల, బోనస్ చట్టం ప్రకారం ఎక్స్‌గ్రేషియో, ఇంకాదీర్ఘకాలంగా అపరిష్కృతంగా వున్న కార్మికుల సమస్యలను కార్పొరేషన్ ఆమోదించక పోవటాన్ని ఆయన విమర్శించారు.

ఉద్యోగులకు పూర్తి మద్దతును ప్రకటిస్తూ శ్రీ తమ్మారెడ్డి, వేతన స్తంభనకు వ్యతిరేకంగాను, అక్రమ నిల్వల వెలికి తీతకు ఉద్యమిస్తున్న కార్మికులను అభినందించారు.

ఎ. పి. టి. యు. సి. ఉపాధ్యక్షులు శ్రీ విజయకుమార్ ప్రసంగిస్తూ, డిమాండ్లను సాధించుకునేందుకు మరింత ఐక్యంగా వుండవలసిందిగా ఉద్బోధించారు. కార్మికుల డిమాండ్లను ఆమోదించి సరైన పారిశ్రామిక సంబంధాలను నెలకొల్పుకోవలసిందిగా ఆయన కార్పొరేషన్‌ను కోరారు.

కార్మికుల డిమాండ్లను పరిష్కరించటంలో కార్పొరేషన్ అవలంబిస్తున్న అసహాయకర వైఖరిని ఎ. పి. యస్. ఆర్. టి. సి. యంప్లాయీస్ యూనియన్ ప్రధాన కార్యదర్శి శ్రీ ఆర్. పి. రంగారావు వివరించారు. అక్టోబరులో "నిబంధనల మేరకే పని" ఉద్యమాన్ని ప్రారంభిస్తామని, అవసరమైతే సమ్మెతో సహా ప్రత్యక్ష కార్యాచరణకు దిగవలసి వస్తుందని ఆయన హెచ్చరించారు.

నిరాహారదీక్ష శిబిరాన్ని మొదటిరోజున తూర్పు గోదావరిజిల్లా ట్రాన్స్‌పోర్టు వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు శ్రీ కె. రాఘవులు సందర్శించి, నిరాహార వ్రతుల్ని పరామర్శించారు.

శ్రీయుతులు పి. ఎస్. అబ్రహాం, ఆర్. పి. రంగారావు, ఎ రాములు, వై. వి. రావులు డివిజనల్ మేనేజర్ కార్యాలయం వద్ద గల మరో నిరాహారదీక్ష శిబిరాన్ని సందర్శించారు.

ఒంగోలు డివిజన్‌లో

ఒంగోలు డివిజన్‌లోని అన్ని డిపోలలో ఆర్. టి. సి. ఉద్యోగులు రెండవరోజు నిరాహార దీక్షలు జరిపారు.

ఒంగోలు డిపోలో శ్రీయుతులు టి. గురునాథం, యం. వీరయ్య, టి. దేవసహాయం, హనీఫ్ లు రెండవరోజు నిరాహార దీక్షలో పాల్గొన్నారు.

మొదటిరోజున శ్రీయుతులు యం. యస్. రాయి, జి. రామమూర్తి, డి. యం. కొండయ్య, పి. హరిప్రసాద్, కె. నరసింహారావులు పాల్గొన్నారు.

కావలిలో

కావలిలో నేడు రెండవరోజు నిరాహార దీక్షలో శ్రీయుతులు హరీంద్రనాథరెడ్డి, నరసింహారావు, ఎ.యస్. రావు నిరాహారదీక్షలో పాల్గొన్నారు.

నెల్లూరులో

నెల్లూరులో ఆర్. టి. సి. ఉద్యోగుల రిలే నిరాహారదీక్షలో రెండవ రోజు శ్రీయుతులు పి.పి. కిరణ్, కె. పి. అబ్బాయి, జె. శివయ్య, పి. నారాయణరావులు పాల్గొన్నారు.

చీరాలలో

చీరాలలో రెండవరోజు నిరాహారదీక్షలో శ్రీయుతులు యం. పి. నరసయ్య, ఇ. చంద్రశేఖరరావు ప్రభృతులు పాల్గొన్నారు.

విజయవాడలో

విజయవాడ, సెప్టెంబర్ 25

నేడు రెండవ రోజున ఆర్.టి.సి. కార్మికులు వివిధ డిపోలలో తమ నిరాహారదీక్షలు కొనసాగించారు.

కృష్ణా డివిజన్‌లోని అనేక యూనిట్లలో మొత్తం 25 మంది నేటి కార్యక్రమంలో పాల్గొన్నారు.

రాష్ట్ర కమ్యూనిస్టు సమితి కార్యవర్గ సభ్యులు శ్రీ దాసరి నాగభూషణరావు, జిల్లా యువజన సమాఖ్య కార్యదర్శి శ్రీ కొల్లిగడ్డ వెంకటనారాయణ, పట్టణ ఇస్కస్ కార్యదర్శి శ్రీ [illegible] రాధాకృష్ణ, రాష్ట్ర ఇస్కస్ కార్యవర్గ సభ్యులు శ్రీ [illegible] ఈ రోజు నిరాహార దీక్షా శిబిరానికివచ్చి ఆర్. టి. సి. కార్మికుల ఆందోళనకు సంఘీభావం ప్రకటించారు.

గుంటూరులో

ఈరోజు నిరాహారదీక్షలో గుంటూరు-1 డిపోలో శ్రీయుతులు ఎస్. వెంకటేశ్వర్లు, వి. సాంబశివరావు, పి. శివయ్య, రెండవ డిపోలో శ్రీయుతులు ఎమ్. వి. [illegible], వి. ప్రసాద్ [illegible] పాల్గొన్నారు.

[illegible] ఉద్యోగుల [illegible] సంఘ కార్యదర్శి శ్రీ వి. [illegible], శాసనమండలి సభ్యులు శ్రీ ఎమ్. జె. [illegible]రావు, రాష్ట్ర యువమహిళాసంఘ కన్వీనర్ కుమారి వి. [illegible]వతి, తాలూకా కమ్యూనిస్టు సమితి నాయకులు శ్రీ నాగళ్ల రామకృష్ణయ్య నిరాహార వ్రతులను సందర్శించారు.

తెనాలిలో

శ్రీయుతులు ఏ. అంకమ్మరావు, మకీర్ గోరే ఈరోజు నిరాహారదీక్షలోపాల్గొన్నారు.

రేపల్లెలో

రేపల్లెలో ఆర్. టి. సి కార్మికులు శ్రీయుతులు టి, రామయ్య, కె. జేమ్స్, ఎస్. వెంకటేశ్వర్లు, ఎమ్. భద్రుడు, టి. ఎస్. మూర్తి, ఎమ్. వెంకటేశ్వర్లు, ఎమ్. డి. భాషా, కె. అంజయ్య, ఎమ్. ఆదిశేషారావులు నిరాహారదీక్షలో పాల్గొన్నారు.

నరసరావుపేటలో

రెండవ రోజు నిరాహారదీక్ష కార్యక్రమంలో శ్రీయుతులు ఎస్. రాఘవరెడ్డి, బి. శేషాచలం, వి. వెంకటేశ్వర్లు, షేక్ సైదా అహ్మద్, షేక్ సర్దార్ జానీలు పాల్గొన్నారు.

మాచెర్లలో

మాచెర్ల ఆర్. టి. సి. కార్మికులు శ్రీయుతులు షేక్ మస్తాన్, డి. రాములు నేటి నిరాహార వ్రతులలో ఉన్నారు.

వినుకొండలో

వినుకొండలో షేక్ సయిదుల్లా ప్రభృతులు ఈ రోజు కొనసాగిన నిరాహారదీక్షలో ఉన్నారు.

నెల్లూరులో

నెల్లూరులో మొదటిరోజున శ్రీయుతులు ఎస్. బాబు, టి. వి. సుబ్బారావు, ఎస్. కె. షేక్, ఎ. సి. [illegible]. రెండవ రోజున శ్రీయుతులు పి. కిరణ్, ఎం. షాహ్‌వలి, ఎస్. కె. బాషా, పి. నారాయణ, మూడవ రోజున (ఈరోజు) ఎం. ఆర్. బాబు, జె. శివయ్య, కె. మస్తాన్ కె. పి. అబ్బాయి, నిరాహారదీక్షలో పాల్గొన్నారు.

నేడు పట్టణ కమ్యూనిస్టు సమితి కార్యదర్శి శ్రీ ఎం. రామచంద్రయ్య నిరాహార దీక్ష శిబిరానికి వెళ్ళి నిరశన వ్రతులను పరామర్శించారు.

పా కి స్తా న్ లో

హుంజా విలీనంపై భారత్ అభ్యంతరం

న్యూఢిల్లీ, సెప్టెంబరు 25

భారతదేశంలో అంతర్భాగమైన హుంజా రాజ్యాన్ని పాక్ ఉత్తర ప్రాంతంలో విలీనం చేసినట్లు పాక్ ప్రధాని భుట్టో చేసిన ప్రకటనపట్ల భారతదేశం తీవ్ర అభ్యంతరాన్ని తెలియ జేసింది.

పాకిస్తాన్ తీసుకున్న ఈ ఏకపక్ష చర్య జమ్మూ-కాశ్మీర్ ఉత్తర ప్రాంతాలలో ఒక దానికి సంబంధించి నైసర్గిక, భౌతిక మార్పులను తెచ్చిందని అన్నారు. వాస్తవంగా "హుంజా"పై పాకిస్తాన్‌కు ఎలాంటి అధికారంలేదని విదేశాంగశాఖ ప్రతినిధి తెలియజేశారు.

హుంజా రాజ్యం రద్దుచేయబడిందని, దాన్ని పాకిస్తాన్‌లో విలీనం చేయటం జరిగిందని భుట్టో నిన్న చేసిన ప్రకటన భారత దేశానికి ఆశ్చర్యాన్నికలుగజేసిందని ఆయన తెలియ జేశారు.

ఏకపక్షంగాను, తొందర పాటుతో తను కొన్న ఈ చర్యను కప్పిపుచ్చుకొనే నిమిత్తం భుట్టో సిక్కిం విషయంలో భారత్ తీసుకున్న చర్యలను పోటీకి తీసుకు వస్తున్నారని ప్రతినిధి విమర్శించారు.

భారతదేశంలో విలీనమైన జమ్మూకాశ్మీర్ రాష్ట్రంలో హుంజాకు అధిపత్య ప్రతిపత్తి కలిగివున్నందున పాకిస్తాన్ చర్య కొట్ట వచ్చినట్లు కనపడుతున్నదని పేర్కొన్నారు.

హుంజారాజ్యం పాకిస్తాన్‌లో విలీనం

చిట్టచివరి ఫ్యూడల్ అవశేషమైన హుంజా రాజ్యం రద్దు చేయబడిందని, దాన్ని పాకిస్తాన్‌లో విలీనం చేశామని పాక్ రేడియో నిన్న తెలిపింది.

పాక్ ఆక్రమిత కాశ్మీర్‌లోని గిల్గిట్ తదితర ప్రాంతాలలో పర్యటిస్తున్న భుట్టో నిన్న ఒక ప్రకటన చేశారు. తమ కెవ్వరితోనూ శత్రుత్వం లేదని హుంజా మీర్‌ను ఉద్దేశించి ఆయన చెప్పారు.

హుంజా స్వాధీనం తక్షణమే అమల్లోకి వస్తుంది. విలీన రాజ్యాల పాలకులకు ఎలాంటి పరిగణన ఉంటుందో అలాంటిదే హుంజామీర్ కూడా పొందుతారు. "డోగ్రా పాలనకు వ్యతిరేకంగాసాగిన విముక్తి పోరాటంలో అసువులు బాసినవారి సమాధిపై భుట్టో నిన్నపుష్పగుచ్ఛం ఉంచారు. ఆ సందర్భంగా ఒక బహిరంగసభలో ప్రసంగిస్తూ ఉత్తర ప్రాంతాలపట్ల తాము ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నామన్నారు. (ఉత్తర ప్రాంతాలు భారత్, సోవియట్ - ఆఫ్ఘన్, చైనా సరిహద్దుల్లో ఉంటాయి).

హుంజా చరిత్ర

రావల్పిండి, సెప్టెంబరు 25

పాకిస్తాన్‌లో విలీనం చేసుకుంటున్నట్లు ప్రకటించబడిన హిమాలయ ప్రాంత రాజ్యమైన హుంజా 900 సంవత్సరాలుగా ఫ్యూడల్ పాలనలో వుంది.

దీని పాలకుడు మీర్ (రాజు); లెఫ్టినెంట్ జనరల్ జమాల్‌ఖాన్ పాకిస్తాన్ పింఛను దారుగా వుంటాడు.

ఈయన వయస్సు 65 సం॥ కారకోరమ్ పర్వత శిఖరాల్లో వున్న ఈ సంస్థానం పరిపాలనను హస్తగతం చేసుకోవటానికి పాక్ అధికారులను యిదివరకే పంపామని భుట్టో ప్రకటించారు

ఆస్ట్రేలియా డాలర్ విలువతగ్గింపు

కాన్బెర్రా, సెప్టెంబరు 25

ఆస్ట్రేలియా డాలర్ విలువను 12 శాతం తగ్గించారు. ప్రధాని విట్లామ్ నేడిక్కడ ఈ విషయం ప్రకటించారు.

షాపులో తయారైన తుపాకి పట్టివేత

కృష్ణనగర్, సెప్టెంబరు 25

బెట్‌బెరియా గ్రామంలో ఒక ఇంటి నుంచి షాపులో తయారు చేయబడిన ఒక తుపాకిని, రెండు తూటాలను నాదియాజిల్లా పోలీసులు నేడు పట్టివేశారు.

నక్సలైట్ల భవిష్యత్ కార్యక్రమానికి సంబంధించిన కొన్ని లేఖలను కూడా పోలీసులు ఈ ఇంటినుంచి స్వాధీన పరచుకున్నారు.

భూటాన్‌సహకారంతో న్యూస్‌ప్రింట్ ఫ్యాక్టరీ

షిల్లాంగ్, సెప్టెంబరు 25

భూటాన్ ప్రభుత్వ సహకారంతోన్యూస్‌ప్రింట్ ఫ్యాక్టరీని నెలకొల్పే ప్రతిపాదనను ప్రభుత్వం పరిశీలిస్తున్నదని కేంద్ర రేడియో సమాచార శాఖమంత్రి శ్రీ ఐ. కె. గుజ్రాల్ నేడిక్కడ తెలియచేశారు.

ఈశాన్య మండలంలో నెలకొల్ప దలచిన మూడు కాగితపుమిల్లులు న్యూస్‌ప్రింట్‌ను ఉత్పత్తిచేయబోవని అన్నారు.

సమిష్టి సహకార సంఘాలను ఏర్పాటు చేసుకోవలసిందిగా అస్సాం, మేఘాలయల లోని చిన్న వార్తా పత్రికల యజమానులకు ఆయన సూచించారు.

అరుణాచల్ ప్రదేశ్ నూతన రాజధాని ఇటానగర్ వద్ద100కిలోవాట్ల రేడియోస్టేషన్‌ను రానున్న నాలుగు సంవత్సరాలలో పూర్తి చేస్తామని అన్నారు.

రెండు మూడు నెలలలో దిబ్రూగఢ్ రేడియో స్టేషన్‌ను పూర్తిస్థాయి స్టేషన్‌గా మారుస్తామని అన్నారు.

అయిజల్,అగర్తలా స్టేషన్ల స్థాయి పెంచుతామని, గారోభాషలో గోడవార్త పత్రికను ప్రచురిస్తామని అన్నారు.

నిక్సన్ ఆరోగ్యపరిస్థితి విషమం

లాంగ్‌బీచ్, (కాలిఫోర్నియా) సెప్టెంబరు25

అమెరికా మాజీ అధ్యక్షులు నిక్సన్‌కు కుడి ఊపిరితిత్తిలో రక్తం గడ్డకట్టుకుని వుందని, అది చాలా ప్రమాదకరమైందని ఆయన్ను పరీక్షించిన డాక్టరు తెలిపారు.

నిక్సన్ కాలిలోవున్న రక్తపుగడ్డ రక్తనాళాలగుండా ఊపిరితిత్తుల్లోకి చేరిందని ఆయన పత్రికావిలేకరుల గోష్టిలో తెలియ చేశారు.

శాంతి సాధనకు బంగ్లాదేశ్ కృషి

ఐరాసలో ముజిబ్ ప్రసంగం

ఐరాస, సెప్టెంబరు 25

సర్వతంత్ర స్వతంత్ర దేశంగా బంగ్లాదేశ్ అవతరణ భారత ఉపఖండంలో సుస్థిర శాంతి సాధనకు దోహదం చేయగలదని బంగ్లాదేశ్ ప్రధాని ముజిబుర్ రహమాన్ ఐ. రా. స. సర్వసభ్య సమావేశంలో దృఢ విశ్వాసాన్ని ప్రకటించారు.

సర్వసభ్య సమావేశంలో బంగ్లాదేశ్ విదేశాంగ విధాన ప్రకటన చేస్తూ ఆయన పై విధంగా అన్నారు. ఉపఖండంలో సుస్థిర శాంతి సాధనకు బంగ్లాదేశ్ కృషిచేయగలదని ఆయన ప్రకటించారు.

ఉపఖండం ప్రజల సంక్షేమం కోసం స్నేహ సహకార సంబంధాలను ఏర్పాటు చేసుకోవడంద్వారా [illegible] కూడిన గతాన్ని విస్మరించ వచ్చునని అన్నారు.

పాకిస్తాన్‌లో అపరిష్కృతంగావున్న సమస్యలను ప్రస్తావిస్తూ, వాటి పరిష్కారానికి బంగ్లాదేశ్ తీసుకున్న చర్యలను వివరించారు.

ఉపఖండంలోని ప్రజల ప్రయోజనాలు, సంక్షోభదృష్ట్యా ఈ సమస్యల పరిష్కారానికి పాకిస్తాన్ ముందుకు రాగలదన్న ఆశాభావాన్ని వెల్లడించాడు. పరస్పరం సర్దుబాటు వైఖరిని పాకిస్తాన్ అవలంబించినట్లయితే సాధారణ సంబంధాల ఏర్పాటుకు జరుగుతున్న క్రమం విజయవంతంకాగలదని అన్నారు.

రాష్ట్ర పురోగతికి పారిశ్రామిక శాంతి అవసరం

శ్రీ అంజయ్య

హైదరాబాదు, సెప్టెంబరు 25

రాష్ట్ర పురోభివృద్ధికి పారిశ్రామిక శాంతి అవసరమని నూతన కార్మికశాఖమంత్రి శ్రీ టి. అంజయ్య నేడిక్కడ తెలియజేశారు.

క్యాబినెట్ మంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన వెంటనే విలేకరులతో మాట్లాడుతూ లాకౌట్లు, పరిశ్రమల మూత, రిట్రెంచ్‌మెంటు, వగసాధింపు చర్యలను తాను పూర్తిగా వ్యతిరేకినని అన్నారు. అదే సమయంలో హింసాయుత చర్యలు,సమ్మెలు, నిరాహారదీక్షలను కూడా వ్యతిరేకినని అన్నారు.ఇవి దేశపురోగతిని దెబ్బతీస్తున్నాయని అన్నారు.

తరువాత కేంద్ర పునరావాస శాఖ డిప్యూటీ మంత్రి శ్రీ జి. వెంకటస్వామి, స్థానిక కాంగ్రెస్ నాయకులతోకలిసి శ్రీ అంజయ్య గన్‌పార్కుకు వెళ్ళి మృతవీరుల స్థూపానికి శ్రద్ధాంజలి ఘటించారు.

---

600 లీటర్ల కిరోసిన్ అమ్మకం

వేటపాలెంలో

చీరాల, సెప్టెంబరు 25

యువజనసంఘకార్యకర్తలు శ్రీయుతులు కోట నాగేంద్రుడు, సజ్జా శంకరయ్య, వృద్ధికోట సుబ్బారావు, జి. ఆంజనేయులు నాయకత్వాన చీరాల తాలూకా వేటపాలెంలో ఈ నెల 21 న ఇద్దరు వ్యాపారులవద్ద గల 600 లీటర్ల కిరోసిన్‌ను కంట్రోలు ధరకు ప్రజలకు అమ్మటం జరిగింది.

జాండ్రపేటలో

జాండ్రపేటలో ఈనెల 22న కమ్యూనిస్టు పార్టీ, యువజన సంఘాల ఆధ్వర్యాన శ్రీయుతులు వృద్ధికోట సుబ్బారావు, సజ్జా కోటి నాగేశ్వరరావులు లీడరుగా వున్నటువంటి మార్క్సిస్టు పార్టీ ముఖ్య కార్యకర్త శ్రీ పి. రంగనాయకులు వద్దగల 200 లీటర్ల కిరోసిన్‌ను వెలికితీసి అమ్మించారు.

అనంతపురంలో బియ్యం అమ్మకం

అనంతపురం, సెప్టెంబరు 25

అనంతపురంలో ఈ నెల 21 న కమ్యూనిస్టు కార్యకర్తలు శ్రీ చంద్రశేఖరయ్యశెట్టి అను టోకు వ్యాపారి నుండి 10 మూటల బియ్యాన్ని ఒక్కొక్కరికి రెండు కిలోలు, కిలో రు. 1-75 కు అమ్మించారు. దాదాపు 500 మంది ప్రజలు ఈ బియ్యం కొనుక్కున్నారు.

ఈ అమ్మకానికి శ్రీయుతులు గురు శాంతప్ప, పెద్దన్నలు నాయకత్వం వహించారు.

హోటలు రేట్ల తగ్గింపు

అనంతపురం విద్యార్థులు హోటలు రేట్లు తగ్గించాలని ప్రారంభించిన ఆందోళన ఫలితంగా ఈ నెల 20 న విద్యార్థులు, హోటలు యజమానులకు ప్రభుత్వాధికారుల సమక్షంలో ఒక అంగీకారం కుదిరింది.

టిఫిన్‌లకు ప్రతి ప్లేటుకు పదిపైసలు, భోజనానికి 20 పైసలు చొప్పున ధరలు తగ్గాయి. సంప్రదింపుల్లో విద్యార్థుల తరఫున శ్రీయుతులు వి.శ్రీనివాసులునాయుడు,సాయి, మనోరంజన్, రియాజ్, వి. కె. రంగారెడ్డి, జి. ఆంజనేయులు, గోవిందరెడ్డి, కె. యస్. యస్. మూర్తి ప్రభృతులు పాల్గొన్నారు.

విద్యార్థి, యువజనుల కోర్కెల దినం

నోట్ బుక్‌లు, పుస్తకాలు సబ్సిడీ రేటుకు ప్రభుత్వం సప్లయి చేయాలని సంక్షేమ హాస్టలు విద్యార్థుల గ్రాంటులు పెంచాలని తదితర సమస్యలపై యిక్కడ విద్యార్థి, యువకులు, యువజన విద్యార్థి సమాఖ్యల ఆధ్వర్యాన సైకిల్ ర్యాలీ జరిపారు. దీనిని శ్రీయుతులు శ్రీనివాసులునాయుడు, సాయినాథ్, రియాజ్, గోపాల్, దామోదర్, లీలాధర్, ఆంజనేయులు, రామకృష్ణ, మనోరంజన్, భాషా, మహమ్మద్‌జహా ప్రభృతులు నడిపారు.

సచివాలయం ముందు యువ మహిళల ధర్నా

హైదరాబాద్, సెప్టెంబరు 25

రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగాల్లో 25 శాతం మహిళలకు కేటాయించాలని, ఉద్యోగాలు చేసే మహిళలకు హాస్టళ్ళు ఎక్కువచేయాలని విద్యార్థినుల స్వీయరక్షణకై శిక్షణ ఇవ్వాలని మహిళలను వేధించే 'రోడ్‌సైడ్ రోమియో'లను, గూండాలను కఠినంగా శిక్షించాలని, సమాన పనికి సమాన వేతనం లభించేటట్లు చట్టాన్ని సవరించాలని, మహిళలకు ఆస్తి హక్కులు కల్పించాలని, వరకట్నం నిషేధ చట్టాన్ని అమలుచేయాలని, ఆహార ధాన్యాలు, నిత్యజీవితావసర వస్తువుల ధరలను అదుపులో పెట్టాలని డిమాండుచేస్తూ 62 మంది యువమహిళలు, విద్యార్థినులు నేడు సచివాలయం ముందు ధర్నాజరిపారు.

అఖిల భారత యువజన సమాఖ్య, యువ మహిళా విభాగం పిలుపు ననుసరించి యువ మహిళల కోర్కెల వారం సందర్భంగా యీ ధర్నా జరిగింది.

సచివాలయం వద్ద జరిగిన సభలో భారత కమ్యూనిస్టుపార్టీ జాతీయ సమితి సభ్యులు శ్రీ సుధాకరరెడ్డి, ఆంధ్రప్రదేశ్ విద్యార్థి సమాఖ్య ప్రధాన కార్యదర్శి శ్రీ నారాయణ, కార్యదర్శి శ్రీ రామకృష్ణారావు, సిటీమహిళా సమాఖ్య అధ్యక్షులు శ్రీమతి పద్మావతిశాస్త్రి, సిటీయువజన సమాఖ్య ప్రధాన కార్యదర్శి శ్రీ నర్సింగ్ ప్రభృతులు ప్రసంగించారు.

యువమహిళా విభాగం చేబట్టిన వివిధ కార్యక్రమాలనుగురించి కుమారి ప్రేమ్‌పావని వివరించి, సమాజంలో మహిళలకు సముచిత స్థానం సాధించుటకు యువ మహిళలు పోరాటం జరుపుతారని తెలిపారు.

యువ మహిళా ప్రతినిధివర్గం ఈరోజు సాయంత్రం ముఖ్యమంత్రిని కలుసుకొని, తమ సమస్యలను వివరించడం జరిగింది.

భారత్‌కు 10 లక్షల టన్నుల గోధుమలు

కామన్ మార్కెట్‌చే

బ్రసెల్స్, సెప్టెంబరు 25

భారతదేశానికి 10 లక్షల టన్నుల గోధుమలు సరఫరా చేయడానికి కామన్ మార్కెట్ అంగీకరించిందని తెలియవచ్చింది.

ఈ విషయమై త్వరలోనే ఒప్పందం జరగవచ్చునని కామన్ మార్కెట్ అధికార వర్గాలు వెల్లడించాయి.

చెరకు కనీస ధర క్వింటాల్‌కు రు. 8-50 లుగా నిర్ణయం

న్యూఢిల్లీ, సెప్టెంబరు 25

1974-75 సీజన్‌లో చెరకు కనీస ధర క్వింటాలుకు రు. 8-50 లుగా కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. 1974 అక్టోబరు 1వ తేదీ నుండి యీ ధర అమలులోకి వస్తాయి.

8.5 శాతం అంతకంటే తక్కువ పంచదార దిగుబడినిచ్చే చెరకుకు ఈ ధర వర్తిస్తుంది. 8.5 శాతానికి పైగా ప్రతి 0.1 శాతందిగుబడికి అదనంగా పదిపైసలు చెల్లించటంజరుగుతుంది.

పంచదార విధానానికి సంబంధించి ప్రస్తుతంవున్న పాక్షిక కంట్రోలు కొనసాగుతుందని అధికార ప్రకటన తెలియ జేసింది.

వర్తకులను మోసం చేసిన "ఆఫీసరు"

వినుకొండ, సెప్టెంబరు 25

గుంటూరుజిల్లా వినుకొండ తాలూకా పిట్టంబండ, నాగులవరం, ఏనుగుపాలెం గ్రామాలలో ఈ నెల 22వ తేదీన శ్రీ ప్రేమయ్య అనునతను మరొకరు తాము కల్తీ నిరోధకశాఖ అధికారులమని వర్తకులను బెదిరించి గ్రామానికి రు 300 చొప్పున సుమారు వేయి రూపాయలు కాజేశారు.

తరువాత ఆ యా గ్రామాల వర్తకులు వినుకొండ వచ్చి విచారించగా వారు మోసగాండ్రని తెలిసింది. శ్రీ ప్రేమయ్య అనునతను టీకాలువేసే డిపార్టుమెంటులో పనిచేస్తున్నట్లు తెలిసింది.

ఉన్నతస్థాయిలో అంతర్జాతీయ సహకారం

చావన్ విజ్ఞప్తి

ఒట్టావా, సెప్టెంబరు 25

అంతర్జాతీయంగా ఏర్పడిన తీవ్ర ఆర్థిక సంక్షోభం దృష్ట్యా అత్యున్నత స్థాయిలో ప్రపంచ వ్యాపితంగా సహకరించుకోవలసిన ఆవశ్యకత ఎక్కువగా వుందని భారత ఆర్థిక మంత్రి శ్రీ వై. బి. చావన్ నేడిక్కడ అన్నారు.

నేడిక్కడ ప్రారంభమైన కామన్వెల్తు దేశాల ఆర్థిక మంత్రుల సమావేశంలో ప్రసంగిస్తూ ఆయన పైవిధంగా అన్నారు. ప్రపంచ ఆర్థిక వ్యవస్థ సాఫీగా సాగిపోవటం సంపన్న దేశాలకు ఎంతఅవసరమో వర్ధమాన దేశాలకు కూడా అంతే అవసరమని ఆయనన్నారు.

ద్వితీయ ప్రపంచ యుద్ధానంతరం ప్రపంచ ఆర్థిక వ్యవస్థ అత్యంత క్లిష్ట దశ నెదుర్కొంటున్న సమయంలో మనం సమావేశమవుతున్నాము. ద్రవ్యోల్బణ వత్తిడుల తొలగింపుకు తగిన మార్గాలను అన్వేషించాలి అని ఆయనన్నారు.

కాశ్మీర్ లోయలో భూగర్భ తరంగాల రికార్డింగ్

జాతీయ భూభౌతిక పరిశోధన కేంద్రంచే

హైదరాబాద్, సెప్టెంబరు 25

హిమాలయ పర్వతాలకు ఆవలి వైపున సోవియట్ యూనియన్‌కు చెందిన పామీర్ పీఠభూమిలో యిటీవల సోవియట్ యూనియన్ పెద్ద యెత్తున జరిపిన రసాయనిక ప్రేలుళ్ళవల్ల కాశ్మీరు లోయలో వచ్చిన భూ గర్భ తరంగాలను జాతీయ భూ భౌతిక పరిశోధన కేంద్రం (హైదరాబాదు) విజయవంతంగా రికార్డు చేసింది.

ఈనెల ప్రారంభంలో సోవియట్ యూనియన్ శాస్త్రవేత్తలు పై ప్రేలుళ్ళు జరిపారు. వాటివల్ల ఉత్పన్నమైన భూగర్భ తరంగాలను భారతదేశం, పాకిస్తాన్, ఆఫ్గనిస్తాన్ శాస్త్రవేత్తలు రికార్డుచేశారు. ఈ పరిశోధనల వల్ల హిమాలయ పర్వతాల క్రిందిభాగంలో ఏవిధమైన నిర్మాణాలు వున్నదీ అధ్యయనం చెయ్యడానికి అవకాశం ఏర్పడుతుంది.

భూభౌతిక పరిశోధనసంస్థ రికార్డు చేసిన సమాచారాన్ని ఆధారం చేసుకుని, హిమాలయ పర్వతాల క్రింది భాగంలో లోతుగా వున్న నిర్మాణాల వివరాలను తెలుసుకోడానికి కృషి జరుగుతోంది. పామీర్ ప్రాంతంలో జరిపిన రసాయనిక ప్రేలుళ్ళ సందర్భంగా సోవియట్ శాస్త్రవేత్తలు రికార్డుచేసిన సమాచారంద్వారా హిమాలయ పర్వతాల క్రిందవున్న లోపాలు, పగుళ్ళతో కూడివున్న ప్రాంతాలను గురించి పూర్తి సమాచారం తెలుసుకోడానికి ఆ ప్రాంతంలో నిక్షిప్తమై వున్న ఖనిజ సంపదను గురించి కూడా పరిశోధనలు జరపడానికి అవకాశం ఏర్పడుతుంది.

ఆయిల్ డీలర్ అరెస్టు

గుంటూరు, సెప్టెంబరు 26

గుంటూరులోని సంగడిగుంటలో గల శ్రీ వెంకటరమణ ఆయిల్ డిపో ప్రొప్రయిటర్ శ్రీ దాసనపల్లి రంగనాయకులును నేడు పోలీసులు అరెస్టు చేశారు.

రు. 15 వేల విలువచేసే కిరోసిన్, క్రూడాయిల్‌లను దొంగ వ్యాపారానికిగాను నిల్వచేసినందున యస్. పి. శ్రీ ఆర్. ప్రభాకరరావు, సర్కిల్ ఇన్‌స్పెక్టర్ శ్రీనాయన్న, సబ్ ఇన్‌స్పెక్టర్ శ్రీ రాజా, నిఘాశాఖ అధికారి శ్రీ ఎ. వి. నరసింహారాయ తమ సిబ్బందితోవెళ్ళి అరెస్టుచేశారు. (వి. వి.)

---

100 మంది ఆస్తుల స్వాధీనానికి ఉత్తర్వు

ఆదాయపుపన్ను ఎగవేసినందుకు

కాన్పూర్, సెప్టెంబరు 25

ఆదాయపు పన్ను ఎగవేసే నిమిత్తం తమ ఆస్తులను (భవనాలు) తక్కువగా విలువ కట్టి చూపించిన 100 మంది ఆస్తులను స్వాధీనం చేసుకొనేందుకు ఉత్తర ప్రదేశ్ ఆదాయపు పన్ను అధికారులు నోటీసులు జారీ చేశారు.

రిజిస్ట్రేషన్ పత్రాలలో చూపించిన ప్రకారం వారి ఆస్తుల విలువ కోటి రూపాయలు మాత్రమే. అయితే వాస్తవానికి ఈ ఆస్తుల మార్కెట్ విలువ రు. 10 కోట్లు వుంటుందని అధికారుల అంచనా.

ఆదాయపుపన్ను అధికారులు ఇప్పటికే డెహ్రాడూన్‌కు చెందిన ఒక వ్యక్తి, కాన్పూర్‌కు చెందిన యిద్దరు వ్యక్తుల ఆస్తుల స్వాధీనానికి ఉత్తర్వులు చేశారు.

స్మగ్లర్ ఆస్తులు స్వాధీనం

స్మగ్లర్ రణవీర్‌సింగ్ నరూలా ఆస్తులను జప్తుచేస్తూ ఢిల్లీ చీఫ్ జుడిషియల్ మేజిస్ట్రేటు నేడు ఉత్తర్వులు జారీచేసారు.

నరూలా కోసంపోలీసులు గాలిస్తున్నారు. స్మగ్లర్లు తమంతతాము అధికారులకు లొంగిపోయే విధంగా ఒత్తిడి తెచ్చేనిమిత్తం వారి ఆస్తులను జప్తుచేయాలని ప్రభుత్వం నిర్ణయించింది.

నరూలాకు కొన్ని లక్షల రూపాయల ఆస్తి వున్నట్లు అంచనా.

ప్రెస్ కమిషన్ ఏర్పాటుకు విజ్ఞప్తి

ఐ. ఇ. యన్. ఎస్. అధ్యక్షునిచే

న్యూఢిల్లీ, సెప్టెంబరు 25

వార్తా పత్రికల పరిశ్రమ సమస్యలను పరిశీలించి, తగు మార్గాలను సూచించేందుకు ప్రెస్ కమిషన్‌ను నియమించాలని ఇండియన్ అండ్ ఈస్టర్న్ న్యూస్ పేపరు సొసైటీ (ఐ.ఇ. ఎన్. ఎస్.) అధ్యక్షులు శ్రీ మాథ్యూ నేడు ప్రభుత్వాన్ని కోరారు.

ప్రభుత్వం అరకొర చర్యలు, తాత్కాలిక చట్టాలు చేయకముందు యిది జరగాలని ఆయన అన్నాడు.

ఐ.ఇ. ఎన్. ఎస్. 35వ వార్షికసాధారణ సమావేశంలో ప్రసంగిస్తూ అనుకోకుండా వచ్చిన ప్రస్తుత సంక్షోభంనుండి పరిశ్రమ బయటపడేలాంటి కొన్ని నివారణ చర్యలు తీసుకోవాలని అన్నారు.

దేశంలోని పత్రికల సమస్యలను పరిశీలించుటకు సుప్రీంకోర్టు న్యాయమూర్తితో ముగ్గురు లేక నల్గురు ప్రముఖ వ్యక్తులతో ప్రెస్‌కమిషన్ వెంటనే ఏర్పాటు చేయాలని ఆయన కోరారు.

వార్తా పత్రికల ఆదాయ వ్యయాలను గురించి వాస్తవాంశాల పరిశీలన కమిటీ జరిపే విచారణ చాలా పరిమితమైందని, వార్తా పత్రికల భవిష్యత్‌పై దృష్టిసారించి, అందుకు తగినట్లుగా మార్గాలను వెదకాలని అన్నారు.

వార్తా పత్రికల భవిష్యత్ విషయాన్ని ప్రభుత్వం తీవ్రంగా ఆలోచించాలని, ప్రస్తుతం వార్తాపత్రికల పరిశ్రమ ముఖ్యంగా చిన్న, మధ్య తరహా పత్రికల ఆర్థిక నిర్మాణం స్తంభించిపోయిందని, వాటి ఆర్థిక పరిస్థితిలో తీవ్రమైన మార్పులు రావాల్సి వుందని అన్నారు.

వార్తా పత్రికలు ఎదుర్కొంటున్న సమస్యల తీవ్రతను, చిక్కులను ప్రభుత్వ స్థాయిలో అర్థం చేసుకోక పోవటం పట్ల ఆయన ఆందోళన వెలిబుచ్చారు.

చాందినీ చౌక్‌లో వ్యాపార కేంద్రాలు

న్యూఢిల్లీ, సెప్టెంబరు 25

భారత రాజధాని న్యూఢిల్లీలో పోలీసు జాబితాలో వున్న స్మగ్లర్లందరికీ అక్కడి చాందినీచౌక్ ప్రాంతంలో వ్యాపారాలు వున్నాయి.

చాందినీచౌక్ ప్రాంతంలోని బట్టల షాపుల ద్వారా స్మగ్లర్లందరూ బంగారం, రిస్టు వాచీలు, కృత్రిమ దారం, మరికొన్ని యితర వస్తువుల వ్యాపారం రహస్యంగా చేస్తున్నారు. కొన్ని సందర్భాల్లో బంగారం,వాచీలు చట్టబద్ధంగానే అమ్మినప్పటికీ, వారు స్మగులు వస్తువులే అమ్ముతారు.

అంతరంగిక భద్రతా చట్టంక్రింద గత శనివారం వారంట్లు జారీచేయ్యబడినవారిలో ప్రముఖ స్మగ్లర్లలో ఆరుగురికి చాందినీచౌక్‌లో వ్యాపారాలు వున్నాయి. త్వరలోనే మరి కొంతమంది స్మగ్లర్లపైన కూడా మీసా క్రింద వారంట్లు జారీచెయ్యనున్నట్లు అధికార వర్గాల ద్వారా తెలుస్తోంది

మొదటి జాబితాలోని యిద్దరు స్మగ్లర్లను గత వారాంతంలో అరెస్టు చెయ్యడం, మిగిలిన నలుగురిలోను, ఒకరి ఆస్తి మాత్రం నేడు జప్తుచెయ్యడం జరిగింది.

కలకత్తాలో అరెస్టు

కలకత్తాలో ప్రముఖ స్మగ్లర్ నెమిచంద్ జైన్‌ను పోలీసులు నేటి ఉదయం అతని నివాస గృహంలో అరెస్టు చేశారు.

[illegible] కెడియా, [illegible] ఖాన్, సత్యలాల్ కొఠారి అనే మరో ముగ్గురు స్మగ్లర్ల కోసం పోలీసులు గాలిస్తున్నారు

బడ్జిబడ్జిలో స్మగ్లింగ్‌వ్యాపారం చేస్తున్న సయ్యద్ మహమ్మద్ అస్లాంపై 24 పరగణాల జిల్లా మేజిస్ట్రేటు వారంటు జారీచేశారు.

ఆంధ్రప్రదేశ్ లో సుమారు రు. 12 లక్షల పార్టీ, భవన నిధుల సేకరణ

శ్రీ తమ్మారెడ్డి సత్యనారాయణ

(ప్రదేశ్ కమ్యూనిస్టు సమితి కార్యదర్శి)

భారత కమ్యూనిస్టు పార్టీ ఆంధ్ర ప్రదేశ్ సమితి, యీ సంవత్సరం, పార్టీ నిధికి, 'మఖ్దూమ్ భవన్' నిధికిగాను సుమారు రు. 12 లక్షల రూపాయలు సేకరించాలని నిర్ణయించుకుంది. ఇంతవరకు సేకరింపబడిన మొత్తం రు. 11,91,050-లకు చేరుతుంది. ఆంధ్ర ప్రదేశ్‌లో, పార్టీ ఒకే ఒక్క సంవత్సరంలో రు. 10 లక్షలకు మించి పార్టీ నిధి వసూలు చెయ్యడం యిదే మొదటిసారి. ఈ సంవత్సరం పార్టీ నిధి వసూళ్ళలో ఒక ప్రత్యేకత వుంది. అనేక జిల్లాల్లోను, తాలూకాల్లోను పార్టీ శాఖలు సొంత భవనాల నిర్మాణానికి పూనుకోవడమే ఆ ప్రత్యేకత. కృష్ణాజిల్లాలోని దివి తాలూకాలో, తాలూకా పార్టీ కార్యాలయాన్ని రు. 60,000/- ల ఖర్చులో నిర్మించ తలపెట్టింది. అలాగే నల్గొండజిల్లాలోని దేవరకొండ తాలూకా పార్టీ సమితి రు. 50,000/- ఖర్చులో పార్టీ కార్యాలయ భవన నిర్మాణాన్ని ప్రారంభించింది.

ప్రతిచోటా కార్యాలయాలు

ఒక్క ఆ రెండు తాలూకాల్లోనే యిప్పటికే రు. లక్షరూపాయల మేరకు విరాళాలు ప్రకటించబడగా, రు. 50,000/- ల మేరకు మొత్తాలు వసూలయ్యాయి. కడపజిల్లాలో జిల్లా పార్టీ కార్యాలయ నిర్మాణం జరుగుతోంది. అక్కడ కూడా వసూళ్ళు రు. 60,000/- కు చేరుకున్నాయి. ఈ భవనాలతోను, కొన్ని గ్రామశాఖలు, మరికొన్ని తాలూకా శాఖలు కూడా స్వంత కార్యాలయ భవనాలు నిర్మించుకోవాలను కొంటున్నాయి. జిల్లా పార్టీ కార్యాలయాల కోసమైతేనేమి, తాలూకా పార్టీ కార్యాలయాలకోసమైతేనేమి యింతవరకు సేకరింపబడిన మొత్తాలు గణనీయమైన స్థాయిలో వున్నాయి. ఈ భవనాల నిర్మాణానికి విరాళాలివ్వడంలో పార్టీ సభ్యులే కాకుండా, పార్టీ సానుభూతిపరులు సైతం పెద్దఎత్తున ముందు కొస్తున్నారు. తమతమ ప్రాంతాల్లో పార్టీ కార్యాలయభవనాలుండటం పార్టీ కార్యకలాపాలుమరింత పటిష్టంగా జరగడానికి తోడ్పడుతుందన్న విశ్వాసమే యిందుకు కారణం. పార్టీతో సంబంధం లేని ప్రజలు సైతం భవన నిధికి విరాళాలిచ్చారు.

బొగ్గుగని కార్మికుల ఆదర్శం

పోతే, మఖ్దూమ్ భవన నిధి సేకరణ విషయం చూసినప్పుడు, ఆంధ్రప్రదేశ్‌లోని బొగ్గుగని కార్మికుల ఉదాహరణ అత్యంత ఉత్తేజకరమైనది. అసలు, సింగరేణి బొగ్గుగని కార్మికులు రు. 2 లక్షల విరాళమిస్తామని వాగ్దాన మిచ్చిన మీదటనే మఖ్దూమ్ భవన నిర్మాణం పట్ల మాకు ఉత్సాహం రేకెత్తింది. సింగరేణి బొగ్గుగని కార్మికుల యూనియన్ నిర్మాత కామ్రేడ్ మఖ్దూమ్ కావడంతో, యీ నిధి విషయంలో వారికి సహజంగానే ప్రత్యేకాసక్తి వుంది. మఖ్దూమ్ భవననిధికిగాను బొగ్గుగని కార్మికులందరినుండీ తలఒకటికి పదేసి రూపాయలు వసూలు చెయ్యాలన్నది వాళ్ళ పథకం. బొగ్గుగని కార్మికులు ఖమ్మం జిల్లాలోని గోదావరి లోయలోను, కరీమ్‌నగర్, అదిలాబాద్ జిల్లాల్లోను విస్తరించి వున్నారు. ఖమ్మం జిల్లాలోని కొత్తగూడెం, ఎల్లెందులో 9000 మంది కార్మికుల నుండి రు. 90,000/- లు వసూలు చెయ్యాలని తీర్మానించుకున్నారు.

కొత్తగూడెంలో యిప్పటికే 2500 మంది కార్మికులనుండి రు. 25,000 లు వసూలు చెయ్యబడ్డాయి. మఖ్దూమ్ భవన నిధి కిచ్చేందుకుగాను ఆ మొత్తానికి ఒకబ్యాంకు డ్రాఫ్టును తీసుకొని, జిల్లాసమితి సమావేశంలో ఆ డ్రాఫ్టును కామ్రేడ్ నల్లమల గిరిప్రసాద్‌కు అందచేశారు.

ఎల్లెందులో మరో రు. 25,000 లు వసూలు చెయ్యబడింది. అయితే వారు ఆ మొత్తాన్నంతటిని స్థానికకార్యాలయ భవన నిర్మాణంకోసం అట్టే పెట్టుకున్నారు.

ఆ ప్రాంతంలో, మిగిలిన రు. 65,000 మొత్తాన్ని నవంబరు నెలాఖరులోగా వారు వసూలు చెయ్యాలనుకుంటున్నారు. కరీంనగర్ జిల్లాలోని గోదావరి ఖనిలో 5,300 మంది కార్మికులనుండి, ఒక్కొక్కరినుండి రు 10/- ల చొప్పున, రు 53,000/- లు వసూలు చేశారు. ఇటీవలనే నేనక్కడికి వెళ్ళి గోదావరి ఖని కార్మికులిచ్చిన రు 48,000/- డ్రాఫ్టును స్వీకరించాను. పోతే అదిలాబాద్‌జిల్లాలోని బెల్లంపల్లిలో 5000 మంది కార్మికుల నుండి రు. 50,000 లను వసూలు చెయ్యాలని నిర్ణయించుకున్నారు. కాగా, మొత్తంమీద, బొగ్గుగని కార్మికుల నుండి నవంబరు నెలాఖరులోగా రు. 2 లక్షలు వస్తుందని ఆశిస్తున్నాం. ఇప్పటివరకు బొగ్గుగని కార్మికుల నుండి మఖ్దూమ్ భవన నిధికి రు. 78,000/- లు నగదు వసూలైంది.

జిల్లాలనుండి విరాళాలు

మఖ్దూమ్‌భవన్ నిధి వసూళ్ళు యితర జిల్లాల్లో కూడా ప్రోత్సాహకరంగానేవున్నాయి. ఇటీవలనేను, జిల్లాపార్టీ కార్యదర్శితోను, మరికొందరు జిల్లా నాయకులతోను కలసి కృష్ణాజిల్లాలో పర్యటించాను. మూడురోజుల్లో రు. 27, 200/- లు వసూలు చెయ్యగలిగాము. ఈ సందర్భంగా ఒకవిశేషాన్ని మీ దృష్టికి తేవాల్సి వుంది. మాకు విరాళాలిచ్చిన వారందరూ యింతకుముందే పార్టీ నిధికి చందాలిచ్చి వున్నారు. కృష్ణాజిల్లాలో పార్టీ నిధివసూళ్ళుయిప్పటికేరు.1,10,000 కు చేరుకుంది. అయినప్పటికీ కూడా, 1975 జనవరిలో విజయవాడలో జరగబోయే అఖిల భారత పార్టీ మహాసభకు తాము మళ్ళీ విరాళాలివ్వాల్సి వుంటుందని తెలిసికూడా, వారు ఉదారంగా మఖ్దూమ్ భవనానికి విరాళా లిచ్చారు. మఖ్దూమ్ భవన్ నిధి వసూళ్ళ సందర్భంగా ఒక విశేషము. ఉత్సాహకరమైన మరో అనుభవం, నల్గొండ జిల్లాలోని మునసగిరిలో ఒకరోజు విరాళాల వసూలుకు వెళ్ళినప్పుడు నాకు కలిగింది. పార్టీ సానుభూతిపరుల నుండి, మిత్రులనుండి ఒక్కరోజులో మేము రు. 5,000 లు వసూలు చెయ్యగలిగాము. మఖ్దూమ భవన నిర్మాణ నిధి వసూళ్ళు అన్ని జిల్లాల్లోనూ విరాళాల రూపంలోనూ, రూపాయి నోట్ల అమ్మకాల ద్వారాను, జరుగుతున్నాయి. వివిధ జిల్లాల నుండి మఖ్దూమ్ భవన నిధికి యిప్పటికి మాకు రు. 1,87,000 లు అందాయి. కార్మిక వర్గ పార్టీ భవన నిర్మాణానికి కార్మిక వర్గం మహా ఉత్సాహంగా ముందుకు వచ్చింది. మఖ్దూమ్ భవన నిధి వసూళ్ళకు సంబంధించిన ముఖ్య విశేషమిది. ఇది బొగ్గుగని కార్మికుల రాజకీయ చైతన్య స్థాయిని తెలియజేస్తుంది. అంత ఎక్కువ మంది-సుమారు 19000 మంది-నుండి యింత పెద్ద మొత్తాన్ని విరాళంగా వసూలుచేసిన బొగ్గుగని కార్మికులు అభినందనీయులు.

అఖిల భారత మహాసభల నిర్వహణ

ఈ ఏడాది మన రాష్ట్ర సమితి రెండు అఖిల భారత మహాసభలు జరపాల్సి వచ్చింది. ఒకటి అఖిల భారత ఖేత్‌మజ్దూర్ (వ్యవసాయ కార్మిక) మహాసభ, రెండవది అఖిల భారత చేనేత కార్మిక మహాసభ, గుంటూరు జిల్లాలో జరిగిన అఖిల భారత ఖేత్ మజ్దూర్ మహాసభ కోసం రు.24,000/- లు వసూలు చెయ్యబడ్డాయి. ప్రకాశం జిల్లాలోని చీరాలలో జరిగిన అఖిల భారత చేనేత కార్మిక మహాసభ కోసం రాష్ట్రం అంతటా చేనేత కార్మికులనుండీ, మిత్రులనుండీ రు. 60,000/- లు వసూలు చెయ్యబడ్డాయి. పార్టీ విరాళాలు, పార్టీ భవననిర్మాణ నిధి వసూళ్ళు కాకుండా, యీ మొత్తం వసూలు చెయ్యబడిందన్న విషయం గమనార్హం.

ఇక పార్టీ నిధి వసూళ్ళ విషయానికొస్తే పశ్చిమగోదావరి, ఖమ్మంజిల్లాలు తాము ఈ సంవత్సరానికి పెట్టుకొన్న లక్ష్యాలను చేరుకొన్నాయి. పశ్చిమ గోదావరి పెట్టుకొన్న లక్ష్యం రు. 1 లక్ష. కాని, వారిప్పటికే రు. 1,01,000/-లు వసూలు చేశారు. మరో రు. 10,000/- లు కూడా వసూలు చెయ్యగలమని ఆ జిల్లా వాళ్ళంటున్నారు. ఖమ్మం జిల్లా పెట్టుకున్న లక్ష్యం రు. 1,50,000/-లు, వాళ్ళు దాదాపుగా ఆ లక్ష్యాన్ని చేరుకున్నట్లే. ఆ రెండు జిల్లాల్లోనూ పెద్దపెద్ద దాతలనుండే కాకుండా, పెద్దఎత్తున జనంనుండికూడా విరాళాలు సేకరింపబడ్డాయి. పశ్చిమ గోదావరి జిల్లాలోని తణుకు, తాడేపల్లిగూడెం పట్టణాల్లో పార్టీ సభ్యుల నుండి, సానుభూతి పరుల నుండి సామూహిక వసూళ్ళు జరిగాయి.

ముత్తెలమడుగు ఆదర్శం

అదే విధంగా బాగా వెనకబడిన గిరిజన ప్రాంతమైన ఖమ్మంజిల్లాలోని బూర్గంపాడు తాలూకాలో కూడా ప్రజా సామాన్యంనుండి మనపార్టీ రు. 15,000 లు వసూలుచేసింది. ఈ సందర్భంగా ఒక వాస్తవాన్ని పేర్కొనాల్సివుంది. ఈ తాలూకాలో పూర్వం, నక్సలైట్లు బలంగా వుండేవారు. రెండేళ్ళ క్రితందాకా మనపార్టీ సభ్యు లక్కడ చాలా కొద్దిమంది మాత్రమే వుండేవారు. ఇప్పుడా తాలూకాలో మనపార్టీ సభ్యత్వం ఒక 1000 కి పెరిగింది. ఈ వెయ్యిమంది పార్టీ సభ్యులూ ఆదిలో నక్సలైట్లలోకి పోయారు. అయితే నక్సలైట్ విధానాలపట్ల కార్యక్రమంపట్ల వారికి భ్రమలుతొలగిపోయి, తిరిగి మన పార్టీలో చేరారు. జిల్లా పార్టీ దళం విరాళాలకోసం వెళ్ళినప్పుడు, అనేకచోట్ల గ్రామస్తులే స్వయంగా ముందు కొచ్చి విరాళాలిచ్చారు. ముత్తెలమడుగు అనే ఒక గ్రామంలో గ్రామస్తులు వాస్తవానికి [illegible], యథాశక్తిగా చిన్నచిన్న మొత్తాల్లో మొత్తం రు. 2000/- లు విరాళంగా యిచ్చారు.

పార్టీ నిధి వసూళ్ళు ప్రదేశ్ కేంద్రం వసూళ్ళు రు7,20,050/-లోదాటు,రాష్ట్రంలో రు 7,20,650- కు చేరుకున్నాయి.

వసూళ్ళు యింతగా జరిగినప్పటికీ కూడా హోల్‌టైమర్ల వేతనాలింకా అధ్వాన్నంగానే వున్నాయి. హోల్‌టైమర్ల వేతనాలు వారు పనిచేసే ప్రాంతాన్నిబట్టి, వారి కుటుంబాల ప్రమాణాన్నిబట్టి, రు 100/- లను రు 300/- ల మధ్య వుంటున్నాయి. కాని, అను నిత్యం పెరుగుతున్న ధరల దృష్ట్యా, యీ వేతనాలు నాలుగు వేళ్ళూ నోట్లోకి పోవాలంటే సరిపోవు.

అందుకనే, మన రాష్ట్ర సమితి ఇటీవల, అన్ని జిల్లాల్లోని ప్రతి ఒక్క హోల్‌టైమరుకూ కనీసం రు. 25/లు వేతనం పెంచాలని, నిర్ణయించింది. ఈ నిర్ణయం పశ్చిమ గోదావరి, గుంటూరు, ఖమ్మం జిల్లాల్లో పూర్తిగా అమలు జరుపబడింది. పశ్చిమ గోదావరి యీ నిర్ణయాన్ని మించి కూడా వేతనాలు పెంచింది. హోల్‌టైమర్లందరికీ వాళ్ళు రు. 50 చొప్పున పెంచారు.

ఇతర జిల్లాలలో, కొత్త ప్రాంతాల్లో కొత్తగా హోల్‌టైమర్లను నియమించి పార్టీని విస్తరింప చెయ్యాల్సిన అవసరం వుంది. అందుకనే, మన రాష్ట్ర సమితి ముఖ్యమైన జిల్లాల్లో ఆరుమంది హోల్‌టైమర్ల చొప్పున, మిగిలిన జిల్లాల్లో మూడేసిమంది హోల్‌టైమర్ల చొప్పున పెంచాలని నిర్ణయించింది. యీ నిర్ణయం మేరకు, 1974లో 17 జిల్లాల్లో కొత్తగా 57 మంది హోల్‌టైమర్లు నియమింపబడ్డారు. కాగా, మనం పోగుచేసిన మొత్తం పెద్దగా కనిపించినప్పటికీ, పార్టీ పని అవసరాల దృష్ట్యా సరిపోదు.

పార్టీ నిధి వసూళ్ళ గుణపాఠాలు

1. పార్టీ నిధి వసూళ్ళకు విస్తృతమైన అవకాశముంది. లోపమేమిటంటే, పార్టీ నిధి వసూళ్ళకోసం జిల్లా, తాలూకా పార్టీ సమితులు సంఘటిత పద్ధతిలో కదిలి పని చెయ్యటం లేదు. పార్టీ ఎక్కడెక్కడైతే దీక్షాక కర్తవ్యంగా తీసుకొని, జిల్లా, తాలూకా, గ్రామ స్థాయిల్లో దళాలను ఏర్పాటుచేసిందో, అక్కడ ఈ ఏడాదికి పెట్టుకొన్న లక్ష్యాన్ని సాధించగలిగారు.

2 విరాళాల కోసం పార్టీ యిచ్చిన పిలుపును కార్మికవర్గం పెద్దఎత్తున అందుకొంది. కార్మికవర్గం తమ యూనియనుకు విరాళాలిస్తూ తమ హోల్‌టైమర్లను పోషించుకొంటూ, పార్టీకి యింత పెద్ద మొత్తాన్ని విరాళంగా యివ్వడమంటే, అది చిన్న విషయమేమికాదు. కొన్ని చోట్ల, పార్టీ నిధి కోసం కార్మిక వర్గాన్ని కలుసుకునే విషయంలో తటపటాయింపు ప్రదర్శింపబడింది. కానైతే బొగ్గు గనుల్లోను, తదితర కార్మిక వర్గ కేంద్రాల్లోనూ, మన అనుభవం ఏమి తెలియజేస్తోందంటే. పార్టీకి విరాళాలివ్వడానికి కార్మిక వర్గం సంసిద్ధంగా వుంది. కార్మికుల రాజకీయ చైతన్య స్థాయి పెరిగింది. కార్మికవర్గంనుండి పార్టీ నిధి సేకరణకు యింకా విస్తృతమైన అవకాశం వుంది. నాకు జ్ఞాపకమున్నంతవరకు, కార్మికవర్గం యింత పెద్దసంఖ్యలో పార్టీ నిధికి విరాళా లివ్వడమన్నది మన పార్టీ చరిత్రలో యిది మొదటి పర్యాయమను కుంటాను.

3. మన పార్టీ స్థానికకార్యాలయాలు చాల వరకు ఒకటి రెండు ఇరుకు గదుల్లో వుండటం ఆఫీసు కార్యక్రమాల సక్రమ నిర్వహణకు యిబ్బందికరంగా వుండటం - యిది మన పార్టీ సభ్యులను, శ్రేయోభిలాషులను చిర కాలంగా కలవర పెడుతున్న సమస్య. బహుశా అందుకనే పార్టీ కార్యాలయ భవనాల నిర్మాణంపట్ల పార్టీ సభ్యులు, శ్రేయోభిలాషులూ యింతగా ఆకర్షితులై వుంటారు.

తాలూకా, జిల్లా స్థాయిల్లో సక్రమమైన కార్యాలయ భవనాలుంటే పార్టీ పని మెరుగవుతుందనీ, పార్టీ పనిమీద మారుమూలజిల్లా, తాలూకా కేంద్రాలకు వెళ్ళినప్పుడు అక్కడ బసచేసే అవకాశముంటుందన్న ఉద్దేశం కూడా పార్టీ సభ్యులకు, శ్రేయోభిలాషులకు ఉంది.

నాయకుల ప్రత్యక్ష పాత్ర

4 పార్టీ నిధి వసూళ్ళలో రాష్ట్రసమితి నాయకులు ప్రత్యక్షంగాపాల్గొనడంవల్ల కూడా నిధివసూళ్ళు పెరుగుతున్నాయి. శాసనసభ్యుడు మన రాష్ట్ర కార్యవర్గ సభ్యుడూ అయిన కామ్రేడ్ వంకా సత్యనారాయణ పశ్చిమ గోదావరిజిల్లాలో పార్టీ నిధి వసూలు కార్యక్రమాన్ని ప్రత్యక్షంగా నడిపారు. అలాగే, ఖమ్మం జిల్లాలో కామ్రేడ్‌గిరిప్రసాద్ ప్రత్యక్షంగా పాల్గొనడం పార్టీ నిధి వసూళ్ళకు విశేషంగా తోడ్పడింది. బొగ్గుగని కార్మిక నాయకులతో బాటు కామ్రేడ్ గిరిప్రసాద్ బొగ్గుగని కార్మికుల్లోని పార్టీ సభ్యుల జనరల్‌బాడీ సమావేశాల్లో స్వయంగా పాల్గొని, ప్రసంగాలు చేసి, మఖ్దూమ్ భవన నిధి సేకరణోద్యమానికి వారిని సంసిద్ధులను చేశారు.

5. మఖ్దూమ్ భవన్‌నిధి సేకరణము పార్టీ నిధిసేకరణోద్యమంతో జతచెయ్యడం వల్ల కూడా యీ ఉద్యమానికి ఊపు వచ్చింది, ఉదారంగా విరాళాలివ్వబడ్డాయి. పార్టీ నిధిగా సమర్పింపబడిన మొత్తంలో, మఖ్దూమ్‌భవన్ నిర్మాణంకోసం వసూలు చెయ్యబడిన కొన్ని విరాళాలు కూడా కలిసి వున్నాయి. జిల్లా లింకా ఆ మొత్తాన్ని మాకు పంపాల్సివుంది.

మొత్తంమీద పార్టీ నిధికి, మఖ్దూమ్ భవన నిధికి జిల్లాలో వసూలుచేసిన విరాళాలు వెరసి రు 7,20,050 (ఏడు లక్షల, ఇరవై వేల, యాభై రూపాయలు) అయింది. మఖ్దూమ్ భవనంకోసం రాష్ట్రకేంద్రానికి ఇప్పటికే రు. 1,87,000లు చేరాయి. జిల్లాలూ, తాలూకాలూ తమ తమ కార్యాలయ భవనాలకోసం మరో రెండులక్షలరూపాయలు పోగుచేశాయి రాష్ట్రంలో జరిగిన రెండు అఖిలభారత మహాసభలకూ మరో రు. 84,000/- లు వసూలు చెయ్యబడ్డాయి.

అలా, మొత్తంమీద, యీఏడాది వసూళ్ళు రు. 11,91,050/- (అక్షరాల పదకొండు లక్షల, తొంభై ఒక్కవేల, యాభై రూపాయలు, చేరుకొంది.

పార్టీ నిధికి, అలాగే మఖ్దూమ్ భవననిధికీ ఉదారంగా విరాళాలిచ్చిన దాతలకు రాష్ట్ర సమితి తరపున ప్రగాఢమైన కృతజ్ఞతాభి వందన లర్పిస్తున్నాను.

విజయవాడలో జరిగిన తంతి తపాలాశాఖ అంతర్మండల సాంస్కృతిక పోటీలలో ఉత్తమ నటునిగా ఎన్నికైన శ్రీ చుండూరు రామారావు.

తంతి, తపాల సిబ్బంది క్రీడలు

విజయవాడ, సెప్టెంబరు 20

విజయవాడ సబ్ డివిజన్ తంతి, తపాల సిబ్బంది మూడురోజులపాటు ఆటల, నాటికల పోటీలలో పాల్గొన్నారు. ఈ నెల 14 న ముగింపు సందర్భంగా ఆంధ్ర సర్కిల్ జనరల్ మేనేజర్ శ్రీ వి. కామేశ్వరరావు అధ్యక్షతన సభ జరిగింది. లయోలా ప్రిన్సిపాల్ ఫాదర్ ఫ్రాన్సిస్ అధ్యక్షత వహించారు.

ట్రంక్‌కాల్స్, ఎక్స్‌ప్రెస్ డెలివరీలు, ఎండా, వానలలోకూడ టెలిఫోన్ స్తంభాలు ఎక్కి బాగుచేసే వారు క్రీడల పోటీలలోనేగాక నాటకల పోటీలలో కూడా పాల్గొనడాన్ని శ్రీ ఫ్రాన్సిస్, శ్రీ రావు అభినందించారు. డి. యి. టి. శ్రీ కె. శ్రీనివాసమూర్తి స్వాగతం చెప్పగా, సాంస్కృతిక సంఘ ప్రధాన కార్యదర్శి శ్రీ వి. వి. జి. వి. అప్పారావు వందన సమర్పణ చేశారు.

రివెన్యూ సిబ్బందిచే "యథా ప్రజా...."

కృష్ణాజిల్లా రివెన్యూ సిబ్బంది యిటీవల "యథాప్రజా-తథారాజా" అన్న నాటికను రైల్వే యిన్‌స్టిట్యూట్ ఆడిటోరియంలో ప్రదర్శించారు.

నిత్యం పై అధికారుల కోర్కెలు, అర్జంట్ ఫైళ్ళు, వి.ఐ.పి ల పర్యటనలకు ఏర్పాట్లతో సతమతమయ్యే రివెన్యూ సిబ్బంది తమలోని కళాతృష్ణను పెంచుకోవటం, అందునా యథా ప్రజా తథా రాజా లాంటి నాటికను ప్రదర్శించటం హర్షణీయం.

హైదరాబాద్‌లో రివెన్యూ సిబ్బంది, రిక్రియేషన్ భవనంకై విజయవాడలో యీ ప్రదర్శనను ఏర్పాటుచేశారు. శ్రీ వేదాంతం సత్యనారాయణ "ఉష" వెనుక సీట్లవారినేగాక ముందుసీట్ల వారిని కూడ తన్మయులను చేసింది. ఉషాపరిణయం ముందు శ్రీమతి లక్ష్మీవేణుగోపాల్‌అధ్యక్షతన సభ జరిగింది. రివెన్యూబోర్డు ప్రథమసభ్యుడు శ్రీ కుప్పుస్వామి ప్రధాన అతిథిగా హాజరయ్యారు. ఉషాపరిణయంకన్నా ముందు యథాప్రజా - తథా రాజా ప్రదర్శన జరిగివుంటే బాగుండేది.

సంగీత ప్రియులకు

విజయవాడలో కర్ణాటక, హిందూస్తానీ సంగీత ప్రియులకు మరో శుభవార్త, రామకృష్ణ భజన సభవారు శ్రీరామనవమి, దసరాలాంటి హిందువుల పండుగలను జరుపుకొనుటంతోపాటుగా సంగీత కచేరీలు నిర్వహించాలని, ప్రముఖ కళాకారులను ఆహ్వానించాలని యిటీవల నిర్ణయించటం ఆచరణలో ప్రారంభించటం

సెప్టెంబరు నెల కార్యక్రమంగా కుమారి ఉమ, కుమారి శోభల గాత్ర కచేరీని యీ నెల 14 వ తేదీన రైల్వే ఇన్‌స్టిట్యూట్ లో నిర్వహించారు. ఏడు సంవత్సరాలుగా శ్రీ టి. యస్. చంద్రశేఖరన్ వద్ద శిక్షణ పొందిన వీరు పూర్తిగా కర్ణాటక సాంప్రదాయంలో కచేరి చేశారు. వయోలిన్ ద్వారా 21 సంవత్సరాల శ్రీ పి. నాగేశ్వరరావు, మృదంగంతో 17 సంవత్సరాల శ్రీ లక్ష్మీనారాయణరాజు తోడ్పడ్డారు.

ఈ సంగీత కచేరికి అందరూ ఆహ్వానించబడటం, ప్రవేశరుసుం లేకపోవటం విశేషం.

మంచి నాటికకు బహుమానం

అనంతపురం, సెప్టెంబరు 15

అనంతపురం అభ్యుదయ కళాసమితి కార్యదర్శి శ్రీ కె. సత్యరంగారావు, ఈ క్రింది విధముగా తెలియ జేస్తున్నారు.

వర్ధమాన నాటకరంగానికి మంచి నాటికల అవసరాన్ని పురస్కరించుకొని అనంతపురం అభ్యుదయ కళాసమితివారు ఉత్తమ నాటికా రచనకు 500 (అయిదు వందలు)రూపాయలు బహుమతి ఇవ్వడానికి సంకల్పించారు.

నిబంధనలు

నాటిక ఈనాటి సామాజిక పరిస్థితుల్ని ప్రతిబింబించాలి.

ఒక గంట వ్యవధిలో ముగిసిపోయే పోటీ పరిమితి కలిగి ఉండాలి.

విధిగా ఉండవలసిన ఒక స్త్రీ పాత్రతో పాటు మొత్తం పాత్రలు ఆరుకిమించరాదు.

నాటికలో ఉపయోగించే భాష విశాలాంధ్రలో ఏ ప్రాంతం వారికైనా అర్థమయ్యేలా వుండాలి.

న్యాయమూర్తులచే బహుమతికి అర్హంగా నిర్ణయింపబడిన నాటికను ముద్రించి, ప్రదర్శించే హక్కును అభ్యుదయ కళా సమితి కలిగి వుంటుంది.

రచనలు 31-10-74 లోపల కార్యదర్శి, అభ్యుదయ కళాసమితి రివెన్యూ క్లబ్బు, అనంతపురం పేర పంపుకోవాలి.

సినిమా

"కొత్తకాపురం" చిత్రంలో కృష్ణ

కొత్త కాపురం

స్వార్థం వెర్రితలలు వేసిన మనిషి రాక్షసుడుగా మారుతాడు. అమాయకులను అగచాట్లపాలు చేస్తాడు. ఏ హక్కూ లేక పోయినా, కేవలం కూతురి కారణంగా మోతుబరి ఆసామి సోమయ్య వియ్యంకుడైన మల్లన్న సోమయ్య కూతురు గంగ పెళ్ళి బలవంతంగా తనకొడుకుతో చేసేందుకు ఏర్పాటుచేశాడు. అందుకు సోమయ్య అప్పగారు దర్గమ్మ, కొడుకు భద్రం, కోడలు పార్వతికూడా తలో చెయ్యి వేశారు. ఒద్దు మొర్రో అంటూ ఏడుస్తున్న గంగను యీడ్చుకొచ్చి పీటలమీద కూలేశారు.

"ఒదినా, అమ్మమ్మా, నాకీపెళ్ళి ఇష్టం లేదు-అన్నాయ్" అంది ఏడుస్తూ లేవబోయింది గంగ.

"ఏమిటే నీ యిష్టం...పార్వతి నా మనమడికిష్టమూ, నా కిష్టమూ? మీ నాయన బలవంతంగా చేయలేదూ మేమూ అంతే." కదలకుండా కూర్చుని తాళి కట్టించుకో, పార్వతీ, ఆ పసుపుతాడు తే" అంది దుర్గమ్మ.

అన్నాయ్, నీకు దణ్ణం పెడతానురా - నాకీ నరకం తప్పించు. నాన్న వచ్చేదాకా ఆపరా అన్నాయ్" అని భద్రాన్ని ప్రతిమాలుకుంది గంగ. ఐతే ఆ కరకు హృదయం కరగలేదు. ఇంతలో పార్వతి పట్టుకొచ్చిన పసుపుతాడు చూపిస్తూ తీసుకోమని బలవంతంచేశాడు బసవన్నని మల్లన్న. బసవన్న సందేహిస్తుంటే కత్తితో బెదిరించేసరికి తీసుకోక తప్పలేదు. "కట్టెయ్... ఊ...లే...లే" అని అన్నగార్ని లేవదీసింది పార్వతి.

ప్రసన్నలక్ష్మి పిక్చర్స్ పతాకంక్రింద నిర్మాత శ్రీ డి. వెంకటరత్నం నిర్మిస్తున్న "కొత్తకాపురం" చిత్రంలోనిదీ సన్నివేశం చూడాలిమరి. యింతవరకు మూడు పాటలతోపాటు పన్నెండురీళ్ళు తయారైన యీ చిత్రంలో కృష్ణ, గుమ్మడి, చంద్రమోహన్, పద్మనాభం, అల్లు రామలింగయ్య, రాజనాల, జగ్గారావు, భారతి, కృష్ణకుమారి, రమాప్రభ, సూర్యకాంతం, అనిత, హేమలత, బా. భానుమతి, బేబి శ్రీదేవి ప్రధాన భూమికలు నిర్వహిస్తున్నారు.

మాటలు ; బొల్లిముంత శివరామకృష్ణ: కెమేరా ; లక్ష్మణ్‌గోరె, సంగీతం : కె. వి. మహాదేవన్, ఆర్టు: బి.వి.తలం, ఎడిటింగ్, మహేశ్వరరావు, అసోసియేట్ డైరెక్టర్ :. పి. బ్రహ్మానందరావు, స్క్రీన్‌ప్లే,దర్శకత్వం పి. చంద్రశేఖరరెడ్డి, బి.ఏ: నిర్మాత : డి. వెంకటరత్నం. నవతా రిలీజ్.

"జేబుదొంగ"

పసుతా ఆర్ట్సు సమర్పించు "జేబు దొంగ (ఈస్టుమన్ కలర్) తాలూకు ముహూర్తం ఈ నెల తొమ్మిదవ తారీఖు ఉదయం తొమ్మిది ఇరవై మూడు నిముషాలకు వాహినీ స్టూడియోసులో జరిగింది. లక్ష్మీ ఫిలిమ్స్ అధినేత బి. శివరామ కృష్ణయ్య స్విచ్ ఆన్‌చేయగా, ప్రముఖ దర్శకులు కె. యస్. ప్రకాశరావు క్లాప్ కొట్టారు. మొదటి షాట్ శోభన్‌బాబుపై చిత్రీకరించారు.

ఈ షెడ్యూల్ తొమ్మిదవ తారీఖు నుండి ఇరువదవ తారీఖు వరకు జరిగింది. ఈ చిత్రంలో శోభన్ బాబు, రాజబాబు, సత్యనారాయణ, ప్రభాకర రెడ్డి, అల్లు రామలింగయ్య, రావు గోపాల రావు, మురళీమోహన్, పి. వెంకటేశ్వర రావు, మంజుల, రోజారమణి, రమాప్రభ, కృష్ణకుమారి పాల్గొంటున్నారు.

రచన : ముళ్ళపూడి వెంకటరమణ, సంగీతం: చక్రవర్తి, ఛాయ: యస్.వెంకటరత్నం, నిర్మాతలు: వి. ఆర్. యాచేంద్ర, కె. చటర్జీ, దర్శకుడు: వి. మధుసూదనరావు: లక్ష్మీ ఫిలిమ్స్: విడుదల.

'నిత్యసుమంగళి' చిత్రంలో విజయలలిత

బాలయ్య తృతీయ చిత్రం

చెల్లెలికాపురం, నేరము-శిక్ష ఈ రెండు అత్యుత్తమ చిత్రాలను ఆంధ్ర ప్రజలకు సమర్పించిన శ్రీ బాలయ్య తమ తృతీయ కానుకగా మరో చక్కని సాంఘిక థీమ్ సెంటిమెంటల్ కథా గమనంగల సరికొత్త చిత్రాన్ని యిప్పుడు నిర్మిస్తున్నారు.

ఈ చిత్రానికి కూడా తానే అత్యున్నతమైన కథను రూపొందించారు. ఈ చిత్ర కథకు జూనియర్ సముద్రాల సంభాషణలు వ్రాశారు. కొసరాజు, దాశరథి, దేవులపల్లి కృష్ణశాస్త్రి పాటలను వ్రాశారు. ఛాయా గ్రహణం : బి. రామచంద్రయ్య, సంగీతం యస్. రాజేశ్వరరావు, కూర్పు : వీరప్ప, లోగడ 'మరపురాని తల్లి' చిత్రానికి దర్శకత్వం వహించిన శ్రీ డి. యస్. ప్రకాశ రావు ఈ చిత్రానికి దర్శకత్వం నిర్వహిస్తున్నారు.

బాలయ్య, చంద్రమోహన్, రావుగోపాలరావు, మిక్కిలినేని, రాజకొండలరావు, సాక్షి రంగారావు, మోదుకూరి సత్యం, రవికుమార్, ప్రభ, రోజారమణి, పండరీబాయి మున్నగు నటీనటులు నటిస్తోన్న ఈ చిత్రంలో నూతన నటుడు సత్యేంద్రకుమార్ పరిచయం కానున్నారు.

ఆగస్టు 30 తేదీన విజయా గార్డెన్స్‌లో పాటల రికార్డింగ్‌తో ప్రారంభమైన ఈ చిత్రం తాలూకు షూటింగులు ప్రథమ షెడ్యూలు ప్రకారం వాహినీ స్టూడియోలో సెప్టెంబరు 2వ తేదీనుండి సాగాయి.

సమస్యాత్మకమైన ఈ చిత్రాన్ని మూడు మాసాలలోగా పూర్తి చేసి, 74 డిశంబరులో శ్రీ ఫిలింస్ వారి ద్వారా విడుదల చేయాలని ఈ చిత్ర నిర్మాతలు శ్రీ ఏ. సూర్యనారాయణ, శ్రీ ఎం. వెంకట్రావులు సంకల్పించారు.

'చక్రవాకం' చిత్రంలో శోభన్‌బాబు

కథానాయకుని కథ

తారకరామా పిక్చర్సు సమర్పించు "కథానాయకుని కథ" తాలూకు పాట సాతనూర్‌డామ్‌లో యన్. టి. రామారావు, వాణిశ్రీ, భారతిలపై చిత్రీకరించారు.

"మగసిరి చూపి మనసును దోచిన
మొనగాడా !
గడసరి చూపుల గారడి చేసిన
చినదానా !"

ఈ పాటను దాశరథి రచించగా కె. వి. మహదేవన్ స్వర కల్పనలో యస్.పి. బాల సుబ్రహ్మణ్యం, వాణీ జయరాం పాడారు.

ఈ నెల ఐదవ తేదీ నుండి పదిహేనవ తేదీ వరకూ ఇండోర్, ఔట్‌డోర్ షూటింగ్‌లో దాదాపు పద్నాలుగు రీళ్ళు పూర్తి అయింది. ఈ షెడ్యూల్లో రామారావు, వాణిశ్రీ, భారతి, సత్యనారాయణ ప్రభాకరరెడ్డి, కాకరాల మొ॥వారుపాల్గొన్నారు. వీరుగాక చిత్రంలో రమాప్రభ, శ్రీవిద్య, యస్. వరలక్ష్మి, పండరీబాయి, ఛాయాదేవి, మమత, రాజబాబు, అల్లు రామలింగయ్య, మిక్కిలినేని మొ॥వారు నటిస్తున్నారు.

రచన జాన్సన్, పాటలు కొసరాజు, దాశరథి, సి. నారాయణరెడ్డి, ఆత్రేయ, సంగీతం కె. వి. మహదేవన్, కెమెరా జె. సత్యనారాయణ, అసోసియేట్ డైరెక్టర్ యస్. గోపాలకృష్ణ, నిర్మాణ నిర్వహణ యం. జనార్దన్, సి. హెచ్. వెంకట్రావు, దర్శకత్వం డి. యోగానంద్, నిర్మాత కె. దేవీవరప్రసాద్. పంపిణీదారులు ఆంధ్రలో విజయ.

"చిన్ననాటి కలలు" చిత్రంలో ప్రమీల, కె.కె.శర్మ తదితరులు

"చిన్ననాటి కలలు"

"సీతాకోక చిలుకల్లారా -
సింగారించుకు వచ్చారా......"
మీరు సంగారించుకు-వచ్చారా......"
పైలా పచ్చీసు బాబుల్లారా-
మాకే పోజులు కొడతారా
మీరు మాకే పోజులు కొడతారా..."

కాలేజీ విద్యార్థి విద్యార్థినులు-ఒకరి నొకరు హేళన చేసుకుంటూ పాడే యీపాట ధృవ చిత్ర వారి "చిన్ననాటి కలలు" చిత్రం కోసం అభ్యుదయ దర్శకుడు శ్రీలెనిన్‌బాబు కృష్ణంరాజు, ప్రమీల బృందంమీద మైసూర్ యూనివర్శిటి సెంటినరి హాల్‌లో ఆర్క్-లైట్ సహాయంలో అపూర్వంగా చిత్రీకరించారు.

మరో గీతాన్ని కృష్ణంరాజు, ప్రమీలలమీద చిత్రీకరించారు. యీ గీతంలో విశేషమేమంటే కథానాయకుడు కృష్ణంరాజు, జయంతి, పాత్రను ఊహించుకుంటూ పాడే యీపాట ప్రమీల తన పరంగా అన్వయించుకుంటుంది.

విఖ్యాత నిర్మాత శ్రీ తమ్మారెడ్డి కృష్ణమూర్తి సమర్పిస్తున్న "చిన్ననాటి కలలు" చిత్రానికి కథ భీసెట్టి లక్ష్మణరావు, మాటలు వినిశెట్టి, భీశెట్టి, ఛాయ వి. యస్. ఆర్. కృష్ణారావు, సంగీతం టి. చలపతిరావు.

దర్శకత్వం: టి. లెనిన్‌బాబు; నిర్మాతలు: టి. భరద్వాజ్, ఇ. యస్. రెడ్డి. లక్ష్మీఫిలింస్ విడుదల.

కసౌటీ

అక్టోబరు 4 విడుదల

హేమమాలిని, అమితాబ్ బచ్చన్, ప్రాణ్, సోనియా సాహిణి, రమేష్‌దేవ్. అభిభట్టాచార్య, భరత్ భూషణ మున్నగు వారితో అరబిందసేన్ దర్శకత్వంలో లలిత్ చిత్రా కళామందిర్ ఈస్ట్‌మన్ కలర్‌లో నిర్మించిన హిందీ క్రయం చిత్రమిది. కల్యాణ్‌జీ ఆనంద్‌జీ సంగీత దర్శకులు. ఆంధ్రలో అక్టోబర్ 4న వెరైటీ పిక్చర్స్ ద్వారా విడుదల.

'వాణీ దొంగలరాణి' చిత్రంలో జయంతి

'హల్లో పార్ట్‌నర్' చిత్రంలో విజయలలిత

కొత్తరంగులు దిద్దుకుంటున్న రెడ్‌స్క్వేర్

మాస్కో, సెప్టెంబరు 25

మాస్కోలోని చారిత్రాత్మకమైన రెడ్ స్క్వేర్, పురాతన క్రెమ్లిన్ భవనం కొత్త రంగులు, వింత హంగులను సంతరించుకుంటున్నాయి.

కొద్దిఏళ్ళ క్రితం నిపుణులైన ఇంజనీర్లు కళాకారులు, శిల్పులు, డిజైనర్లు రూపొందించిన పథకంమేరకు పునర్నిర్మాణ కార్యక్రమం చక చకా సాగుతోంది.

అరుదైన శిల్పసంపద, అపురూపమైన మ్యూజియంలు, భవనాలను తిరిగి ఆధునికంగా నిర్మిస్తున్నారు.

మాసోలియం

లెనిన్ మృతదేహం భద్రంగా ఉంచబడిన "మాసోలియం"కు కొద్దిపాటి మార్పులు మాత్రం జరుగుతున్నాయి. దాని రూపంలో మాత్రం ఎలాంటి తేడా ఉండబోదు.

మన ప్రతిబింబం స్పష్టంగా కనబడేంత అందంగా, అద్దంలా ఉండే మాసోలియం ఇటుకల్లో అతి సన్నని బీటలు వచ్చాయట. అయితే ఇవి మామూలు కంటికి అగుపించవు. సూక్ష్మదర్శిని యంత్రాలతో కనుగొన్నారు. బీటలు విచ్చిన రాళ్ళను మాత్రం కొత్తగా పెడతారు. కొత్త రాళ్ళకూ పాత రాళ్ళకూతేడా కనిపించకుండా ఉండేందుకు సోవియట్ లోని సుదూర ప్రాంతంలో ఉజ్‌బెక్ క్షేత్రంలోఉన్నరాయిని ఇక్కడికి ప్రత్యేకంగా తెప్పించారు.

మాసోలియం ముందు అనునిత్యం వేలాది మంది నిలిచే ప్రాంతంలో పాతదనంతో కొత్తదనం అందమిచ్చే ఇటుకలు వేర్వేరుగా పేర్చినట్టే ఉంటాయి, కొన్నిచోట అవి ఊడిపోయాయి. మళ్ళీ అలాంటి పాతదనంతో అదే రంగుతో ఉండే ఇటుకలకోసం ఉక్రెయిన్‌లో ఒక ప్రాంతం నుండి మట్టి తెప్పించారు.

వెయ్యిమంది గ్రానైట్ కార్మికులు శిల్పులు, ఇంజనీర్లు షిఫ్టుల వారీగా 24 గంటలూ ఎర్రచౌకులో పని చేస్తూనే ఉన్నారు. లెనిన్ మాసోలియం కుడి ఎడమల్లో అతిథులకు ఉండే స్టాండ్‌లు ఇకపై ధూమ్రవర్ణంలో ఉంటాయి. సువిశాలమైన క్రెమ్లిన్‌గోడ మంచుకూ వానకూ దెబ్బతినకుండా "హైడ్రో ఫోబిక్ కాంపోజిషన్"తో రక్షణ కల్పిస్తున్నారు. కొత్తగా రంగులు వేసిన తర్వాత గూడా గోడ కనబడే తీరులో మార్పు ఉండదు.

భవంతులు

నిజుపాటి క్రెమ్లిన్‌భవన్ అగ్రభాగాన మెరిసే ఎర్రటి నక్షత్రంవరకూ పొడవాటి క్రేన్‌లు పెట్టి ఉన్నాయి. 4 టవర్లలోరెండిటి పునర్నిర్మాణం ఇప్పటికే జరిగింది.

మాసోలియంపై పెద్ద టార్పాలిన్‌లు కప్పివేశారు. ఆరువారాలలో ఈ పని మొత్తం పూర్తి అవుతుంది. అప్పటివరకూ లెనిన్ మృతదేహాన్ని, క్రెమ్లిన్ టవర్లనూ చేరువనుండి చూడటానికి విదేశీ పర్యాటకులకుకూడా అవకాశం ఉండదు.

సోవియట్‌లో అంతర్యుద్ధం సాగినపుడు, హిట్లర్‌సేన దాడి జరిగినపుడు ఎర్రసేన రెడ్‌స్క్వేర్‌లోనే ప్రతినతీసుకుని కదిలింది. ఫాసిజం ఓటమి ఉత్సవాలు, అధునాతన ఖండాంతర వేదుం ప్రదర్శనవంటి చారిత్రాత్మక ఘటనలు ఈ రెడ్‌స్క్వేర్‌లోనే జరిగాయి. సోవియట్ ప్రజలు ఈ చౌకును అపురూపంగా చూసుకుంటారు.

థియూపై అవినీతి ఆరోపణలు

హనోయ్, సెప్టెంబరు 24

దక్షిణ వియత్నాం కీలుబొమ్మ అధ్యక్షుడు థియూ అవినీతి చర్యలను వివరించే ఆరోపణల పత్రాన్ని సైగాన్ ప్రభుత్వ భాగస్వాములే రూపొందించారని వియత్నాం న్యూస్ ఏజన్సీ తెలిపింది.

సైగాన్‌లో ప్రస్తుతం రేగుతున్న రాజకీయ వాద ప్రతివాదాల అసలు రహస్యాలను ఈ పత్రం బయటపెట్టింది. అనేక పత్రికలు ఈ వార్తను ప్రచురించిన వెంటనే వాటిని స్వాధీనం చేసుకుంటూ థియూ ఉత్తర్వు చేశారు. దీనికి నిరసనగా ఆ పత్రికలవారు తమ ప్రతులన్నిటినీ దగ్ధం చేశారు.

అధికారాన్ని ఆసరా చేసుకుని సైగాన్ తదితర ప్రాంతాల్లో ఇళ్లూ భూములను థియూ సంపాయించుకున్నాడని మొదటి ఆరోపణ తెలిపింది. ఎరువుల దొంగ సరఫరా కుంభకోణంలోచిక్కుకున్న తన బావమరిదిని థియూ రక్షించాడు. కొద్ది నెలలక్రితం ఆ కుంభకోణంపై సైగాన్‌లో పెద్దఅల్లరి చెలరేగింది. థియూ భార్య సైగాన్ ఆస్పత్రి నిర్మాణంలో అనేక అవకతవకలు చేసింది. అధ్యక్షుడు థియూ, ప్రధాని కిమ్ మిలాఖత్ అయి నల్లమందు, గంజాయి ఎగుమతి చేశారు. ఆ పత్రం ఇలా ముగిసింది. "సైన్యానికి చెందినదేదో సైన్యానికే తిరిగి ఇవ్వాలి. దేశానికి చెందినదేదో దేశానికే తిరిగి ఇవ్వాలి. ప్రజలకు చెందినదేదో ప్రజలకే తిరిగి ఇవ్వాలి."

సైన్సు టీచర్‌లేని హైస్కూలు

నర్సాపురం, సెప్టెంబరు 22

పశ్చిమగోదావరిజిల్లానర్సాపురంతాలూకా ఎల్. బి. చర్లలోని జిల్లా పరిషత్ హైస్కూలులో గత రెండేళ్ళ నుండి సైన్సు టీచర్ లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు.

ఈ విషయమై పరిషత్ సెక్రటరీని కలిసి ఎన్ని తూర్లు మొరపెట్టుకున్నా ఫలితం శూన్యం. (వి. వి.)

విశాఖపట్నంలో సన్నాహక కమిటీ

డాంగే జన్మదినోత్సవ నిర్వహణకై

విశాఖపట్నం, సెప్టెంబరు 22

విశాఖపట్నంలో డాంగే 75 జన్మదినోత్సవ నిర్వహణకు సన్నాహకకమిటీ ఏర్పాటైంది. సన్నాహక కమిటీ ఏర్పాటు సందర్భంగా ఈ నెల 15 న హార్బర్ అండ్ పోర్ట్ వర్కర్స్ యూనియన్ ఆఫీసులో వివిధ కార్మిక సంఘాల ప్రతినిధులు సమావేశమయ్యారు.

సమావేశ ప్రారంభంలో హార్బర్ అండ్ పోర్ట్ వర్కర్స్ యూనియన్ కార్యదర్శి శ్రీ వి. వి. రామారావు డాంగే జన్మదినోత్సవ ఏర్పాట్లగురించి మాట్లాడారు.

ప్రముఖ ట్రేడ్‌యూనియన్ నాయకులు శ్రీ భద్రం, పోర్టు ఎంప్లాయీస్ యూనియన్ ప్రధాన కార్యదర్శి శ్రీ బి. ధర్మారావు సిటీ ట్రేడ్ యూనియన్ కౌన్సిల్ ప్రధాన కార్యదర్శి కె. గురుమూర్తి ఇంకా బ్యాంకి, రైల్వే, విద్యుత్, కార్మిక సంఘాలకు చెందిన ప్రతినిధులతో సన్నాహక కమిటీని ఎన్నుకున్నారు.

ఆలమూరు తాలూకాలో కిరోసిన్ కొరత

కాపేశ్వరం, సెప్టెంబరు 22

తూర్పుగోదావరిజిల్లా ఆలమూరు తాలూకాలో కిరోసిన్‌దొరకక ప్రజలుఇబ్బందులకు గురవుతున్నారు. ఎక్కడన్నా దొరికినా లీటర్ రు. 2 కు తక్కువ అమ్మడంలేదు

మండపేట పట్టణంలో కిరాణా వర్తకులు కిరోసిన్ అమ్మరాదని నిర్ణయం తీసుకుని నిర్ణయాన్ని అక్షరాలా అమలు జరుపుతుండడంతో కిరోసిన్ కంటికే కనిపించడం లేదు.

మండపేటలో ముగ్గురు కిరోసిన్ డీలర్లు వున్నా ఒక్కరు కూడా కంట్రోల్ రేటుకు అమ్ముతున్న పాపాన పోవటం లేదు. ఈ విషయాన్ని పై అధికార్లకు తెలిపినా ప్రయోజనం లేకుండా వుంది.

మండపేటలో పంచదార కిలో రు. 8 అమ్ముతున్నారు.

ధాన్యం పంపిణీ

ఆలమూరు తాలూకా కాపేశ్వరం సర్పంచ్ శ్రీపుత్సకాయల వెంకటనారాయణ ఇటీవల పనులు దొరకని స్థానిక హరిజన వ్యవసాయ కార్మికులకు 8 క్వింటాళ్ళ ధాన్యం ఉచితంగా పంపిణీ చేశారు.

పనులు దొరక్క వ్యవసాయ కార్మికులు పస్తులతో కాలం గడుపుతున్నారు. వెంటనే కరువు పనులు ప్రారంభించకపోతే పరిస్థితి మరింత తీవ్రమవుతుంది. (వి. వి.)

ఎరువుల కొరకు రైతుల అగచాట్లు

భద్రాచలం, సెప్టెంబరు 23

నూగూరు తాలూకా చర్ల ఏరియా రైతులకు ప్రభుత్వం ఎకరానికి అయిదు కిలోల ఎరువులు మాత్రమే పంపకం ఏర్పాట్లు చేసింది.

కార్డులపై జరిగే ఈ పంపిణీలో గ్రామ కరణాలు, ఎ. డి. ఓ.ల కుంభకోణాల గురించి యిక చెప్పనవసరంలేదు. ఇంతవరకు కొందరు రైతులకు కార్డులు అందలేదు. వచ్చిన కార్డులపై ఎ. ఇ. ఓ. సంతకాలు లేవని ఎరువులు యివ్వ నిరాకరిస్తున్నారు. ఇక అనుదినమూ రైతులు ఇటు ఎ. డి. ఓ. అటు ఎ. ఇ. ఓ. వద్దకు పాద యాత్రలు చేయవలసి వస్తున్నది.

కావున రైతులను కోర్టులచుట్టూ తిప్పే విధంగా కాకుండా ఎరువులు సక్రమంగా అదేవిధంగా చూడాలని ప్రభుత్వాన్ని భద్రాచలం డివిజన్ కమ్యూనిస్టుసమితి కార్యవర్గ సభ్యులు శ్రీ సి. హెచ్. తిరుపతి ఒక ప్రకటనలో కోరారు.

రజకునిపై ఎస్. ఐ. దౌర్జన్యం

అద్దంకిలో

ఒంగోలు, సెప్టెంబరు 18

తన యూనిఫారం బట్టలు ఇస్త్రీచేయలేదన్న క్రోధంతో అద్దంకి పోలీస్ సబ్ ఇన్‌స్పెక్టర్ సుందర రామిరెడ్డిపట్టణంలోని ఒక లాండ్రీ యజమానిని పోలీస్‌స్టేషన్‌కు పిలిపించి విపరీతంగా కొట్టించాడు.

రాత్రి 8 గంటల సమయంలో బొగ్గులు అయిపోయినందువల్ల లాండ్రీ కట్టివేసి లాండ్రీ యజమాని ఇంటికి వెళ్ళుతున్న సమయంలో కానిస్టేబుల్‌వచ్చి ఎస్. ఐ. యూనిఫారం ఇస్త్రీ చేయవలసిందిగా కోరాడు. బొగ్గులకు కూడా తనవద్ద డబ్బులు లేనందున అతను ఇస్త్రీ చేయలేకపోయాడు.

ఎస్. ఐ. సుందరరామిరెడ్డిపైనా, మరో ఇద్దరు కానిస్టేబుల్స్‌పైనా వెంటనే తగు చర్యలు తీసుకోవాలని కోరుతూ అఖిల భారత రజక సంఘం అధ్యక్షులు శ్రీ పేమరపు వెంకటేశ్వర్లు, ప్రదేశ్ సంఘ కార్యదర్శి శ్రీ దేవరపల్లి మస్తానరావు, జిల్లా సంఘ ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఎం. అంజయ్యలు ఈ నెల 18 న ఒంగోలుకు వెళ్ళి ప్రకాశంజిల్లా కలెక్టర్‌కు మెమొరాండం ఇచ్చారు.

నీటితీరువా పెంపు: అనంతరామన్ కమిటీ సిఫార్సులు

రాష్ట్రంలో వివిధ ప్రాంతాలలో వివిధ జలాధారాల క్రిందనున్న నీటి తీరువా రేట్లను గురించి, పల్లపు శిస్తులను గురించి విచారించడానికిగాను శ్రీ అనంతరామన్ అధ్యక్షతను రాష్ట్రప్రభుత్వం ఒక కమిటీని నియమించింది. ఈ కమిటీ తన నివేదికను 1973 లో ప్రభుత్వానికి అందజేసింది.

ఈ సిఫార్సులలో ముఖ్యమైనవాటిని ఈ దిగువ పొందుపరుస్తున్నాం:

ఒకే నీటి తీరువా విధానం

వివిధ ప్రభుత్వ జలాధారాల క్రింద నీటి తీరువా విధించుటకు వివిధ పద్ధతులు నేడు అమలులో వున్నాయి. భూమిశిస్తు, నీటి తీరువాను కలిపి, పల్లపు శిస్తు విధించే విధానము. తారతమ్య నీటి తీరువా రేట్ల విధానము ఒకే విధమైన రేటు విధించే విధానములను రద్దుచేసి వీటి స్థానంలో రాష్ట్రమంతటికీ వర్తించే ఒకే విధానము వుండాలి.

రాష్ట్రంలో పల్లపు శిస్తులు విధించబడుతున్న భూములను మెట్టభూములుగా పరిగణించి వాటిపై నీటి తీరువా రేట్లను వేరుగా విధించాలి.

నీటి తీరువా పన్నుగాదు —

నీటి తీరువాను పన్నుగా పరిగణించరాదు. దానిని సప్లయి ధరగా పరిగణించాలి.

సేద్యానికి సప్లయిచేసిన నీటి ధర, జలాధారాల నిర్మాణానికి అయిన ఖర్చుపై తగిన వడ్డీ, పెట్టుబడిపై నూటికి 1 వంతు తరుగుదల, నిర్వాహణ ఖర్చులు గిట్టుబాటు అయ్యేటట్లుగా వుండాలి. ప్రారంభములో సేద్యపు నీటి ధర నిర్వహణ ఖర్చులు, పెట్టుబడిపై నూటకి 2½ వంతులు వడ్డీ వచ్చేటట్లుగా వుండాలి. నిర్వహణ ఖర్చులు య॥కి సాలుకు 10 రూపాయలుగా నిర్ణయించవచ్చును.

రాష్ట్రములోని జలాధారాలను రెండు తరగతుల క్రింద విభజించాలి. ఒక పంటకు గ్యారంటీగా నీటిని సప్లయిచేసే జలాధారాలు. అలా చేయని జలాధారాలు.

నాలుగు మాసాలు నీటి సప్లయి వుండే జలాధారాలను గ్యారంటీలేక నిశ్చిత జలాధారాలుగానూ, అంతకు తక్కువకాలం నీటి సప్లయిచేసే జలాధారాలను అనిశ్చిత జలాధారాలుగాను విభజించాలి. రాష్ట్రంలోని అన్ని జలాధారాలను స్థానిక విచారణ వున్న రికార్డులనుబట్టి ఈ రెండు రకాలుగా విభజించాలి.

నీటి తీరువా రేట్లు

నీటితీరువా రేటు. పంట స్వభావాన్నిబట్టి దానికి అవసరమైన నీటినిబట్టి నిర్ణయించబడాలి. దీనినిబట్టి చూచినప్పుడు వివిధ పంటలను 5 గ్రూపులుగా విభజించ వచ్చును.

1. రెండు సీజన్లలోనూ భూమిపై వుంటూ, నీరు ఎక్కువగా కావలసిన పంటలు. వీటిని భారమైన రెండుకార్ల పైర్లు, అంటారు.
2. తేలికయిన రెండు కార్ల పైర్లు, పై పంటల కన్న తక్కువ నీరు అవసరమైనటు వంటివి.
3. పల్లపు పంట.
4. అన్ని ఆరుదడి పంటలు.
5. పచ్చి ఎరువు పైర్లు, పశువుల మేత పైర్లు, వంట చెరకు పైర్లు.

పై 5 రకాల పంటలకు, ఈ నీరు అమలులో వున్న రకరకాల నీటి తీరువా, పల్లపు రేట్లస్థానే రాష్ట్రమంతటా గ్యారంటీ నీటి వసరుల క్రింది ఈ దిగువ రేట్లను విధించాలి.

1. భారమైన రెండుకార్ల పైరు	య॥కి రు.44
2. తేలికయిన రెండుకార్ల పైరు	,, ,, 30
3. పల్లపు పంట	,, ,, 22
4. ఆరుదడి పంటలు	,, ,, 15
5. వంట చెరకు, పశువులమేత, పచ్చిఆకు ఎరువుల పైర్లు	,, 10 ,,

అనిశ్చిత జలాధారాలకింద పంట ఏదైనప్పటికీ రాష్ట్రమంతాఒకేరేటు య॥కి 10/- విధించాలి,

అడ్సాలీ చెరుకుపంట భూముపై 3 సీజన్లు వుంటుంది కాబట్టి 44 రూపాయలు అందులో సగం–మొత్తం య॥కి రు. 66/లు రేటు వుండాలి.

పశువుల మేతగాని. పచ్చి ఆకు ఎరువులు గాని నీరు పెట్టుకోకుండా పైరును వేసిన సందర్భాలలో నీటితీరువావసూలుచేయరాదు

రెండవకారు పంటకు, మొదటి కారు పంటకు విధించిన రేటునే విధించాలి.

మూడవకారు పంటలు అదనంగా నీటి తీరువా విధించరాదు.

ధరలనుబట్టి 10 ఏళ్ళ కొకసారి మార్పు

పంటల ధరవల్ల తగ్గుదల లేక పెరుగుదలను బట్టి, సేద్యపుపంటల ఉత్పాదనను బట్టి, జలాధారాల నిర్మాణ, నిర్వహణ ఖర్చులనుబట్టి 10 సంవత్సరముల కొకపర్యాయం ఈ రేట్లను మార్పు చేస్తూ వుండాలి.

పల్లపు భూములపై మెట్ట శిస్తు

ఆయకట్టు రిజిష్టరులో పల్లపు భూములుగా నమోదయిన భూములపై మెట్ట శిస్తు నేరుగా విధించాలి. దానికి తగు నీటి తీరువా రేట్లు విధించాలి.

ఆంధ్రప్రాంతంలో పల్లపు శిస్తు విధించబడిన భూములకు, దగ్గరలో అదే తరగతి మెట్ట భూమికి విధించబడిన మెట్ట రేటు విధించాలి.

కడప కర్నూలు జిల్లాలలోని పల్లపు భూములకు తగిన మెట్ట శిస్తు రేట్లు కూడా రికార్డులలో నమోదయి వున్నాయి వాటిని మెట్ట శిస్తులుగా అయా పల్లపు భూములపై విధించవచ్చును.

సెటిల్‌మెంటు డైరెక్టరు సూచించిన విధంగా తెలంగాణా ప్రాంతములో ప్రస్తుతం అమలులోవున్న భూమి విలువునుబట్టి మెట్ట శిస్తును నిర్ణయించవచ్చును.

కుడి మరమ్మతులు

రైతులు సాంప్రదాయకంగా చేయవలసిన (కుడిమరమ్మతు) పంట కాల్వల మరమ్మతులు ఎక్కడా అమలుజరగడంలేదు. కమిటీ సూచించిన నీటితీరువా రేట్లు అమలులోకి వచ్చినతరువాత కుడి మరమ్మతులు రైతులు చేసుకునే పద్ధతిని రద్దుచేయాలి.

జలాధారాల నిర్వహణ

వివిధ జలాధారాల నిర్వహణ సక్రమంగా లేదు. వీటి నిర్వహణ వుండవలసిన ప్రమాణములో వుండటం లేదు. ఇందువల్ల రైతులు చాలా ఇబ్బందిపడుతున్నారు. ప్రభుత్వానికి ఆదాయం నష్టమవుతోంది. అందువల్ల వీటిని తగిన ప్రమాణములో వుంచుటకు అవసరమైన నిర్వహణ ఖర్చులను ప్రభుత్వం కేటాయించాలి.

రాష్ట్రములో జలాధారాల నిర్వహణ సరిలేక, అనేక జలాధారాలు చాల అసంతృప్తికర పరిస్థితులలో వున్నాయి రాష్ట్రములోని అన్ని జలాధారాల నిర్వహణ స్థితిపై సమగ్రమైన దర్యాప్తు జరిపి, వాటిని పూర్తిగా పునరుద్ధరించడానికి అవసరమైన నిధులను ప్రభుత్వం కేటాయించవలసివుంది.

వాస్తవంగా జలాధారాల నిర్వహణకు ఎంత మొత్తము అవసరమవుతుందో నిర్ణయించడానికిగాను కొన్ని నమూనా ప్రాజెక్టులు, చెరువులను ఎంపిక చేసి, వాటి నిర్వహణ, ఖర్చులను గురించి అధ్యయనం చేయాలి.

జలాధారాల సక్రమ నిర్వహణకుగాను యిచ్చే మొత్తాలను ఇప్పుడు ఎక్కువగా ఎస్టాబ్లిష్‌మెంటు (ఉద్యోగులు, అఫీసుల నిర్వహణ)పై ఎక్కువగా ఖర్చుపెట్టి తగిన మొత్తాలను పనులకు ఖర్చుచేయడంలేదు.

శ్రీ వై. వి. కృష్ణారావు,
యమ్. యల్. సి.
ప్రదేశ్ రైతుసంఘం అధ్యక్షులు.

అందువల్ల ఇకనుండి ఎస్టాబ్లిష్‌మెంటు ఖర్చులను, నిర్వహణ, బాగుచేత పనుల ఖర్చులను రెండుగా విభజించి, కేటాయింపులు వేరువేరుగా చేయాలి.

మురుగు కాల్వల నిర్వహణ, బాగుచేత పనులకు వేరుగా డబ్బునుమంజూరుచేయాలి.

విధిగా నీటితీరువా వసూలు

ప్రస్తుతం వున్న విధిగా నీటి తీరువా వసూలు చట్టాన్ని రద్దుచేసి, కొత్తగా తీసుకువచ్చే ఇర్రిగేషన్ చట్టములో ఒక క్లాజును పొందుపర్చాలి. ఆయకట్టు స్థిరీకరణ జరిగిన తరువాత సాగు చేసినా, చేయకపోయినా నీటి తీరువా విధిగా చెల్లించే లాగున రైతుపై కర్తవ్యాన్ని మోపాలి.

అభివృద్ధి పన్ను

ప్రస్తుతంవున్న అభివృద్ధిపన్ను చట్టాన్ని రద్దుచేయాలి. దీనిస్థానే అభివృద్ధి సర్‌ఛార్జీని నీటితీరువాకు తోడుగా వసూలు చేయాలి, ప్రాజెక్టు ఖర్చులో మూడింట ఒకవంతు సొమ్ము రాబట్టేవిధంగా సర్‌ఛార్జీని నిర్ణయించి దీనిని 20 సాలుసరి వాయిదాలపై వసూలు చేయాలి సేద్యానికి నీటి సప్లయి అయిన 6 వ సంవత్సరం నుండి ఈ లెవీని వసూలు చేయాలి.

ప్రారంభములో ఈ క్రింది రేట్ల ప్రకారం సర్‌ఛార్జీని వసూలు చేయవచ్చును.

1. రెండుపంటల భూములకు	య॥కిరూ.400
2. వరిపండే భూములు	య॥ కి రూ. 200
3. ఆరుదడి భూములు	య॥ కి రూ. 150
4. అనిశ్చిత జలాధారాల క్రిందవుండి నీటి గ్యారంటీ అయ్యేభూములకు	రు. 100

ఈ లెవీని అభివృద్ధి పన్నుచట్టంవర్తించే అన్ని ప్రాజెక్టులకు, ఇక ముందు నిర్మించబోయే ప్రాజెక్టులకు వర్తింప చేయాలి.

అక్రమ సాగులు

ఒకటవ తరగతి జలాధారాల క్రింది అక్రమ సాగులపై వాటి స్వభావం ఏమైనప్పటికీ కనీసం నాలుగు రెట్లు పెనాల్టీ విధించాలని ప్రభుత్వం చేసిన నిర్ణయంలో అక్రమ సాగు స్వభావంలోనున్న గుణత్వాల్నిబట్టికాక అక్రమ సాగుల మొత్తాన్ని మాత్రమే దృష్టిలోకి తీసుకొన్నట్లు అర్థమవుతోంది.

అధికారులు అక్రమ సాగులపై విధించే పెనాల్టీలకు సంబంధించి, వాటిని రద్దుచేయడానికి సంబంధించిన సూత్రాలు నీటివనరుల తరగతిపై ఆధారపడకుండా, అక్రమ సాగు స్వభావాన్ని బట్టి వుండాలి.

ఒకటవ తరగతి జలాధారాల క్రింద గాని, మిగతా జలాధారాల క్రిందగాని గండి సాగుల విషయంలో గరిష్టమైన పెనాల్టీని విధించాలి. ఇటువంటి సందర్భాలలో పెనాల్టీ విధించే అధికారిగాని, అప్పీలు అధికారిగాని, పెనాల్టీలను రద్దు చేయకుండా చూడాలి. వ్యవస్థకు దెబ్బతగిలని అక్రమ సాగుల విషయంలో మాత్రమే పెనాల్టీలు రద్దుకు అనుమతించాలి.

వ్యవసాయోత్పత్తుల విలువ పెరిగిన దృష్ట్యా పెనాల్టీ రేటు, ప్రస్తుత నీటి తీరువా రేటుకు రెట్టింపుగా వుండాలి. అక్రమ సాగుతో పండించిన పంటనంతా ప్రభుత్వం స్వాధీనం చేసుకునే విధంగా పెనాల్టీలు విధించాలి. అక్రమ సాగులతో పండించిన పంటను ప్రభుత్వం స్వాధీనం చేసుకోడానికి అవసరమైన అధికారం చేపట్టాలి.

అక్రమ సాగులను అరికట్టాలంటే, అట్టి సాగులను లాభదాయకం కాకుండా చేయాలి. ఆ విధంగా పెనాల్టీలను విధించాలి.

అక్రమసాగుల కనిపెట్టగానే పెనాల్టీలను వెంటనే విధించాలి. ఏ సందర్భంలోనూ పంటను కోతకుముందే వసూలుచేయాలి.

రాబడిపన్ను కేసులలో మాదిరిగానే రెవిన్యూ డివిజనల్ ఆఫీసరుకు అప్పీలు చేసుకొనేముందే పెనాల్టీని చెల్లించాలి.

అక్రమ సాగుల బెడద నివారించాలంటే ప్రభుత్వం, అప్పీలు అధికారి పెనాల్టీల విధింపులో జోక్యంచేసుకోరాదు. పెనాల్టీల విధింపు, వసూలు పద్ధతిని పూర్తిగా మార్చివేయాలి.

జమాబంది అధికారి ధృవీకరణకు లోబడి పి. డబ్ల్యు. డి. అధికారులకు పెనాల్టీలను విధించే అధికారం యివ్వాలి.

అక్రమ సాగుల బెడద ఎక్కువగా వున్న జలాధారాల క్రింద హర్యానా రాష్ట్రములో వలెనే విస్తారమైన, క్రమబద్ధమైన పోలీసు సంచార బృందాల నిఘాను ఏర్పాటు చేయాలి.

గండి సాగులను, అక్రమ సాగులను సమర్థవంతంగా అరికట్టడానికి గాను 1357 ఫసలీ తెలంగాణా ఇర్రిగేషన్ చట్టములోని క్లాజులను సక్రమంగా అమలు పర్చాలి ఈ చట్టములోని క్లాజులను ఆంధ్ర ప్రాంతానికి వర్తింప చేయాలి.

నేరస్తులు నిర్ధారించబడక పోయినా కలిగిన నష్టాలను రాబట్టడానికిగానుమైసూరు ఇర్రిగేషన్ చట్టములోని 63 క్లాజులాంటి దానిని ప్రభుత్వం తీసుకురాబోయే ఇర్రిగేషన్ చట్టములో పొందుపర్చాలి.

ఆయకట్టు స్థిరీకరణ

చిన్న నీటి వనరులక్రింద ఆయకట్టు స్థిరీకరణకు సంబంధించిన నిబంధనలను వెనువెంటనే ప్రకటించడం, ఆయకట్టును స్థిరీకరించడం జరగాలి.

మేజరు, మధ్యరకం ప్రాజెక్టులక్రింద ఆయకట్టు స్థిరీకరణ జాగ్రత్తగా చేయాలి. పంపక విధానాన్ని ఆయకట్టు భూములకు నీరు సక్రమంగా అందేటట్లు నిర్మించాలి. ఇంజనీరింగు లోపాలు సాధ్యమైనంత తక్కువగా వుండేటట్లు చూడాలి.

ఆయకట్టు స్థిరీకరణ చేయడంవల్ల రైతుకు నీటి సప్లయిని గురించి హామీ యివ్వడము మాత్రమే. అంతేగాని ఫలాని పైరుకు నీటి హామీ మాత్రము గాదు. ఆయకట్టు అభివృద్ధి అయినతరువాత అనుభవాన్ని పురస్కరించుకొని, స్థిరీకరణలో జరిగిన లోపాలను సవరిస్తూ పునఃస్థిరీకరణ చేయాలి.

అవసరమయినప్పుడు సేద్యపు నీటి విస్తీర్ణాన్ని మార్పుచేయాలి. నీటి సప్లయి పరిస్థితిని బట్టి పునఃస్థిరీకరణ చేయాలి. అవసరమయితే పంటల పధానాన్నిమార్చాలి. నీటి సప్లయికి హామీ వున్న ఏ భూమికయినా ముంపు, చవుడు మొదలగు నష్టాలు జరగకుండా, నీటి సప్లయిని ఆపివేసే అధికారం ప్రభుత్వం వుంచుకోవాలి. అటువంటి సందర్భాలలో నష్టపరిహారం యివ్వవచ్చును.

నీటి వినియోగాన్ని గురించి లోగడ వేసిన అంచనాలు తప్పి, ఆయకట్టు పూర్తిగా అభివృద్ధిచెందని ప్రాజెక్టుల క్రింద, ఆయకట్టు భూములకన్నింటికి నీటి సప్లయి జరిగేలాగా తిరిగి స్థిరీకరణ చేయాలి. పల్లపు పంట భూములను ఆరుదడి భూములుగా మార్చాలి.

ఏయే మధ్యరకం, మేజరు ప్రాజెక్టుల క్రింద పంటల విధానాన్ని తప్పుగా నిర్ణయించినందువల్ల ఆయకట్టు అభివృద్ధి కాకుండా ఎక్కువగా మిగిలిపోయిందో వాటి క్రింద పునఃస్థిరీకరణ చేయాలి.

కరువుప్రాంతాలలో ఇకముందు నిర్మించే ప్రాజెక్టుల క్రింద భూముల పరిస్థితిని బట్టి ఆరుదడి పంటలకు మాత్రమే ఆయకట్టును స్థిరీకరించాలి.

పంటకాల్వల నిర్మాణం

జలాధారం నిర్మాణంతోపాటు, దాని క్రింది పంట కాల్వల నిర్మాణాన్ని కూడ ప్రభుత్వమే చేపట్టాలి., పంటకాల్వల నిర్మాణాన్ని చాలా తొందరగా పూర్తిచేయాలి.

ఇర్రిగేషన్ సమితులు

రాష్ట్ర, జిల్లా, ప్రాజెక్టుల స్థాయి సేద్యపు సమితులను ఏర్పాటు చేయటం ఉచితంగా ఉంటుంది. ప్రాజెక్టులక్రింద సేద్యపు నిర్వహణను గురించి, ఆయకట్టు అభివృద్ధిని గురించి ... సౌకర్యాల అభివృద్ధిని గురించి ఈ సేద్యపు సమితులు ప్రభుత్వానికి సలహాలిస్తాయి.

ఆయకట్టుక్రింద బావులు త్రవ్వకం

ఆయకట్టు క్రింద స్వంతంగా బావులు త్రవ్వుకొని బహుళ పంటల విధానాన్ని అనుసరించడానికి, ఉత్పత్తి పెంచడానికిగాను ఉపరితల నీటిని, భూగర్భ జలాలను ఉపయోగించడానికి రైతుకు స్వేచ్ఛ వుండాలి.

తోడిపోత సేద్యం

తోడిపోత పథకాలక్రింద రాష్ట్రమంతటా ఒకేమాదిరి నీటితీరువా రేట్లు విధించే పద్ధతి ఇకముందు కూడ కొనసాగాలి. పంపింగ్ పథకాల క్రింద విధించే నీటి తీరువా రేట్లు, నిశ్చిత జలాధారాల క్రింద విధించబడే రేట్లకు తోడు య॥కి అయ్యే తోడిపోత ఖర్చులను కలపాలి. య॥కి అయ్యే తోడిపోత ఖర్చులను రాష్ట్రమంతటికీ లెక్కించి నిర్ణయించాలి.తోడిపోతకు యిచ్చే రిమిషన్ నూటికి 50 వంతులుగా వుండాలి

రిమిషన్ నిబంధనలు

సమగ్రమైన రిమిషన్ నిబంధనలను రూపొందించవలసిన అవసరం వుంది. ప్రస్తుతం అమలు జరపబడుతున్న రిమిషన్ నిబంధనలలో వివక్షత వున్నది. నీటితీరువా రేట్లను పెంచుతున్న దృష్ట్యా, రిమిషన్ నిబంధనలను కూడ క్రమబద్ధం చేయవలసి వుంటుంది.

సెస్సులు

రాష్ట్రములోని రెండు ప్రాంతాలలోను సెస్సులను ఒకేరకంగా విధించవలసిన అవసరం వుంది. ఆంధ్ర ప్రాంతములో అమలులోవున్న విద్యా సెస్సును తెలంగాణాకు వర్తింపజేసి రాష్ట్ర మంతటా విద్యా లోకల్ సెస్సులను కలిపి భూమిశిస్తు, నీటి తీరువాలలో రూపాయికి 37 పైసల వంతున వసూలు చేయాలి.

తోడిపోత పథకాల క్రింద నీటితీరువా రేట్ల పైననే ఈ సెస్సులను విధించాలి. పని ఖర్చులపై విధించరాదు.

సమగ్ర సేద్యపు చట్టం

సమగ్రమైన సేద్యపు చట్టాన్ని తీసుకురావాల్సిన అవసరం వుంది.

అనంతరామన్ కమిటీచేసిన ప్రతిపాదనలపై అసెంబ్లీలో చర్చజరగలేదు. నీటి తీరువా రేట్లు పెంచడానికి మాత్రం అప్పుడే చర్యలు తీసుకొన్నది.

1974 జూన్‌లో ప్రభుత్వ జలాధారాల క్రింద సాగవుతూ రివెన్యూ లెక్కలలో మెట్ట భూములుగా నమోదయిన వాటిపై, ఆంధ్ర, తెలంగాణా ప్రాంతాలలోని ఇర్రిగేషన్ సెస్సు ఆక్టుల ననుసరించి ఒక ఉత్తరువును జారీ చేసింది.

దీని ప్రకారం ఆంధ్రప్రాంతములో నీటి తీరువా రేట్లు ఈ క్రిందివిధంగా వుంటాయి:

1. (1) మెట్టగా నమోదయిన భూములలో మొదటి పల్లపు పంటకు య॥కి 22–50 రూపాయలు.

(11) మెట్టగా నమోదయిన భూములలో మొదటి ఆరుదడి పంటకు య॥కి 15–00 రూపాయలు,

(I I) మెట్ట భూములలో రెండవ లేక మూడవ ఆరుదడి పంటకు య॥ కి–11.25 రూపాయలు.

2. మెట్ట భూమిలో రెండవ లేకమూడవ పల్లపు పంట పండించిన ఎడల మొదటి పల్లపు పంటకు విధించిన నీటి తీరువా రేటే విధించబడును. అయితే అట్టి రేటు రు. 22–50 కి మించరాదు.

3. మెట్ట భూములలో దోఫసలీ పంటలు పండించినప్పుడు, ప్రస్తుతం దోఫసలీ పంటలకు విధించే నీటి తీరువాకు రెట్టింపు విధించాలి. అయితే అది య॥కి రు. 45–00 లకు మించరాదు.

4. ఒక కారు పల్లపు భూములుగా నమోదయిన భూములలో రెండవలేకమూడవ పల్లపు పంట పండించినచో, మొదటి కారు పల్లపు శిస్తుకు సమానంగా నీటి తీరువా విధించబడును. రెండవ కారు ఆరుదడి పంట పండించినచో, మెట్ట భూములలో రెండవ కారు ఆరుదడి పంటకు విధించిన నీటి తీరువా విధించబడును. ఈ విధంగా నీటి తీరువా య॥కి 22–50 రూపాయలకు మించరాదు.

5. ఒక కారు పల్లపుపంట భూములుగా నమోదయిన భూములలో దోఫసలీ పంట పండించిన ఎడల, పల్లపు శిస్తుకు రెండు రెట్లు నీటి తీరువా వసూలు చేయబడును. అయితే యీ మొత్తము య॥కి 45–00 రూపాయలకు మించరాదు.

6. ఈ పై పెంపుదల, బావుల క్రింద, వూట కాల్వల క్రింద సేద్యాలకు వర్తించదు.

తెలంగాణా ప్రాంతములోని నీటి తీరువా రేట్లుకూడా పైన ఉదహరించిన రీతిగావిధించబడును. పైన ఉదహరించిన మినహాయింపు తెలంగాణా ప్రాంతానికి కూడా వర్తిస్తుంది.

రివెన్యూ లెక్కలలో పల్లపు భూములుగా నమోదయిన వాటిపై అదనపు శిస్తు విధించడానికి ఒక బిల్లును అసెంబ్లీలో ప్రవేశపెట్టింది. ప్రస్తుతం ఈ బిల్లు సెలక్టు కమిటీ ముందున్నది.

తాళ్ళూరు సమితి బి.డి.వో అక్రమాలు

జిల్లా కలెక్టరుకు రైతుసంఘం ఫిర్యాదు

గుంటూరు, సెప్టెంబరు 24

గుంటూరు జిల్లా తాళ్ళూరు సమితి బి. డి. వో. పాకాలపాడు, వణిదెం, ముసాపురం, లింగంగుంట్ల గ్రామాల రైతులను 20 వ తేదీ తాళ్ళూరువచ్చి ఎరువులు తీసుకెళ్ళవలసినదిగా ప్రకటించారు.

ఆ ప్రకారం రైతులునాల్గుగ్రామాలనుండి 200 మందికిపైగా 20 వ తేదీన తాళ్లూరు వచ్చారు

కాని బి.డి.వో. ఆరోజు ఆయన ప్రత్తి చేలకు మందులు కొట్టించుకోవడానికి వెళ్ళాడని తెలిసింది. ఈ బి డి.వో.50 ఎకరాలకు కౌలుకు తీసుకొని ప్రత్తివేశాడు.

రైతులను వారాలతరబడి త్రిప్పుకోవటం బస్తాకు రు.10 ఇచ్చినవారికేపర్మిట్లుఇవ్వటం పాయికారు గ్రామాల రైతులకు యివ్వకనే ఎరువులు యిచ్చినట్లుగా దొంగలెక్కలు వ్రాయటం జరుగుతూంది.

ఎవ్వరోతప్ప, బి.డి.వోలు, వి.జి. వోలు డిమాన్‌స్ట్రేటర్లు కౌలు యితరుల పేరున వ్రాయించిప్రత్తిపైరులువెయ్యనివారులేరు. వీరిపాలాలకుమాత్రంఎరువులకుయిబ్బందిలేదు యీపరిస్థితులను ఎదుర్కొంటున్న రైతాంగము నాలుగు గ్రామాలవారు సంతకాలు చేసిన మహజరుతో 21 వ తేదీన గుంటూరుజిల్లా రైతుసంఘ కార్యదర్శి శ్రీ వాశిరెడ్డి మల్లికార్జునరావు, సత్తెనపల్లి తాలూకా రైతుసంఘ కార్యదర్శి శ్రీ శాఖమూరివెంకటరావులు జిల్లాకలెక్టరును కలుసుకొని వాస్తవాలు వివరించగా విచారిస్తామని జిల్లా కలెక్టరు తెలిపారు.

తహసీల్దారుకు మెమోరాండం

సత్తెనపల్లి, సెప్టెంబరు 24

సత్తెనపల్లి తాలూకా తహశీల్దారుకు ఈ నెల 23 న సత్తెనపల్లి తాలూకా కమ్యూనిస్టుసమితి కార్యదర్శి శ్రీ యస్. గురవయ్య తాలూకా రైతుసంఘ కార్యదర్శి శ్రీ శాఖమూరి వెంకట్రావుల నాయకత్వాన వివిధ గ్రామములనుండివచ్చిన 200మందిరైతులు, కూలీలు, అర్జీలు దాఖలు చేశారు.

గ్రామాలలో చౌకడిపోల ద్వారా బియ్యం అమ్మించాలని, ఎరువుల పంపిణీ సక్రమంగా జరిపి, అర్హత గల కౌలుదారులకు ఎరువులివ్వాలనీ చిరకాలంగా బంజర్లు సాగుచేస్తున్నవారికి పట్టాలివ్వాలనే డిమాండు చేశారు ప్రతినిధివర్గానికి తహశీల్దారు సమాధానమిస్తూ సత్వరమే తన పరిమితులలో చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు.

గురజాడ స్మారకార్థం మ్యూజియం ఏర్పాటు

హైదరాబాద్ వర్ధంతిసభలో శ్రీ మండలి కృష్ణారావుహామీ

హైదరాబాదు, సెప్టెంబరు 24

మహాకవి గురజాడ స్మృతిచిహ్నంగా రాష్ట్రంలో మ్యూజియం ఏర్పాటుచేసే విషయం ప్రభుత్వం పరిశీలిస్తోందని విద్యామంత్రి శ్రీ మండలి వెంకట కృష్ణారావుహామీ యిచ్చారు.

శనివారంనాడు హైదరాబాదు పాతనగర రచయితల సంఘం, గుణవర్ధక సంస్థవారు సంయుక్తంగా నిర్వహించిన గురజాడ వర్ధంతి సభకు అధ్యక్షత వహిస్తూ శ్రీ కృష్ణారావు పై విధంగా చెప్పారు

అంతకుముందు సభలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఆంధ్రప్రదేశ్ అభ్యుదయ రచయితల సంఘ ప్రధాన కార్యదర్శి శ్రీ రాంభట్ల కృష్ణమూర్తి ప్రసంగిస్తూ గురజాడ సమకాలంలో అనేక భాషల్లో మహాకవులు గొప్ప రచయితలు వున్నప్పటికీ హాస్యాన్ని పదునైన ఆయుధంగా సవిమర్శకసాహిత్యాన్ని సృష్టించి సమాజంలో కుళ్ళును బహిర్గతం చేసే ఉద్యమానికి గురజాడ తెలుగులో ఆద్యుడని ఆయన ప్రత్యేకతలు అనేకం వున్నాయని తెలిపారు.

స్వాతంత్ర్యం, అంతర్జాతీయత ఆయన సాహిత్యసృష్టికి ప్రాతిపదికలన్నారు. నాగావళి వంశధార నదులవద్దున కుగ్రామాలలోని పరమ ఛాందస బ్రాహ్మణ కుటుంబాలలోని బాల్యవివాహాల దురాచారాన్ని రూపుమాపేందుకుగాను గురజాడ కన్యాశుల్కం వ్రాసి 80 సంవత్సరాలయినా అది నవనవోన్మేషంగా వుందని ఉద్ఘాటించారు.

అయితే గురజాడ సమకాలంలోనే సోవియట్‌లోని ఆర్మీనియా భాషలో మహారచనలు చేసిన 'తొమాన్యాన్' మహాకవికి ఆ సోషలిస్టు దేశంలో ఆయన స్మృతులన్నీ సేకరించి అద్భుతమైన మ్యూజియం ఏర్పాటు చేశారని,అయితే మన గురజాడను గౌరవించుకునే భాగ్యం మనకు లేకపోయిందని విమర్శించారు.

దానిపై అధ్యక్షతవహించిన విద్యామంత్రి శ్రీ మండలి మాట్లాడుతూ ప్రపంచ తెలుగు రచయితల మహాసభ సందర్భంగా శాశ్వత మ్యూజియం ఏర్పాటు చేయాలని భావిస్తున్నామని గురజాడ స్మారక మ్యూజియం ఏర్పాటు చేసే విషయం పరిశీలిస్తామని అన్నారు. దక్షిణ భారత హిందీ ప్రచారసభ కార్యదర్శి శ్రీ వేమూరి రాధా కృష్ణమూర్తి కూడా ప్రసంగించారు.

అంతకుముందు భారత గుణవర్ధక సంస్థ తరఫున శ్రీ మహబూబ్, నారాయణ్‌గౌడ్ మంత్రికి స్వాగతం చెప్పారు. హైదరాబాదు పాతనగర రచయితల సంఘ కార్యదర్శి, హైదరాబాదు అరసం కార్యవర్గ సభ్యులు శ్రీ ఆర్. వి. రామారావు వందన సమర్పణ చేశారు.

వేతనాలు రాక ఎన్. ఎఫ్. సి. పి. సిబ్బంది ఇబ్బందులు

విజయనగరం, సెప్టెంబరు 22

విశాఖ జిల్లాలోని నేషనల్ ఫైలేరియా కంట్రోల్ ప్రోగ్రాం (ఎన్. ఎఫ్. సి. పి.) సిబ్బంది గత మూడు మాసాల నుంచి వేతనాలు అందకపోవడంవల్ల నానా అవస్థలకు గురవుతున్నారు.

ప్రతిపట్టణంలోని ఎన్. ఎఫ్. సి. పి. సిబ్బంది ఇదే దురవస్థకు గురవుతున్నారు. ఈ విషయమై డి. ఎం. ఓ. ఇటీవల హైదరాబాద్‌లోని ఉన్నతాధికారులకు టెలిగ్రాం ఇచ్చినా ఫలితం శూన్యం

ఆ సిబ్బందికి వెంటనే వేతనాలు చెల్లించవలసిందిగా విజయనగరం తాలూకా కమ్యూనిస్టు సమితి కార్యదర్శి శ్రీ డి. వి. సత్యనారాయణ ఇటీవల ఒక ప్రకటనలో కోరారు. (వి. వి.)

తుమ్మపూడిలో ప్రజా నాట్యమండలి శాఖ

తుమ్మపూడి, సెప్టెంబరు 18

తెనాలి తాలూకా తుమ్మపూడి గ్రామ యువజన సంఘం కార్యకర్తలు గ్రామంలో ప్రజానాట్యమండలిని ఏర్పాటు చేశారు.

ఈ నెల 14వ తేదీన ప్రజానాట్యమండలి శాఖ కార్యాలయాన్ని ఇస్కస్ నాయకులు శ్రీ సూర్యదేవర వాసుదేవ్ ప్రారంభించారు.

నూతన కార్యాలయంలో జరిగిన సమావేశానికి గ్రామప్రజానాట్యమండలి అధ్యక్షులు శ్రీ రామశేషయ్య అధ్యక్షత వహించారు. కార్యదర్శి శ్రీ యస్. నాగేశ్వరరావు తాము తీసుకున్న కార్యక్రమాన్ని వివరించారు.

తాలూకా కమ్యూనిస్టు సమితి సహాయ కార్యదర్శి శ్రీ ఖాసింఖాన్ ప్రసంగిస్తూ ప్రజల దైనందిన సమస్యలను తీసుకుని నాటికలు, నాటకాలు ప్రదర్శించాలని కోరారు.

సభలో ప్రజానాట్యమండలి నిర్మాణనిధికి విజ్ఞప్తి చేయగా రు. 80 లు వసూలయ్యాయి.

టెండరు నోటీసు

మునిసిపల్ ఆఫీసు, మంగళగిరి

Roc. No. 1946/74 B1 Date 21-9-74

ఈ క్రింద వివరించిన పనులకు సీలువేసిన టెండర్లు నిర్ణీత ఫారములలో కమీషనరుగారికి ది 11–10–74 సాయంత్రము 4.00 గంటలలోపు అందునట్లు కోరబడుచున్నవి. వచ్చిన టెండర్లు కమీషనరుగారిచే మునిసిపల్ ఆఫీసునందు అదేరోజు సాయంత్రము 4.30 గంటలకు తెరువబడును. ఏ కారణము చెప్పకుండా ఏ టెండరునైనను లేక అన్ని టెండర్లు అంగీకరించుటకు లేక నిరాకరించుటకు కౌన్సిలు/కాంట్రాక్టు కమిటీకి అధికారం వున్నది. టెండరు ఫారములు ది 10–10–74 సాయంత్రము 4.00 గంటలలోగా మునిసిపల్ ట్రెజరీలో ఖరీదు చెల్లించి పొందవచ్చును. కాంట్రాక్టు డాక్యుమెంట్లు అన్ని పనిరోజులలో ఆఫీసు పనిచేయువేళలలో తెలుసుకొనవచ్చును.

క్ర. నెం.	పని వివరము	అంచనా విలువ	టెండరు డిపాజిట్టు	ఫారము ఖరీదు
		రు.	రు.	రు.
1)	రథశాల రోడ్డునుండి ఎలక్ట్రిసిటీ సెక్షను ఆఫీసువరకు తారురోడ్డు వేయుట	8000/–	400/–	8/–
2)	ఎడిసోయిన పశువులపడిశాల కాంపౌండు గోడను తిరిగి కట్టుట.	2900/–	145/–	3/–
3)	పాత మంగళగిరి 17 వ వార్డులో నున్న డ్రయినుకు అత్యవసర రిపేర్లు చేయుట	3800/–	[illegible]	4/–
4)	ఎస్. ఎస్. కె. ప్రసాదు యింటినుండి జి. ఎన్. టి. రోడ్డువరకు రబ్బీష్ రోడ్డు వేయుట.	1400/–	70/–	2/–
5)	భావనారుషి మండపం వద్దనుండి తెనాలి రోడ్డువరకు డ్రయిను కట్టుట.	8000/–	400/–	8/–
6)	13 వ వార్డులోనున్న రేడింగురూము అభివృద్ధి చేయుట.	2500/–	125/–	3/–
7)	చింతక్రింది శీతారామయ్య యింటినుండి దిగుడుబావి దగ్గరవున్న డ్రయిను వరకు డ్రయిను కట్టుట	4200/–	210/–	5/–
8)	జొన్నాదుల గోపాలరావు యింటినుండి ట్రంకురోడ్డు వరకు డ్రయిను కట్టుట.	3000/–	150/–	3/–
9)	తిరువీధుల అంజయ్య యింటివద్దనుండి కొండూరు దొంకవరకు పక్కా డ్రయిను కట్టుట.	5200/–	260/–	6/–
10)	16 వ వార్డులో కండిపూడి నరసింహం యింటినుండి జి. ఎన్. టి. రోడ్డువరకు పక్కా డ్రయిను కట్టుట.	1700/–	185/–	2/–
11)	2 వ వార్డులో పక్కా డ్రయినులు తిరువీధుల శ్రీమన్నారాయణ యింటివద్దనుండి మొదలగునవి కట్టుట.	2400/–	120/–	3/–
12)	12 వ వార్డులో బూసిపాటి వీరేశలింగం యింటివద్దనుండి హుస్సేన్ కట్టతో కలుపుతూ పక్కా డ్రయిను కట్టుట.	1800/–	90/–	2/–
13)	ఆంజనేయస్వామిగుడివద్దనుండి కమతం హనుమంతరావు యింటివరకు సోలింగు రోడ్డువేయుట.	2500/–	125/–	3/–
14)	కాడిబోయిన నాగభూషణం గొడ్లచావిడి నుండి ఆత్మకూరు రోడ్డువరకు సోలింగు రోడ్డు వేయుట.	3800/–	190/–	4/–
15)	1 వ వార్డులో చిన్నకోట శ్రీరాములుగారి యింటినుండి నాదాల బుగ్గి యింటి వరకు మెటల్‌రోడ్డు వేయుట.	3100/–	155/–	4/–
16)	వంకాయల పురుషోత్తంగారి యింటి నుండి మస్తాన్ యింటిమీదుగా జి. ఎన్. టి. రోడ్డు వరకు డ్రయిను కట్టుట.	7200/–	360/–	8/–
17)	దాసరబోయిన ఏసోబు యింటి వద్దనుండి గాలిసాహెబ్ యింటివరకు మెటల్‌రోడ్డు వేయుట.	2800/–	140/–	3/–
18)	తుమ్మా వీరయ్యగారి యింటి వద్దనుండి వి. వెంకటసుబ్బయ్యగారి యింటిమీదుగా మెయిన్ డ్రయిను కలుపుతూ పక్కా డ్రయిను కట్టుట.	3000/–	150/–	3/–
19)	ప్రగడ లక్ష్మీనారాయణ యింటివద్దనుండి మునగాల వెంకటేశ్వర్లు యింటిమీదుగా మెయిన్ డ్రయిను కలుపుతూ పక్కా డ్రయిను కట్టుట	3900/–	195/–	4/–
20)	17 వ వార్డులో జల్లి మాదర్ల యింటివద్దనుండి ఉప్పర్ల బజారువరకు మెటల్ రోడ్డు వేయుట.	2600/–	130/–	3/–
21)	17 వ వార్డులో యిర్ల గురవయ్య యింటి వద్దనుండి ఉత్తరదిశగా ఉప్పర్ల బజారు వరకు రబ్బీష్‌వేయుట.	1900/–	145/–	2/–
22)	రజకుల వీధిలోవున్న పబ్లిక్ బావికి అర్జంటు రిపేర్లు చేయుట.	570/–	30/–	1/–
23)	కె. హనుమంతరావు యింటివద్దనుండి రామమందిరం వరకు డ్రయిను కట్టుట.	4400/–	220/–	5/–
24)	హనుమంతుని బుద్ధనుండి మార్కెటు షాపులవరకు డ్రయిను కట్టుట	2600/–	130/–	3/–
25)	7 వ వార్డులోని కాలనీకి అప్రోచ్ రోడ్డు వేయుట.	3000/–	150/–	3/–
26)	S. No 226 లో వున్న శ్మశానమునకు ప్రహరీగోడ కట్టుట.	7400/–	370/–	8/–
27)	16 వ వార్డులో రజకుల వీధికి రబ్బీష్ రోడ్డు వేయుట.	1350/–	70/–	2/–
28)	ట్రంకురోడ్డునుండి రైల్వేస్టేషను రోడ్డు వరకు మెటల్‌రోడ్డు వేయుట.	4400/–	220/–	5/–
29)	10 వ వార్డులో గోలి వెంకయ్య యింటి వద్దనుండి పెరదపు నాంచారావు యింటి వరకు పక్కా డ్రయిను కట్టుట.	3700/–	185/–	4/–
30)	గోలి వెంకయ్య యింటివద్దనుండి మీనుగుల బావి వెంటవరకు మెటల్‌రోడ్డువేయుట.	2200/–	110/–	3/–
31)	బీరా వసుమర్తి ఖర్జునరావు యింటివద్ద నుండి రావూరి బుచ్చయ్య యింటివరకు పక్కా డ్రయిను కట్టుట,	1000/–	50/–	1/–
32)	దామర్ల చిట్టెయ్య యింటివద్దనుండి జి. [illegible] యింటివరకు పక్కాడ్రయిను కట్టుట	3800/–	190/–	4/–
33)	శిరందాసు ప్రసాదరావు యింటివద్దనుండి కొనవాడి వీరమ్మ యింటివరకుడ్రయిను కట్టుట.	4900/–	245/–	5/–
34)	జి. లింగయ్య యింటివద్దనుండి సైదయ్య యింటివరకు రబ్బీష్‌రోడ్డు వేయుట.	825/–	45/–	1/–
35)	ఎస్. నాగరత్నం యింటివద్దనుండి వనం సత్యం యింటివరకు రబ్బీష్‌రోడ్డువేయుట.	780/–	40/–	1/–
36)	కొండయ్య మున్నపుకట్టి వద్దనుండి బత్తిని కోటయ్య యింటివరకు రబ్బీష్ రోడ్డు వేయుట.	680/–	35/–	1/–
37)	రైల్వేగేటుకు రెండువైపుల ట్రంకురోడ్డు మధ్యన అడ్డగోడ కట్టుట.	2000/–	100/–	2/–

(సం.) జె. పద్మనాభరావు,
కమీషనరు.

వరికోతల కూలిరేట్ల హెచ్చింపుకై ఆందోళన

తూర్పుగోదావరిజిల్లా వ్యవసాయ కార్మికసంఘం నిర్ణయం

అంతర్వేదిపాలెం, సెప్టెంబరు 24

రానున్న వరికోతల తరుణంలో హెచ్చు వేతనాలకై ఆందోళన సాగించాలని తూర్పు గోదావరిజిల్లా వ్యవసాయ కార్మికసంఘ కార్యవర్గం ఈనెల 15 న యిక్కడ సమావేశమై తీర్మానించింది.

తొలుత సమావేశం ముద్దుకూరి చంద్రశేఖరరావు మృతిపట్ల సంతాపం ప్రకటించింది.

హెచ్చు కూలి సాధనకై రాజోలు, అమలాపురం, ముమ్మిడివరం, కొత్తపేట, అలమూరు తాలూకాల్లో ముమ్మరంగా ప్రచారం సాగించాలని తీర్మానించింది.

వరికోతలద్వారా జిల్లా వ్యవసాయ కార్మికసంఘానికి రు. 1500 సేకరించాలని తీర్మానించింది.

యింకా చౌకడిపోలకు బియ్యం సప్లయి సరిగా లేదనీ, పంటలు సమీపిస్తున్నందున డిపోలను ఎత్తివేయాలనే ఆలోచన సరికాదని సమావేశం విమర్శించింది.

హరిజనులు, వెనుకబడిన వర్గాలపై ప్రతినిత్యమూ జరుగుతున్న దాడులను ఖండిస్తూ మలికాపురం, అలమూరు, ఏనుగుపల్లి, ముమ్మిడివరం మొదలగు కేంద్రాలలో సదస్సులు జరపాలని సమావేశం నిర్ణయించింది.

గుంటూరుజిల్లా విస్తృత సమావేశం

గుంటూరు, సెప్టెంబరు 22

ఈ నెల 15 న మల్లయలింగం భవనంలో గుంటూరుజిల్లా వ్యవసాయ కార్మిక సంఘ కార్యకర్తల విస్తృత సమావేశం జరిగింది.

శ్రీ బి. కృపానందం అధ్యక్షత వహించిన ఈ సమావేశంలో జిల్లా వ్యవసాయ కార్మిక సంఘ కార్యదర్శి శ్రీ లోకం వెంకటేశ్వర్లు ప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘ ప్రధాన కార్యదర్శి శ్రీ కొండ్రు సుబ్బారావు (ఎం. ఎల్. సి.) ప్రసంగించారు.

అఖిలభారత వ్యవసాయ కార్మిక సంఘం పిలుపు మేరకు అక్టోబరు 1న ప్రతి తాలూకాలోను పెద్ద ఎత్తున ప్రదర్శనలు, సభలు సమావేశాలు జరపాలని శ్రీ కొండ్రు సుబ్బారావు కోరారు.

వ్యవసాయ కార్మికులపైనా ముఖ్యంగా హరిజనులపైనా జరుగుతున్న సాంఘిక బహిష్కరణలను ఎక్కడికక్కడ ప్రతిఘటించాలన్నారు.

శ్రీ బి. కృపానందం మాట్లాడుతూ వ్యవసాయ కార్మికసంఘ నిర్మాణ సమస్యలను వివరించారు. జిల్లా, తాలూకా సంఘాలమధ్య సమన్వయం వుండవలసినఅవసరాన్ని, దానిని సాధించవలసిన పద్ధతిని గురించి తెలిపారు.

శ్రీ కొండ్రుకు సన్మానం

ఈ నెల 15న మల్లయ్యలింగం భవన్‌లో శ్రీ వి. గంగాధరరావు అధ్యక్షతన ప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘ ప్రధాన కార్యదర్శి శ్రీకొండ్రు సుబ్బారావు(ఎం.ఎల్.సి.)కు సన్మానం జరిగింది.

జిల్లా కమ్యూనిస్టు సమితి కార్యదర్శి శ్రీ మంచపాటి నాగిరెడ్డి, జిల్లా వ్యవసాయ కార్మిక సంఘ అధ్యక్షులు శ్రీ బి. కృపానందం, కార్యదర్శి శ్రీ లోకం వెంకటేశ్వర్లు సన్మాన సభలో ప్రసంగిస్తూ శ్రీ కొండ్రు సుబ్బారావు ప్రజాసేవా నిరతిని గురించి వివరించారు.

అనంతరం శ్రీ కొండ్రు సుబ్బారావు తనకు జరిగిన సన్మానానికి ఉచిత రీతిని సమాధానమిచ్చారు.

పేర్నమిట్టలో ఐక్య కృషికై నిర్ణయం

పేర్నమిట్ట, సెప్టెంబరు 24

ప్రకాశంజిల్లా ఒంగోలు తాలూకా పేర్నమిట్ట గ్రామంలో కమ్యూనిస్టు పార్టీ, మార్క్సిస్టుపార్టీ, కాంగ్రెసుపార్టీలకు సంబంధించిన వ్యవసాయ కార్మికులు 100 మంది ఈ నెల 22 న సమావేశమై కూలిరేట్ల పెంపుదలకై కృషి చేయాలని తీర్మానించుకున్నారు.

ఈ కార్యక్రమాన్ని జయప్రదంగా నిర్వహించటానికి ఒక కమిటీని ఎన్నుకున్నారు. సమావేశంలో స్త్రీలంతా పాల్గొనటం విశేషం.

వ్యవసాయ కార్మిక సమస్యలపై జిల్లా వ్యవసాయ కార్మిక సంఘ కార్యదర్శి శ్రీ మిడసల వెంకటసుబ్బయ్య, శ్రీ పావని వెంకటసుబ్బయ్య (మార్క్సిస్టు) శ్రీ దార చెన్నయ్య (కాంగ్రెస్) శ్రీ బేషయ్య, శ్రీ పేర్నమిట్ట సుబ్బారెడ్డి, శ్రీ ఎం. సుబ్బారావు శ్రీ నూకతోటి రంగయ్య, శ్రీయన్. కోటయ్య ప్రభృతులు ప్రసంగించారు.

స్త్రీ పురుషులకు యిద్దరికి రోజుకు రు. 8 కూలి ఉండాలనీ, ఈ విషయాన్ని రైతాంగం సానుభూతితో పరిశీలించాలనీ సమావేశం తీర్మానించింది.

సభలు-సమావేశాలు

నర్సాపురం తాలూకా కమ్యూనిస్టు సమితి మహాసభ ఈనెల 28, 29 తేదీలలో కొమ్ముచిక్కాలలో జరుగుతుంది. ప్రతినిధులు 28 వ తేదీ 12 గంటలకు చేరుకోవాలి.

కాలేజి అడ్మిషన్ తప్పిపోయిందా ?

ఆంధ్రా యూనివర్శిటీ
స్కూల్ ఆఫ్ కరస్పాండెన్స్ కోర్సెస్
వాల్తేరు (ఆం. ప్ర)

1974-75 విద్యా సంవత్సరానికి ఈక్రింది కరస్పాండెన్స్ కోర్సులలో చేరుటకు భారతదేశంలోని అర్హతగల్గిన అభ్యర్థులనుండి దరఖాస్తులు కోరబడుచున్నవి. దరఖాస్తులు స్వీకరించుటకు ఆఖరు తేదీ 21-10-1974

కోర్సు	బోధనా భాష
1. 2 సంవత్సరాల ప్రీ యూనివర్శిటీ కోర్సు	ఇంగ్లీషు లేక తెలుగు
2. 3 సంవత్సరాల బి. ఎ. డిగ్రీ	ఇంగ్లీషుమాత్రం
3. 3 సంవత్సరాల బి. కాం. డిగ్రీ	ఇంగ్లీషుమాత్రం

యూనివర్శిటీలో ఇతర స్టూడెంట్స్‌వలెనే యీ స్కూలు పాఠ్య ప్రణాళిక విషయాంశాలలోనే పరీక్షలు నిర్వహించి డిగ్రీ ప్రదానం చేయబడుతుంది.

అభిలాషగల అభ్యర్థులు ప్రాస్పెక్టస్, సిలబస్, పరీక్షకు మరియు అడ్మిషన్ కొరకు దరఖాస్తుఫారం కొరకు రు. 5 (ఐదు రూపాయలుమాత్రం) మనియార్డరు ద్వారా చెల్లించి యీ క్రింది సంతకందారునుండి పొందవచ్చును.

డబ్బు చెల్లించిన అవసరము. మనియార్డరు కూపనుమీద స్పష్టంగావ్రాయాలి.

ప్రొఫెసర్ కె. వి. శివయ్య,
డైరెక్టర్.

ఆంధ్రప్రదేశ్ స్టేట్ రోడ్ ట్రాన్స్‌పోర్టు కార్పొరేషన్

ముషీరాబాద్ - హైదరాబాదు

టెండరు నోటీసు

ఆంధ్రప్రదేశ్ స్టేట్ రోడ్ ట్రాన్స్‌పోర్టు కార్పొరేషన్ యొక్క ఈ క్రింది స్థలములలో బుక్‌స్టాల్ మరియు క్యాంటీన్ ఈ క్రింద తెలియజేయబడిన విధంగా వెంటనే ప్రారంభించి 31-3-1976 వరకు నిర్వహించుటకు నిర్ణీత ఫారములో సీలువేసిన టెండర్లు ప్రసిద్ధి చెందిన కాంట్రాక్టర్ల నుండి కోరబడుచున్నవి.

డివిజన్ పేరు	స్టాలు టైపు	స్థలము	ఎర్నెస్టుమనీ డిపాజిట్
సిటీ డివిజన్	బుక్‌స్టాల్	రెసిడెన్సీ పెర్మనస్	రు. 100/-
	క్యాంటీన్	భరకత్‌పుర డిపో	రు. 100/-

టెండరు ఫారముల కొరకు ఒక్కొక్క దానికి రు. 5 లు చెల్లించి డివిజనల్ మేనేజరు, సిటీ డివిజన్, హైదర్‌గుడ, హైదరాబాద్ వారి నుండి పొందవచ్చును. పూర్తి చేసిన టెండర్లు డివిజనల్ మేనేజర్, సిటీ డివిజన్, హైదర్‌గుడ, హైదరాబాద్ వారికి 10-10-1974 మధ్యాహ్నం 12-00 లోపల చేరునట్లు పంపాలి. అవి అదే రోజు 14-00 గంటలకు అప్పటికి హాజరైన టెండరుదార్లు లేక వారి ఏజెంట్ల సమక్షంలో తెరువబడును.

డిప్యూటీ జనరల్ మేనేజరు

3 వేల లీటర్ల కిరోసిన్ అమ్మకం

పెనుగొండ, సెప్టెంబరు 26

పశ్చిమగోదావరిజిల్లా పెనుగొండలో వర్తకులు కిరోసిన్ లీటరు రెండురూపాయలు చొప్పున అమ్ముచుండగా కమ్యూనిస్టుపార్టీ యువజన సమాఖ్య కార్యకర్తలు జోక్యంచేసుకొని కిరోసిన్‌డీలర్లు శ్రీకోట్లవెంకట్రామయ్య, శ్రీ పి. రామన్నలతో సంప్రతించి లీటరు రు 1-10 చొప్పున సుమారు మూడువేల లీటర్ల కిరోసిన్ అమ్మించారు.

వర్తకసంఘంవారు నిర్వహించిన సబ్బు అమ్మకంలో కూడా యువజన సమాఖ్య కార్యకర్తలు చొరవ తీసుకున్నారు.

మహిళలచే అధికారుల ఘెరావ్

అంబాజీపేట, సెప్టెంబరు 26

తూర్పుగోదావరిజిల్లా కొత్తపేట తాలూకా పాతగన్నవరం గ్రామంలో ఈనెల 20 వ తేదీన సుమారు 60 మంది పేద మహిళలు అధికారుల జీపును ఘెరావ్ చేశారు.

ఈ అధికారులు బయలుదేరారనే వార్త ఫోన్లద్వారా అందగానే యిక్కడి వ్యాపారస్తులు షాపులను కట్టివేశారు! దీనితో ధరలు పెరిగాయని తెలుసుకున్న మహిళలు చెక్‌పోస్టువద్ద గుమిగూడి అధికారుల జీపును ఘెరావ్‌చేసిషాపులు తెరిపించాలని డిమాండ్ చేశారు.

కోనసీమలో కిరోసిన్ కొరత

తూర్పుగోదావరిజిల్లా కోనసీమ నాలుగు తాలూకాల్లో కిరోసిన్ కొరత ఏర్పడింది. లీటరు రెండురూపాయల చొప్పున అది కూడా ఎర్ర కిరోసిన్‌ను వ్యాపారులు అమ్ముతున్నారు.

డీసిల్ ఇంజన్ల పట్టివేత

కాన్పూర్, సెప్టెంబరు 25

ఇక్కడి ఒక సంస్థనుండి ఆదాయపు పన్ను శాఖ అధికారులు లక్షా 10 వేల రూపాయల విలువగల డీసిల్ ఇంజన్లు పట్టివేశారు.

గుప్త ఆదాయాన్ని తెలిపే కొన్ని డాక్యుమెంట్లను కూడా స్వాధీన పరచుకున్నట్లు అధికార ప్రతినిధి ఒకరు చెప్పారు.

ఈ సంస్థ యజమాని భాగస్వామిగా గల మరో సంస్థ నుంచి నిన్న రు. 5 లక్షల విలువగల డీసిల్ ఇంజన్లను, పంపుసెట్లను అధికారులు స్వాధీనం చేసుకున్నారు.

చోళయిల్ ఫార్మస్యూటికల్స్ బహుమతి ప్రదానం

విజయవాడ, సెప్టెంబర్ 26

చోళయిల్ ఫార్మస్యూటికల్స్ బహుమతి ఫిలిప్స్ ట్రాన్సిస్టర్‌ను గెలుచుకున్నవారికి ఈనెల 29 న విజయవాడ నటరాజ హోటల్‌లో బహుమతి ప్రదానం చేయబడుతుంది

ఈ బహుమతి ఉత్సవానికి ప్రధాన అతిథులుగా సినీనటులు కుమారి ఉదయచంద్రిక, కుమారి విజయలక్ష్మి హాజరై బహుమతి ప్రధానంచేస్తారు.

గమనిక

ఈనెల మూడవతేదీ 'విశాలాంధ్ర' లో "పొన్నమంద హరిజనులపై భూస్వాముల అత్యాచారం" అనే లేఖలో సంఘటన జరిగిన తేదీలను ఆగస్టు 3, 4, 5 కు బదులుగా ఆగస్టు 23, 24, 25 అని చదువుకోగోర్తాం సం॥)

రేడియో

శనివారం సెప్టెంబరు 28
శక 1896 ⁂ అశ్వయుజ 6

హైదరాబాద్ - (ఎ)

405.4 మీ. (7140 కిలోసై)

6-00వందేమాతరం: 6-10 భక్తిరంజని: 7-30 సంగీత సుధ: 7-45 చిత్రసీమ: పండంటి కాపురం, శ్రీదేవి, ఇదా లోకం, సి. ఐ. డి; 8-20 వి. ఎస్. అనంతరావు: వీణ; 12-00 ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులకు; 1-10 చిత్రసీమ: ఛైర్మన్ చలమయ్య, దోవా మరదళ్ళు, ఓ సీత కథ, భలే తమ్ముడు; 1-30 వి. ఎస్. అనంతరావు: వీణ; 2-10 లలిత సంగీతం: వరలక్ష్మి, శ్రీనివాస్, బాలసరస్వతి, లీల, ఘంటసాల; 5-30 లలిత సంగీతం; 8-00 మీరు కోరిన పాటలు; 9-15 నాటిక; 9-30 అఖిలభారత సంగీత కార్యక్రమం; 11-10 ప్రసార సమాప్తి.

విజయవాడ

357.1 మీ. (1380 కిలోసై)

6-00వందేమాతరం, 6-05 భక్తిరంజని: 7-15 సంగీత శిక్షణ (సీనియర్లకు); 7-45 రంగస్థలి; 11-45 చిత్రతరంగిణి: ప్రేమా మనుషులమే, తెలిదే బాదాయి, చిన్నవారి కలలు, మీన; 12-00 ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులకు; 1-20 కల్పలత; 2-20 బి హెచ్. కనకదుర్గాంబ. వీణ 8-30 లలిత సంగీతం: ఆర్. జి. శోభారాణి; 9-15 తార రాఘవం - నాటిక, రచన: జి. వి. సుబ్బారావు; 9-30 అఖిలభారత సంగీత కార్యక్రమం 11-00 ప్రసార సమాప్తి.

మూడేళ్ళలో రామగుండం ఎరువుల ఫ్యాక్టరీ

కలకత్తా, సెప్టెంబరు 25

బొగ్గు ప్రాతిపదికపై నిర్మింపబడనున్న రామగుండం, (ఆంధ్రప్రదేశ్) తాల్చేర్ (ఒరిస్సా), కోర్బా (మధ్యప్రదేశ్) ఎరువుల ఫ్యాక్టరీలు దాదాపు మూడేళ్ళలో పూర్తి అవుతాయని ప్రభుత్వరంగ ఎరువుల ఫ్యాక్టరీల డైరెక్టర్ డాక్టర్ యస్. కె. ముఖర్జీ గతరాత్రి యిక్కడ పత్రికలవారితో అన్నారు.

ఈ ఫ్యాక్టరీలన్నీ ఒకే విధంగా వుంటాయనీ, 2,25,000 టన్నుల నత్రజని ఎరువులను ఉత్పత్తిచేయగల ఈ ఒక్కొక్క ఫ్యాక్టరీకి రు. 110 కోట్లు ఖర్చుఅవుతాయని ఆయన అన్నారు.

బంగ్లా సరిహద్దుల్లో చౌకడిపోల మూత

అగర్తలా, సెప్టెంబరు 25

బంగ్లాదేశ్ సరిహద్దుకు 3 కిలోమీటర్ల లోపు గల చౌకడిపోలను త్రిపుర ప్రభుత్వం మూసివేసింది.

సరిహద్దుల్లో అక్రమ రవాణాను అరికట్టేందుకు బియ్యం రవాణాపై ప్రత్యేక కంట్రోలును విధించినట్లు రాష్ట్ర ప్రభుత్వం నేటి రాత్రి ఒక ప్రకటనలో తెలియచేసింది.

విషమయమైన జొన్నపంట

లక్నో, సెప్టెంబరు 25

ఉత్తర ప్రదేశ్‌లో వర్షాభావానికి గురైన ప్రాంతాలలో జొన్నపంట విషపూరితమై పోయిందని అధికార ప్రకటన తెలియజేస్తున్నది.





మహిళలను అత్యధికంగా ఆకర్షించిన చిత్రం!

కొమినేని ప్రసాద్ సమర్పించు
లక్ష్మీరమణ కంబైన్స్

ఇంటింటి కథ

2 వ, వారం

కూర్పు-దర్శకత్వం: **కె. సత్యం**
నిర్మాత: **కొకర్ల కృష్ణ**
మాటలు: రంగనాయకమ్మ
సంగీతం: రమేష్ నాయుడు
ఆంధ్ర: జ్యోతీ రిలీజ్స్-
నైజాం: ఎలైడ్ ఫిలింస్
రాయలసీమ: జయలక్ష్మీ పిక్చర్స్



ఇది చిత్రకథే కాదు!
జీవితం!!
నా అనుభవం!!!

తాతమ్మకల

పశు పక్ష్యాదులు సర్వం తమజాతిని తాము పెంపొందించుకుంటాయ్! కానిమనకెందుకీ సంకుచితత్వం? వారి వారిబాధలు; ఇబ్బందులు ప్రభుత్వానికి తెలియచెప్పాలంటే వారివారి ప్రతినిధులు శాసనసభలలో వుండాలి! అలావుండాలంటే తగినన్ని వోట్లువుంటేనేగాని తమవర్గ ప్రతినిధుల్ని ఎన్నికలలో నిలబెట్టి; గెలిపించటానికి వీలుండదు!! వర్గంబలహీనమైతే నాశనమౌతుంది— వారి గోడు వినేవారు లేక ఆవర్గం పతనం చెందుతుంది!!! ఈ ప్రజాస్వామ్య వ్యవస్థలో ఎవరు, ఏదిసాధించదలచినా వర్గబలంతోనే సాధించగలరన్నది నిర్వివాదాంశం.

ఈ సంఖ్యాబలంతోనే నేడుమనభరతదేశం ముక్కలు చెక్కలయ్యింది నేడుప్రచారంలో వున్న పద్ధతులవలంబిస్తే మరికొంతకాలానికి భరతమాత ఇంకా ముండు ముండ్లవక తప్పదేమోననిపిస్తుంది

దేశంలో నశించవలసింది సోమరితనం! పుట్టిన ప్రతివాడూ కష్టపడాలి! తినాలి!! బ్రతకాలి!!! తండ్రిచ్చిన మనవర్తిమీద బ్రతికే-బిడ్డ ఒక్కడే అయినా మనదేశానికి దండగ-సంఘానికి చీడపురుగు! అభ్యుదయగాములెందరున్నా దేశబలంపెరుగుతుంది- దేశం సుభిక్షమౌతుంది!

మా, చి॥ **బాలకృష్ణ** బ్రహ్మాండంగా నటించాడని వేలకువేలు వుత్తరాలువస్తున్నాయ్!! ఇతనునాకు అయిదవబిడ్డ!! నిజమేగా!!!

ఇదినా అనుభవం—

—అందరూ చూస్తున్నారు!
—ఆనందిస్తున్నారు!!

ఇది 5 వ, వారం

నేడే విడుదల! ఉదయం ఆటతో ప్రారంభం!

సురేష్ మూవీస్

చక్రవాకం

ఈస్ట్‌మన్‌కలర్

నిర్మాత: **డి. రామానాయుడు** దర్శకత్వం: వి. మధుసూదనరావు

కథ: ఆరికెపూడి (కోడూరి) కౌసల్యాదేవి రచన: ఆచార్య ఆత్రేయ సంగీతం: కె.వి. మహదేవన్ కెమెరా: మార్కస్ బార్ట్లే కళ: ఎస్. కృష్ణారావు కూర్పు: మార్తాండ్
విడుదల: ఆంధ్ర-సీడెడ్ నవయుగ ఫిలింస్ నైజాం: విజయా సురేష్ పిక్చర్స్ లీజ్‌రైట్సు: ఆంధ్ర (గుంటూరు జిల్లా మినహా) శ్రీ వెంకటరమణ పిక్చర్స్, కాకినాడ

విశాలాంధ్ర విజ్ఞాన సమితి తరఫున ప్రింటర్ అండ్ పబ్లిషర్: టి. వెంకటేశ్వరరావు, ఎడిటర్: సి. రాఘవాచారి. ముద్రణ: స్వతంత్ర ఆర్ట్ ప్రింటర్స్, విజయవాడ . 520004 R. No. 1138/57